f /manamnews
www.manamnews.com

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్
శుక్రవారం
20-10-2023
వెల. రూ.5
• సంపుటి : 7 • సంచిక : 261
పేజీలు : 12

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

అశ్వయుజ మాసం, శుక్రవారం, తిథి : షష్ఠి సా.11.25 వరకు, నక్షత్రం: మూల, సా:08.41 వరకు, వర్జ్యం: ఉ.05.58-07.31 వరకు, దుర్ముహూర్తం: ఉ.08.32-09.19 వరకు, రాహుకాలం: ఉ.10.34-12.00 వరకు




వివరాలు.. 2లో

## డ్యూటీలో ఉన్న జర్నలిస్టులకు ఎక్కడైనా ఓటేసే ఛాన్స్

12 అత్యవసర సేవల విభాగం వారికీ అవకాశం

కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం



# ప్రజలారా.. ఇప్పటికైనా మేల్కొనండి

**కరీంనగర్ గడ్డమీద మాటిచ్చిన సోనియా తెలంగాణను ఏర్పరిచారు**

ఎన్నో ఆకాంక్షలతో ఆవిర్భవించిన తెలంగాణను కేసీఆర్ అధోగతి పాలు చేస్తున్నారు

తెలంగాణలో కాంగ్రెస్ సునామీ సృష్టించబోతోంది

అధికారంలోకి వచ్చాక అన్ని హామీలు అమలు చేస్తాం

బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలు తోడు దొంగలు

బీజేపీకి మేలు చేకూర్చేందుకే ఎంఐఎం దేశ వ్యాప్త పోటీ

కరీంనగర్ కార్నర్ మీటింగ్‌లో రాహుల్ గాంధీ

2

కేసీఆర్ అబద్ధాల కోరు, మోదీ మోసగాడు.. ఇప్పుడు దొరల తెలంగాణ ప్రజల తెలంగాణ మధ్య యుద్ధం జరుగుతోంది.. కీలక శాఖలన్నీ ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల ఆధీనంలో.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు, రుణ మాఫీ అమలు కాలేదు.. పెద్ద పెద్ద రైతులకే రైతుబంధు లాభం... తెలంగాణకు వస్తే నాకు ఎంతో సంతోషంగా ఉంది. నాకు తెలంగాణతో ఉన్న సంబంధం... రాజకీయ సంబంధం కాదు. కుటుంబంతో ఉన్న అనుబంధం నాది. 2004లోనే తెలంగాణ ఏర్పాటుకు సానుకూలంగా ప్రకటన చేసింది. ఆ తర్వాత రాష్ట్ర ఏర్పాటుకు సోనియా నిర్ణయం తీసుకున్నారు. సింగరేణి గనులను ప్రైవేటు పరం కానివ్వం. ఇక్కడి గనులను అదానికి అమ్మే ప్రయత్నాన్ని మేమే అడ్డుకున్నాం. దేశవ్యాప్తంగా అన్ని వనరులను అదానికే మోడీ అప్పగిస్తున్నారు. కార్మికులు, రైతులకు కాంగ్రెస్ అండగా ఉంటుంది. దళితులకు మూడేకరాలని కేసీఆర్, 15 లక్షలు ఖాతాల్లో వేస్తామని మోదీ మోసం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట తప్పదు. కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం. కర్ణాటకలో మీరు ఎవరినైనా అడిగి తెలుసు కోండి..

రాహుల్ గాంధీ



## కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ...

దొరల తెలంగాణలో ప్రజాయుద్ధం..

ఆరు గ్యారంటీలపై మొదటి సంతకం..

తెలంగాణతో రాజకీయ సంబంధం కాదు... ప్రేమ ఆప్యాయత..

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ



## ర్యాపిడ్ ఎక్స్ రైళ్లు వచ్చేస్తున్నాయ్..

నేడు తొలి ర్యాపిడ్ ఎక్స్ రైలును ప్రారంభించనున్న ప్రధాని

న్యూఢిల్లీ, అక్టోబర్ 19 : వందేభారత్ ఎక్స్‌ప్రెస్ తర్వాత మరో హైస్పీడ్ ప్రాంతీయ రైలు పట్టాలెక్కేందుకు రంగం సిద్ధమైంది. ప్రయాణికుల మెరుగైన సేవలందించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో ప్రాజెక్టును రూపొందించింది. భారతీయ రైల్వే చరిత్రలో మరో అరుదైన ఘట్టానికి నాంది పడనుంది. దేశంలోనే తొలి ర్యాపిడ్ ఎక్స్ రైలు ప్రారంభం కానుంది. ఈ హైస్పీడ్ ప్రాంతీయ రైలును శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ తొలి ప్రాంతీయ హైస్పీడ్ రైలు గంటకు 160 కి.మీల వేగంతో దూసుకుపోతుంది. ఢిల్లీ-ఘజియాబాద్ రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ కారిడార్‌లో సాహిబాబాద్-దుహై డిపో మధ్య ఈ రైలు ప్రయాణించనుంది. అక్టోబర్ 20వ తేదీన ప్రధాని ఈ రైలును ప్రారంభిస్తుండగా, అక్టోబర్ 21వ తేదీ నుంచి ప్రయాణికులకు సేవలు అందుబాటులోకి రానున్నాయి. సాహిబాబాద్, దుహై డిపోల మధ్య ఉన్న 17 కి.మీల మార్గంలో ఈ ప్రాంతీయ హైస్పీడ్ రైలు ప్రయాణిస్తుంది. ఈ రైలు సాహిబాబాద్, ఘజియాబాద్, గుల్దర్, దుహై, దుహై డిపోల మీదుగా ప్రయాణిస్తుంది. అత్యాధునిక ఫీచర్లతో ఈ రైలును ప్రయాణికులకు అందుబాటులోకి

..మిగతా 2లో



## సీఎం పదవిని విడిచిపెట్టను

సీఎం పదవిపై అశోక్ గెహ్లాట్ కీలక వ్యాఖ్యలు

2



## ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదం..

భారత వైఖరిపై కాంగ్రెస్ అసంతృప్తి..

2



## డికెకి హైకోర్టులో చుక్కెదురు

ఇదంతా రాజకీయాలలో భాగమే

చట్టపరంగా ఎదుర్కొంటాం తలవంచేది లేదు: డికె శివకుమార్

2



## రామప్పను అభివృద్ధి చేసింది మేమే

రాహుల్, ప్రియాంకలు మోడీకి థ్యాంక్స్ చెప్పాలి

వాస్తవాలను వక్రీకరించి మాట్లాడారు

రాహుల్‌కు జ్ఞాపక శక్తి తగ్గినట్లుంది

రాహుల్‌కు మతిమరుపు పెరిగింది: కిషన్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 19 (మనం న్యూస్):** రామప్ప అభివృద్ధి చేసింది మోడీ అని బీజేపీ అధ్యక్షులు కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో రాహుల్, ప్రియాంక గాంధీ పర్యటిస్తున్నారు.. రామప్ప దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పీఎం మోడీకి ధన్యవాదాలు తెలపాలని, రామప్ప దేవాలయాన్ని పీఎం అభివద్ధి చేశారని కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాహుల్, ప్రియాంకలు వాస్తవాలను వక్రీకరించి మాట్లాడారని మండిపడ్డారు. రాహుల్ కు జ్ఞాపక శక్తి తగ్గినట్లు ఉందని, రాహుల్‌కు మతిమరుపు పెరిగిందని అన్నారు. వాస్తవాలు మర్చి పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్‌కు కొన్ని ప్రశ్నలు అడుగుతున్న.. రాహుల్‌కు దమ్ము ధైర్యం ఉంటే నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. 2004లో టీఆర్ఎస్‌తో

..మిగతా 2లో

## కేసీఆర్‌ది కుటుంబ పాలన అయితే మీది కుటుంబ పాలన కాదా?

మీరంతా నెహ్రూ వారసత్వం నుంచి రాలేదే

కాళేశ్వరంలో అవినీతి గురించి మీరా మాట్లాడేది

అవినీతి నేత, గజదొంగ రేవంత్ ఉన్నది ఎవరి పక్కన

బిజెపికి మేం బీ టీమ్ కాదు.. రేవంత్ బిజెపి ఏజెంట్

తెలంగాణభవన్‌లో రాహుల్‌పై నిప్పులు చెరిగిన కేటీఆర్



**హైదరాబాద్, అక్టోబర్ 19 (మనం న్యూస్):** కేసీఆర్‌ది కుటుంబ పాలన అంటున్న రాహుల్ తమదేంటో గుర్తు చేసుకోవాలని మంత్రి కేటీఆర్ అన్నారు. వారది కుటుంబ పాలన కాదా అన్ని ప్రశ్నించుకోవాలని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును రూ.80 వేల కోట్లతో నిర్మించారు. కానీ రాహుల్ గాంధీ లక్ష కోట్ల అవినీతి జరిగిందని అంటున్నడు. అమెరికాలో ఉండే ప్రపంచ పర్యావరణ కాంగ్రెస్ వాళ్లు పిలిచి కాళేశ్వరానికి అవార్డులు ఇస్తున్నారు. కానీ ఇక్కడున్న కాంగ్రెసోళ్లకు అయితే అర్థమైత లేదు. 80 వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి ఎట్ల జరుగుతది. కొంచెం బుర్రతో ఆలోచించి మాట్లాడాలి. జవహర్ లాల్ నెహ్రూ బిడ్డ ఇందిరా గాంధీ కొడుకు రాజీవ్ గాంధీ భార్య సోనియా గాంధీ కొడుకు రాహుల్ గాంధీ వచ్చి.. తెలంగాణలో కుటుంబ పాలన గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ

..మిగతా 2లో



## కాంగ్రెస్ మెనిఫెస్టో కాపీ కొట్టామనడం విడ్డూరం

కుటుంబ పాలనపై రాహుల్, ప్రియాంకలు మాట్లాడడం హాస్యాస్పదం: ఎమ్మెల్సీ కవిత

**ఆర్మూర్, అక్టోబర్ 19 (మనం న్యూస్):** కాంగ్రెస్ మెనిఫెస్టోను తాము కాపీ కొట్టామనడం, కుటుంబ పాలనపై రాహుల్, ప్రియాంకలు వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ లోని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి నివాసంలో గురువారం పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కెసిఆర్ ది కుటుంబ పాలన అయితే రాహుల వారు చేస్తున్న పాలన ఏంటని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి రాష్ట్ర నాయకులు ఇచ్చిన స్క్రిప్ట్ తప్ప తనకేమీ తెలియదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఏ రాష్ట్రంలోకి వెళ్తే ఆ రాష్ట్రంలో స్థానికంగా ఉన్న సమస్యలపై ఆయనకు అవగాహన లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 24 గంటల విద్యుత్ ఉండదని వెల్లడించారు. ఇప్పటికే గెలిచిన కర్ణాటక రాష్ట్రంలో పథకాలు అమలు కావడం లేదని కవిత

..మిగతా 2లో

## వేములవాడలో నేడే సద్దుల బతుకమ్మ వేడుకలు

అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన మున్సిపల్ అధికారులు

వేడుకలకు హాజరు కానున్న ప్రముఖులు

7



## రేవంత్‌రెడ్డి ఓ 420..



నువ్వో చిల్లరగాడివని దేశమంతా అంటున్నది

నీ మాటలు ఎవరూ నమ్మరు

నీ పార్టీ వాళ్లే నిన్ను తిడుడతున్నరు

పీసీసీ అధ్యక్షుడిపై మంత్రి ఎర్రబెల్లి మండిపాటు..!

**హైదరాబాద్, అక్టోబర్ 19 (మనం న్యూస్):** పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. కాటారం సభలో రాహుల్, రేవంత్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి 420.. తనలాగా బ్రోకర్ మాటలు అంటూ విమర్శించారు. 'నేను దద్దమ్మనే!.. అందుకే నన్ను ప్రజలు ఏడుసార్లు గెలిపించారు. నువ్వు ఒకసారి పోటీ చేసినకాడ మళ్లీ పోటీ చేయవు. ఓడిపోతున్నావు. నువ్వో చిల్లరగాడివని దేశమంతా అంటున్నది. నీ మాటలు ఎవరూ నమ్మరు. నీ పార్టీ వాళ్లే నిన్ను తిడుడతున్నరు. నువ్వు రూ.10కోట్లు, రూ.20కోట్లకు టిక్కెట్లు అమ్ముకుంటున్నవని చెబుతున్నరు. ఏబీవీపీ, టీఆర్ఎస్, టీడీపీ పార్టీలను మారి

..మిగతా 2లో



## మమ్మల్ని గెలిపిస్తే సింగరేణి సమస్యలన్నీ పరిష్కరిస్తాం

సింగరేణి ఉద్యోగులకు రేవంత్ రెడ్డి హామీ

**భూపాలపల్లి, అక్టోబర్ 19 (మనం న్యూస్):** వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే సింగరేణి ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు ఎ.రేవంత్ రెడ్డి గురువారం హామీ ఇచ్చారు. ఇక్కడ సింగరేణి కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వారి సమస్యలకు కారణమని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం సింగరేణి ఉద్యోగులు చేసిన త్యాగాలను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మరిచిపోయారని తెలిపారు. సింగరేణి గనుల ప్రైవేటీకరణకు కేంద్రం బీఆర్ఎస్ అంగీకరించిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ పార్లమెంటులో గనుల బిల్లుకు మద్దతు ఇచ్చింది అని ఆయన అన్నారు. ఒక అధికారి చాలా కాలం పాటు

..మిగతా 2లో

### మంచిమాట

ఈర్ష్య, అసూయ రెండు కనులలో నలుసులాంటివి వాటిని మనసులో నుండి తొలిగించుకుంటేనే మనం స్వచ్ఛమైన నిర్మలమైన ప్రపంచాన్ని చూడగలం ఆనందంగా ఉండగలం.

శుభోదయం

## ర్యాపిడ్ ఎక్స్ రైళ్లు వచ్చేస్తున్నాయ్..

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొచ్చారు. ఈ రైళ్లు పూర్తిగా ఎయిర్ కండిషన్డ్‌తో రూపొందించారు. సీసీటీవీ కెమెరాలు, మర్జెన్సీ డోర్ ఓపెనింగ్ మెకానిజం, మొబైల్ ఛార్జింగ్ పాయింట్, మెట్రో విధంగా రూట్ మ్యాప్‌లు, హీటింగ్ వెంటిలేషన్, ఎయిర్ కండిషనింగ్ సిస్టమ్‌తో పాటు మరెన్నో అత్యాధునిక ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ రైలు సర్వీసులు ఉంటాయి. ప్రతీ 15 నిమిషాలకు ఒక రైలు అందుబాటులో ఉంటుంది. ప్రతీ రైలులో మొత్తం 6 కోచ్‌లు ఉంటాయి.ఈ రైలులో ఒకేసారి కూర్చొని, నిలబడి మొత్తం 1700 మంది ప్రయాణించచ్చు. స్టాండర్డ్ కోచ్‌లో మినిమం టికెట్ ధర రూ.20, గరిష్ట ధర రూ.50గా నిర్ణయించారు. ఇక ప్రీమియం కోచ్‌లో మినిమం ధర రూ.40, మ్యాగ్జిమం ధర రూ.100గా నిర్ణయించారు. స్టాండర్డ్ కోచ్‌లో మొత్తం 72 సీట్లు, ప్రీమియం కోచ్‌లో 62 సీట్లు ఉంటాయి. ప్రతీ రైలులో మహిళలకు ప్రత్యేకంగా ఒక కోచ్‌ను ఏర్పాటు చేశారు.

## ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదం..

న్యూఢిల్లీ, అక్టోబర్ 19: ఇజ్రాయిల్-పాలస్తీనా హమాస్ యుద్ధంలో భారత ప్రభుత్వం ప్రదర్శిస్తున్న వైఖరిపై కాంగ్రెస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నేత కేసీ వేణుగోపాల్ సోషల్ మీడియాలో విమర్శించారు. పాలస్తీనాపై భారత్ అవలంభిస్తున్న వైఖరి తీవ్రంగా నిరాశపరించిందని అన్నారు. అమాయకులు, నిస్సహాయులైన మహిళలు, పిల్లలు ఎదురుకాల్పుల్లో చిక్కుకున్నప్పుడు బలమైన వైఖరి లేకుండా భారతదేశం ఎలా నిలబడగలదు..? ఇజ్రాయిల్-పాలస్తీనా సమస్యపై భారత ప్రభుత్వం వైఖరి తీవ్ర నిరాశకు గురిచేసిందని అన్నారు. ఈ వివాదంపై మొదటి నుంచి భారత్ విధానం భిన్నంగా ఉందని ఆయన ఆరోపించారు. భారతదేశం పాలస్తీనా వాదానికి మద్దతు ఇస్తుందని, వారి హక్కుల కోసం పోరాడిందని కేసీ వేణుగోపాల్ ఫేస్‌బుక్‌లో మలయాళంలో పోస్టు చేశారు. దురాక్రమణ, ప్రతిదాడుల విషయంలో భారత్ తీవ్రంగా ఖండించేది, అయితే దురదృష్టవశాత్తు ప్రస్తుత భారత వైఖరి యుద్ధం ముగించడానికి సరిపోదని అన్నారు. ఇంతే కాకుండా గతంలో మాదిరిగా ఈ అంశంపై ప్రభుత్వం అభిప్రాయాలను గౌరవంగా, మర్యాదగా తెలియజేయాలని ఆయన కోరారు. ఇజ్రాయిల్, పాలస్తీనా అనే తేడా లేకుండా రెండు దేశాలు అంతర్జాతీయ మానవతా చట్టాలకు కట్టుబడి ఉండాలని ఆయన సూచించారు. ఇజ్రాయిల్‌లో మహిళలు, పిల్లలు, బలహీన పౌరులపై హమాస్ చేసిన చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సమర్థించలేమని, అయితే అలాంటి పరిస్థితులకు దారి తీసిన చారిత్రక నేపథ్యాన్ని పరిశీలించడం చాలా అవసమని ఆయన అన్నారు.

## సీఎం పదవిని విడిచిపెట్టను

రాజస్థాన్, అక్టోబర్ 19 : రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని వదిలివేయాలని నేను భావిస్తున్నప్పటికీ అది నన్ను వదలడం లేదని, బహుశా అది నన్ను వదలకపోవచ్చుని రాజస్థాన్ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ వృద్ధ నాయకుడు అశోక్ గెహ్లాట్ అన్నారు. గురువారం నాడిక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి సారథ్యం వహించే అవకాశాన్ని పార్టీ అధిష్టానం తనకు మూడుసార్లు అప్పగించడానికి కారణం తనలో ఏదో ఉండి ఉండవచ్చని, ఏదేమైనా ఈ విషయంలో పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయాన్ని అందరికీ ఆమోదయోగ్యం ఉంటుందని అన్నారు. 2020లో అప్పటి ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ నేతృత్వంలో గెహ్లాట్ ప్రభుత్వం తిరుగుబాటును ఎదుర్కోవలసి వచ్చింది. అయితే పార్టీ అధిష్టానం జోక్యంతో అసమ్మతి మంటలు చల్లారిపోయాయి. అప్పటి పరిణామాలను గెహ్లాట్ ప్రస్తావిస్తూ మన్నించడం, మరచిపోవడం అనే విధానాన్ని అవలంబించి తాను ముందుకుపోయానని చెప్పారు. ప్రతిపక్ష నాయకులపై ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆదాయం పన్ను శాఖ జరుపుతున్న దాడుల పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఎన్నికల ప్రవర్తనావళి అమలులో ఉన్నందున వెంటనే వీటిని ఆపడానికి ప్రధాని జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. పార్టీ టికెట్ల కేటాయింపుపై పార్టీలో విభేదాలు ఏమైనా ఉన్నాయా అన్న ప్రశ్నకు ఎటువంటి విభేదాలు లేవని, ఏకాభిప్రాయంతోనే అన్ని నిర్ణయాలు జరుగుతున్నాయని గెహ్లాట్ చెప్పారు. ఇదిలా ఉండగా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ ఎన్నికల కమిటీ నిర్వహించిన సమావేశానికి సచిన్ పైలట్ డుమ్మా కొట్టడం చర్చనీయాంశమైంది. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నవంబర్ 25న జరగనున్నది. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

## డికెకు హైకోర్టులో చుక్కెదురు

బెంగళూరు, అక్టోబర్ 19 : కర్నాటక ఉపముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రముఖ నేత డికె శివకుమార్‌కు గురువారం కర్నాటక హైకోర్టులో చుక్కెదురైంది. లెక్కల్లోకి రాని, ఆదాయానికి మించిన ఆస్తులపై సిబిఐ తనపై దాఖలు చేసిన కేసును కొట్టివేయాలని డికె క్యాష్ పిటిషన్ పెట్టుకున్నారు. తనకు న్యాయస్థానంపై, చట్టాలపై అపార విశ్వాసం ఉందని అన్నింటిని ఎదుర్కొంటానని కాంగ్రెస్ నేత, డిప్యూటీ సిఎం డికె శివకుమార్ తెలిపారు. హైకోర్టు రూలింగ్, క్యాష్ పిటిషన్ కొట్టివేత తరువాత గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. న్యాయపరంగా తాను సిబిఐ కేసును ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలలో బిజెపి కుట్ర స్పష్టంగా కన్పిస్తోందని విమర్శించారు. జెడిఎస్ నేత కుమారస్వామి తనను తీహార్ జైలుకు పంపిస్తారని చెపుతున్నారని , ఇటువంటి వాటికి బెదిరేది లేదని పిసిసి నేత కూడా అయిన డికె తెలిపారు. బిజెపి ఆదేశాలతోనే సిబిఐ రంగంలోకి దిగిందని, తన తన భార్య ఆస్తుల గురించి సిబిఐ దర్యాప్తు జరిపిందని అయితే ఇంతవరకూ వీటిపై సిబిఐ తమను ఏమీ అడగలేదని తెలిపిన డికె ఇప్పటికే సిబిఐ దర్యాప్తు పూర్తి అయ్యి ఏదో నిర్ధారణకు వచ్చినట్లు చెప్పడం ఏం న్యాయం అన్నారు. అరెస్టుల బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ పనిగట్టుకుని వేధింపులకు దిగుతోందని భావిస్తున్నారా? అని విలేకరులు ప్రశ్నించగా 'అయ్యి ఉండొచ్చు.. ఇదంతా రాజకీయాలలో భాగమే' అన్నారు.

## రేవంత్‌రెడ్డి ఓ 420..

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్‌కు వచ్చావు. నువ్వు వచ్చినంకనే.. కాంగ్రెస్ నాశనం అయ్యింది మా పార్టీ వాళ్లే అంటున్నరు. ఓటుకు నోటు కేసులో జైలుకు పోయి వచ్చినోడు రాసిస్తే.. రాహుల్ గాంధీ చదువుతున్నా డు' అంటూ విమర్శించారు. రాహుల్ గాంధీకి కాళేశ్వరం ప్రాజెక్టు.. సింగరేణి గురించి ఏం తెలుసని ప్రశ్నించారు. 60 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ఇలాంటి ప్రాజెక్టు ఎక్కడైనా కట్టారా? కాళేశ్వరం ప్రాజెక్టు విలువ కూడా తెలియదని, లక్ష కోట్ల అవినీతి ఎలా జరిగిందని ప్రశ్నించారు. ఎవరో రాసిస్తే మాట్లాడడం కాదని.. ఇక్కడ జరుగుతున్న అభివద్ధిని చూసి మాట్లాడాలని.. తనను విమర్శించిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారని మంత్రి దయాకర్‌రావు స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ..

పెద్దపల్లి, అక్టోబర్ 19 (మనం ప్రతినిధి): తెలంగాణతో నాకు రాజకీయ సంబంధం కాదని, ప్రేమ ఆప్యాయత, అనురాగాల బంధమని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. గురువారం పెంద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఈ బంధం నెహ్రు, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల నుండి ఉందని ఆనందం వ్యక్తం చేశారు. తమకు రాజకీయ నష్టం జరిగినా ప్రజల పక్షాన ఉండి పోరాటం చేశానని అన్నారు. దొరల తెలంగాణ పాలన నుంచిప్రజా తెలంగాణ యుద్ధం జరుగబోతోందని పేర్కొన్నారు. ఒక వైపుసీఎం మరోవైపు అధికారులను ఆధీనంలో ఉంచుకొని చేస్తున్న పాలన ప్రజలకు నష్టం కలిగిస్తున్నదని అన్నారు. కేసీఆర్





ముఖ్యమంత్రిగా కాకుండా ఒక నియంత రాజులా వ్యవహరిస్తూ, ప్రాజెక్టు నిర్మాణాలను చేపట్టి, లక్షల కోట్ల అవినీతి పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలకు కాళేశ్వరం ప్రాజెక్టుతో ఏం లాభం చేకూరిందని, ధరణి ఫోర్టల్ ఏర్పాటు చేయడంలో భూములన్ని తన ఆధీనంలో ఉంచుకున్నారని. ధరణి పోర్టల్ ద్వారా రైతుల భూములు దోచుకున్నారని ఆరోపించారు. రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తానని చెప్పి చేయలేదని, రైతు బంధు వలన దొరలకే లాభం జరిగిందని ఎద్దేవా చేశారు. గతంలో కూడా ఆదాని లాంటి పెట్టుబడి దారులకు సింగరేణి సంస్థ బొగ్గులను అమ్మడానికి ప్రయత్నించినప్పుడు అడ్డుకున్నానని వివరించారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ కంపెనీలను ప్రైవేటి పరం చేస్తూ కార్మికులను నట్టేట ముంచడానికి ప్రధాని మోదీ వ్యూహరచన చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ వరం చేయడమే మోదీ లక్ష్యమని అన్నారు. మోదీ ప్రతి పేదవారికి రూ.15లక్షల రూపాయలు బ్యాంకు ఖాతాలో వేస్తామని చెప్పి మోదీమోసం చేశారని గుర్తు చేశారు. దళితులకు గిరిజనులకు సీఎం కేసీఆర్ అబద్దాలు చెప్పారని అన్నారు. విద్యార్థుల ప్రాణత్యాగాలను చూసి సోనియాగాంధీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించిం దన్నారు. తెలంగాణరాష్ట్రం ఏర్పడకుంటే కేసీఆర్, వారి కుటుంబం దర్గా, బిర్ల మందిర్ వద్ద అడుక్కుతినేవారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటకలో గెలిపొందిన అనంతరం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ గెలిచిన అనంతరం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటానని ఆయన స్పష్టం చేశారు. తనపై 26కేసులు నమోదు చేయడమే కాకుండా పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేశారని, తన కుటుంబాన్ని ఇంటినుండి పంపించిన మోదీ ప్రభుత్వం, సీఎం కేసీఆర్‌పై ఇంత వరకు ఈడీ కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వలన అనేక లాభాలు కాంట్రాక్టర్లకే దక్కిందన్నా రు. తెలంగాణలో బీఆర్ఎస్, డిల్లీలో బీజేపీ పాలనతో ప్రజలను పదేళ్లు ఇబ్బందులకు గురి చేశారన్నారు. కుల గణన గురించి ఇది వరకు మాట్లాడామని, కానిప్రధాని ఓబీసీ మాట ఎత్తడమే తప్పా ఎక్కడా కూడా కుల గణన మీద మాట్లాడలేదని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ తుఫాన్ వీస్తోందని, కాంగ్రెస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో పెద్దపల్లి అభ్యర్థి విజయరమణారావు భారీ మోజార్టీతో గెలిపించాలని కోరారు. ఈబహిరంగ సభలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, మానిక్ ఠాక్రే, సీఎల్పీ నేతలు బట్టి విక్రమార్గ, ఉత్తం కుమార్‌రెడ్డి, రోహిత్ చౌదరి, దామెర నర్సింహ, కొమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షులు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్యేలు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, మధుయాష్కీ, జీవన్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, కోట శ్రీనివాస్ గౌడ్, పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి చింతకుంట విజయరమణారావుతో పాటు ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలారా.. ఇప్పటికైనా మేల్కొనండి

కరీంనగర్, అక్టోబర్ 19 (మనం బ్యూరో): కరీంనగర్ గడ్డ మీద.. ఇక్కడ ప్రజల సాక్షిగా సోనియాగాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టుకుని తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఆవిర్భవింపజేశారు.. రాష్ట్ర ప్రజల ఎన్నో ఆకాంక్షలతో ఏర్పాటైన తెలంగాణను కెసిఆర్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో అధోగతి పాలు చేసింది... అవినీతి, అక్రమాలతో రాష్ట్ర ప్రతిష్టను దిగజారుస్తున్నారు.. ప్రజలారా.. ఇప్పటికైనా మేల్కొనండి.. అవినీతి, నిరంకుశ పాలనకు చరమగీతం పాడుతూ, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించండి'' అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. గురువారం సాయంత్రం కరీంనగర్ జిలా కేంద్రంలోని రాజీవ్ చౌక్ వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న ఆయన బిజెపి, బిఆర్ఎస్, ఎంఐఎంలపై నిప్పులు చెరిగారు. 2004లో కరీంనగర్‌కు వచ్చిన సోనియా గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ఏర్పాటు చేసిందని, దానికి అనుగుణంగా ఈ ప్రాంత ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. నాలుగు కోట్ల మంది ఈ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, ఆశలను కెసిఆర్ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మద్యం సహా అనేక వ్యాపారాలు కెసిఆర్ కుటుంబ సభ్యుల చేతుల్లోనే ఉన్నాయన్నారు. ఇటు రాష్ట్రంలో బిఆర్ఎస్, అటు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాలు కుట్రపూరిత పాలనను సాగిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. బిజెపి, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు తోడు దొంగలని వ్యాఖ్యానించారు. కెసిఆర్‌కు బిజెపికి మధ్య ఉన్న సంబంధం కారణంగానే ఆయన వెంట ఇడి, సిబిఐలు పడడం లేదన్నారు. బిజెపితో కుదిరిన చీకటి ఒప్పందం కారణంగానే ఆ పార్టీకి మేలు చేకూర్చేందుకు ఎంఐఎం దేశవ్యాప్తంగా పోటీ చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నిరంకుశ విధానాన్ని ప్రశ్నించినందుకే తనపై పాతిక కేసులు పెట్టించారని, తన లోక్ సభ సభ్యత్వాన్ని సైతం లాక్కున్నారని వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎంలు ఎన్ని కుట్రపూరిత రాజకీయాలు చేసినా రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సునామీ సృష్టించనుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను తప్పక నెరవేరుస్తామని ఆయన హామీనిచ్చారు.

# కేసీఆర్‌ది కుటుంబ పాలన అయితే మీది కుటుంబ పాలన కాదా ?

(మొదటిపేజీ తరువాయి)

భవన్‌లో ఏర్పాటు చేసిన వికలాంగుల పెన్షన్ లబ్ధిదారుల కృతజ్ఞత సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్‌ది కుటుంబ పాలన అని అంటున్న రాహుల్ గాంధీ ఎవరని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ ఒకే వేదిక మీద నిలబడొచ్చు. సోనియా గాంధీ అదే వేదిక మీద ఉండొచ్చు. అప్పుడప్పుడు చనిపోయిన ఇందిరా గాంధీని, రాజీవ్ గాంధీని, నెహ్రూని యాది చేసుకోవచ్చు. కానీ కేసీఆర్‌ది మాత్రం కుటుంబ పాలన అంటరు. ఇదెక్కడి నీతి నాకర్థం కాదు. గొంగడిలో కూర్చొని ఎవడన్న వెంట్రుకలు ఏరుతాడా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని రాహుల్ మాట్లాడుతున్నారని కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాహుల్ గాంధీతో వచ్చిన బాధ ఏంటంటే.. ఆయన లీడర్ కాదు.. రీడర్. ఏం రాసిస్తే అది చదువుతాడు పాపం. ఆయనకేం తెల్వదు.. తెల్లకాగితం. తెలుసుకునే ప్రయత్నం కూడా చేయడు అని రాహుల్‌పై కేటీఆర్ మండిపడ్డారు.కేసీఆర్ అవినీతి పరుడు అని రాహుల్ అంటున్నడు.. మరి రాహుల్ పక్కకు గజదొంగ రేవంత్ ఉన్నాడనే విషయాన్ని మరిచిపోవద్దని కేటీఆర్ సూచించారు. అంతకంటే పెద్ద గజదొంగ ఈ దేశంలో ఎవడైనా ఉన్నాడా..? ఆయన ముందు దావూద్ ఇబ్రహీం, చార్లెస్ శోభరాజు కూడా చిన్నోళ్లు. ఆనాడు ఓటుకు నోటు.. ఇప్పుడు సీటుకు రేటు. ఓటుకు నోటు.. సీటుకు రేటు.. రేపు రాష్ట్రమంతా అమ్ము తడు. బీజేపీకి కాంగ్రెస్ పార్టీని అమ్మిపారేస్తడు. అలాంటి వ్యక్తిని పక్క న కూర్చొబెట్టుకుని ఇవాళ రాహుల్ అవినీతి గురించి మాట్లాడుతున్నా డు. పీసీసీ అధ్యక్షుడే పైసలు పంచుకుంటూ దొరికిపోయిన దగుల్బాజీ. రూ. 50 కోట్లు మీ ఇంచార్జికి లంచం ఇచ్చి పీసీసీ అధ్యక్ష పదవి తెచ్చుకున్న దొంగ రేవంత్. ఇది వాస్తవమో కాదో తెలుసుకోవాలంటే.. మీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని పక్కకు పిలిచి అడిగినా చెప్తడు. ఇక్కడ సీట్లు ఎక్కడ అమ్ముతున్నడు. ఎక్కడ విల్లాలు రాయించుకుంటున్నడు. ఎక్కడ ఎలాట్లు రాయించుకుంటున్నడు. కొద్దిగా ఎంక్వైరీ చేయించుకో రాహుల్ గాంధీ. ఓ పది మంది కాంగ్రెస్ నాయకులను పక్కకు తీసుకె ళ్లి మాట్లాడి వాస్తవాలు తెలుసుకో. నీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులను పిలి చి మాట్లాడు రేవంత్ బండారం బయటపడ్తది. దొంగను పక్కన కూ ర్చొబెట్టుకుని మాట్లాడుతుంటే.. గురివింద గింజ తన నలుపు ఎరుగ దు అన్నట్లు ఉన్నది కథ అని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఎవరికి బీ టీమ్ కాదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ బీజేపీకి బీ టీమ్ అని మాట్లాడిన రాహుల్ గాంధీపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. బీజేపీకి బీ టీమ్ అని రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారు.. మేం బీజేపీ బీ టీమ్ కాదు.. మీరు ఈ దే శానికి సీ టీమ్. సీ టీమ్ అంటే ఏంది.. చోర్ టీమ్ మీరు.. చోర్ టీమ్ అని కేటీఆర్ విమర్శించారు. ఏ టు జడ్ కుంభకోణాలు చేసిన దగు ల్బాజీ పార్టీ కాంగ్రెస్ పార్టీ అని నిప్పులు చెరిగారు. ఏ అంటే ఆదర్శ్, బీ అంటే భోఫోర్స్, సీ అంటే కామన్వెల్త్.. ఇలా చెప్పుకుంటూ పోతే జడ్ దాకా ఉన్నాయి. ఆకాశం నుంచి పాతాళం దాకా దోచుకున్న పార్టీ, దగుల్బాజీ పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ధ్వజమెత్తారు. ఆకాశంలో ఎగిరే అగస్త్య హెలికాప్టర్ నుంచి పాతాళంలో ఉండే బొగ్గు దాకా దేన్ని వదల కుండా దోచుకున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ. కుంభకోణాల్లో స్వయంగా మీ కేంద్ర మంత్రులు జైళ్లకు పోయారు. ఇవాళ ఆఖరికి నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మీద ఈడీ విచారణ జరుగు తోంది. మేం బీ టీమ్ కాదు.. ఈ దేశానికి మీరే సీ టీమ్. రేపటి రోజు న అల్టిమేట్‌గా.. ఇక్కడ పది మంది గెలిచినా, పన్నెండు మంది గెలిచి నా.. వారిని రేవంత్ రెడ్డి తీసుకెళ్లి బీజేపీలో గంపగుత్తగా చేరుతాడు. ఇవాళ రాసిపెట్టుకోండి.. మీడియా ముఖంగానే చెబుతున్నాను. రేవంత్ రెడ్డి సంగతి మీకు తెలియదు రాహుల్ గాంధీ. రేవంత్ బీజేపీ కోవర్ట్. కాంగ్రెస్‌లో బీజేపీ ఏజెంట్ ఆయన. బీజేపీ తెచ్చి మీ కాంగ్రెస్ పార్టీలో ఇరికించింది. మీకు తెలియక గాడ్సేకు గాంధీ భవన్‌ను అప్పజెప్పారని రాహుల్ గాంధీపై కేటీఆర్ ధ్వజమెత్తారు.

# డ్యూటీలో ఉన్న జర్నలిస్టులకు ఎక్కడైనా ఓటేసే ఛాన్స్

న్యూఢిల్లీ, అక్టోబర్ 19 : త్వరలో ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరం రాష్ట్రాల శాసనసభ సాధారణ ఎన్నికల్లో తొలిసారిగా జర్నలిస్ట్‌లకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సదుపాయాన్ని కల్పించింది. అయితే ఆరోజు జర్నలిస్ట్‌లు ఎన్నికల వార్తల సేకరణ విధుల్లో ఉండాలి. అంతే కాకుండా ఎన్నికల కమిషన్ నుంచి పాసులు పొందాల్సి ఉంటుంది. జర్నలిస్ట్‌లతో పాటు ఎన్నికలతో సంబంధం లేని 12 అత్యవసర సేవల రంగానికి చెందిన ఉద్యోగులు సైతం ఇకపై పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. చాలా మంది అత్యవసర సేవల రంగాల్లో ఉద్యోగాలు చేస్తూ ఉద్యోగ స్వభావం రీత్యా ఓటు హక్కు ఉన్న ప్రాంతానికి దూరంగా ఉంటున్నారు. వారు తమ ఓటు హక్కును వినియోగించుకోలేని పరిస్థితి ఉంటోంది. ఈ నేపథ్యంలో వీరికి సైతం ఓటు హక్కు కల్పిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 10న ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 60(సీ) కింద ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు సైతం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశాయి. ఇప్పటివరకు కొంత మందికి మాత్రమే బ్యాలెట్ ఓటు వేసే అవకాశం ఉండేది. వారిలో ఎన్నికల విధుల్లో పనిచేసే సిబ్బంది, సర్వీసు ఓటర్లు (సాయుధ బలగాలు), ప్రవాస ఓటర్లు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకు నేవారు. అయితే ఈ సారి ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. 40 శాతం, ఆపై వైకల్యం కలిగిన దివ్యాంగులు, 80 ఏళ్లకు పైబడిన ఓటర్లకు ప్రస్తుత శాసనసభ ఎన్నికల్లో తొలిసారిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని కల్పించనుంది. అలాగే జర్నలిస్టులు, ఎన్నికల విధులతో సంబంధం లేని అత్యవసర సేవల విభాగాల ఉద్యోగులకు సైతం పోస్టల్ సదుపాయం కల్పిస్తోంది. జర్నలిస్టులు, అత్యవసర విభాగాల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించడానికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. నోడల్ అధికారుల వద్ద ఫారం?12డీ అందుబాటులో ఉంచాలని కోరింది. బ్యాలెట్ ఓటు వేయదలిచిన వారు దానిని నింపి స్థానిక ఎన్నికల అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. వచ్చే నెల 3న ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. అప్పటి నుంచి 5 రోజుల్లోగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోరుతూ 'ఫారం?12డీ' దరఖాస్తులను స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. నవంబర్ 7 నాటికి దరఖాస్తులు రిటర్నింగ్ అధికారికి చేరితే వారికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించడానికి ఏర్పాట్లు చేస్తారు. కేంద్ర ఎన్నికల కమిషన్ పలు విభాగాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే అవకాశం కల్పిస్తోంది. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ రైల్వే, ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ), పౌర సరఫరాల శాఖ, బీఎస్ఎన్ఎల్, పోలింగ్ రోజు వార్తల సేకరణ కోసం ఎన్నికల సంఘం నుంచి పాస్ పొందిన జర్నలిస్ట్‌లు, అగ్నిమాపక శాఖ అధికారులు బ్యాలెట్ ఓటు వేయొచ్చు.

## కాంగ్రెస్ మెనిఫెస్టో కాపీ కొట్టామనడం విడ్డూరం

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఒకరు 5 గంటలు మరొకరు 3 గంటల కరెంటు ఇస్తామని చెప్పడం వారిపై వారికే క్లారిటీ లేదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ అంచనా వ్యయం లక్ష కోట్లు అయితే అవినీతి లక్ష కోట్లు జరిగిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బిఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను అన్ని రాష్ట్రాల్లో కాపీ కొడుతూ మేమేదో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కాపీ కొట్టామని చెప్పడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర పథకాలు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతు బంధు, పథకాలను ఇతర రాష్ట్రాల్లో కాపీ కొట్టి తాము ఇస్తున్న పథకాలు అమలు చేస్తున్నా రని ఆమె ఆరోపించారు. ఈ సమావేశంలో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, హెల్త్ అండ్ ఫ్యామి లీ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ మధు శేఖర్, ఆర్మూర్ మున్సి పల్ చైర్మన్ పండిత్ వినీత పవన్, వైస్ చైర్మన్ మున్ను, సర్పంచు లు, స్థానిక కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## మమ్మల్ని గెలిపిస్తే సింగరేణి సమస్యలన్నీ పరిష్కరిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగినందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందించారు. సింగరేణి ఉద్యోగుల సంఘం ఎన్నికల నిర్వహణలో జాప్యం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్య మంలో సింగరేణి ఉద్యోగులు చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేశారు. 'ఉద్యమంలో పాల్గొనేందుకు మీరు అన్నీ పక్కన పెట్టేశారు. మీరు సకల జనుల సమ్మెలో పాల్గొనకుంటే తెలంగాణ రాష్ట్రం వచ్చేది కా దు' అని అన్నారు. అధికారంలో ఉండి ఉద్యోగుల పక్షాన నిలుస్తున్నా మని చెబుతున్నా సింగరేణి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించ డంలో బీఆర్ఎస్ విఫలమైందని కాంగ్రెస్ నేతలు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణకు మద్దతివ్వాలని సింగరేణి ఉద్యోగులకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ పాల్గొనే విజయభేరి యాత్రలో భాగంగా టీపీసీసీ చీఫ్ భూపాలపల్లికి చేరుకున్నారు.

## రామప్పను అభివృద్ధి చేసింది మేమే

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ పొత్తు పెట్టు కాలేదా? అధికారం పంచుకోలేదా? మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉంటే కేసీఆర్ కేంద్ర మంత్రిగా లేరా? రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్‌లో టీఆర్ఎస్ వాళ్ళు మంత్రులు కాలేదా? 2014లో కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు.. ఏ పార్టీలోకి వెళ్లి చేరారు? ఎవరికి ఓటు వేస్తే ఎవరికి లాభం జరిగింది? కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో చేరి కేసీఆర్ కు మడుగులు వత్త లేదా? అంటూ ప్రశ్నించారు. బీజేపీ జాబితా సిద్దం కాగానే చెప్తామని అన్నారు. రాజాసింగ్ వ్యవహారం మా అంతర్గతం అన్నారు. సస్పెన్స్ ఎత్తివేస్తే రాజాసింగ్ పోటీలో ఉంటారని స్పష్టం చేశారు. నేడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో సమావేశమవుతామని తెలిపారు. అభ్యర్థుల కసరత్తు ప్రారంభం చేశామన్నారు. ఎవరికి ఎవరు బిటిమ్.. కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ బిటీమ్ అన్నారు. 2013లో టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో మెర్జ్ చేసేందుకు చర్చలు జరగలేదా? అని ప్రశ్నించారు. ఎవరికి ఎవరు బీటిమో రాహుల్ చెప్పాలి? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రేవంత్‌పై ఓటుకు నోటు కేసు ఏమయింది? ఎందుకు తొక్కి పెట్టారు? అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు మధ్యవర్తిగా మజ్లిస్‌ను పెట్టుకున్నారని మండిపడ్డారు. మూడు పార్టీలు కలిసి అట ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు పార్టీలు ఒక్కటే అం టూ కీలక వ్యాఖ్యలు చేశారు. పూర్తి అవగాహనతో మూడు పార్టీలు పని చేస్తున్నాయని సంచలన వ్యాఖ్యాలు చేశారు. రాహుల్ చర్చలు సిద్దమా? అని సవాల్ విసిరారు.

## వృద్ధులకు బట్టల పంపిణీ



కొండపాక, అక్టోబర్ 19, (మనం న్యూస్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో గ్రామ మాజీ సర్పంచ బతుకమ్మ, దసరా సందర్భంగా వృద్ధులకు బట్టలు పంపిణీ చేశారు. కుకునూరుపల్లిలో మాజీ సర్పంచ్ బోధనపట్ల ఐలం శివ సుమారు వంద మందికి బట్టలు పంపిణీ చేసి తన ధాతృత్వాన్ని చాటుకున్నారు.

## ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో బెజ్జంకి




బెజ్జంకి, అక్టోబర్ 19, (మనం న్యూస్): 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు రెగ్యులర్ కోర్సులతో పాటు నాలుగు సంవత్సరాల వృత్తి విద్య కోర్సులు (ఒకేషనల్) అయినటువంటి అపారల్, మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. పది రోజుల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు అనుమతిని ఇచ్చినందుకు అపారల్ ఒకేషనల్ ట్రైనర్ నజియా మేడం, మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ వొకేషనల్ ట్రైనర్ రమ్య మేడం ప్రిన్సిపల్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. 12వ తేదీ నుండి అక్టోబర్ 21వ తేదీ వరకు 10 రోజుల విద్యతోపాటు వృత్తివిద్యా ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం వలన అపారల్ కోర్సు, మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ చదువుతున్న విద్యార్థులకు నిజ జీవిత అనుభవాలతో పాటు శిక్షణ భవిష్యత్తులో స్వయం ఉపాధి అవకాశాలు కల్గిస్తాయని ప్రిన్సిపల్ హర్జిత్ కౌర్ తెలియజేశారు.


## శ్రీ మహామ్మాయి దేవి ఆలయంలో ఘనంగా కుంకుమ పూజలు



చేర్యాల, అక్టోబర్ 19, (మనం న్యూస్): చేర్యాల పట్టణ కేంద్రంలోని శ్రీ మహమ్మాయి దేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం ఘనంగా కుంకుమార్చనలు, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం నేతృత్వంలో ఆలయ పూజారి పానుగంటి తిరుపతయ్యచారి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పి. ఆంజనేయులు, కార్యదర్శి ఎం. నర్సింహులు, కోశాధికారి కాసుల చిన్న శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు గురుమూర్తి, శ్రీహరి, కుమార స్వామి, కమిటీ మెంబర్లు మల్లేశం, కృష్ణమూర్తి, భరత్ కుమార్, విష్ణువర్ధన్, ముఖ్య సలహాదారులుగా ఉప్పల ప్రభాకర్, బి. లక్ష్మీనారాయణ, కాసుల కుమార్ పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి బిఆర్ఎస్ పథకాలు దోహదం

- బిఆర్ఎస్‌లో చేరిన మూర్తి కర్ణాకర్‌రెడ్డి
- పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎంపి ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాక, అక్టోబర్ 19, (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెడుతున్న పథకాలకు ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగిందని మూర్తి కర్ణాకర్‌రెడ్డి అన్నారు. గురువారం రోజున ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎంపి బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, రైతుబీమా, ఆసరా పింఛన్ అందిస్తున్నారని, రైతులు చల్లగా ఉండాలని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అలాంటి నాయకున్ని మరొకసారి ముఖ్యమంత్రిని చేయాలనే ఉద్దేశంతో నేడు బిఆర్ఎస్‌లో చేరడం జరిగిందన్నారు. నేడు జరిగే ఎన్నికల్లో కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నేడు బిఆర్ఎస్‌లో మూర్తి కర్ణాకర్‌రెడ్డి చేరడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. పార్టీలో చేరిన ప్రతి వ్యక్తికి సముచిత న్యాయం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మచ్చ వేణుగోపాల్, పద్మనాభునిపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# రంగంలోకి కేసీఆర్

- గజ్వేల్‌పై స్పెషల్ ఫోకస్
- అసంతృప్తులను బుజ్జగించే యత్నం
- ఒక్కటిగా వెళ్దామంటూ సూచన
- ఈ నెల 20న ప్రత్యేక సమావేశం

సిద్దిపేట, అక్టోబర్ 19, (మనం న్యూస్ ప్రతినిధి): గజ్వేల్ నియోజకవర్గంలో ఇటీవల బిఆర్ఎస్ పార్టీలో నెలొకిన్న ముసలాన్ని పరిష్కరించే బాధ్యత స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆరే భుజాన వేసుకుంటున్నట్లు అత్యంత విశ్వసనీయంగా తెలుస్తుంది. ఒక వైపు రాబోయే సార్వత్రిక ఎన్నికల కోసం ఒకేసారి అభ్యర్థుల ప్రకటన, బి ఫామ్‌ల అందజేత, నియోజకవర్గ పర్యటనతో కేసీఆర్ బిజీ బిజీ ఉండగా ఒక్కసారిగా గజ్వేల్‌లో కేసీఆర్ మమ్మల్ని పట్టించుకోవడం లేదంటూ ఓ వర్గం బాహాటంగానే విమర్శలు వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. టీ కప్పులో తుఫానులా ఉన్న అసంతృప్తులను ఇలాగే వదిలిస్తే చిలికి చిలికి గాలివానలా మారుతుందనే భయంతో, ఆ పరిస్థితులు రావద్దనే ఉద్దేశంతో అందరం సమిష్టిగా పని చేద్దాం విజయంలో భాగస్వాములమవుదాం అనే సంకేతాన్ని బలంగా పంపించేందుకు స్వయానా కేసీఆరే రంగంలోకి దిగుతున్నారు. ఇటీవల నెలకొన్న తాజా పరిస్థితులపై కేసీఆర్ ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ వివరాలను తెలుసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఒక వైపు బీజేపి నుండి ఈటెల రాజేందర్ పోటీ చేస్తారనే ఊహాగానాలు, మరో వైపు బిఆర్ఎస్‌లో నెలకొన్న అసంతృప్తి చివరకు ఎక్కడికి దారి తీస్తుందోనన్న ఉద్దేశంతో స్వయానా అన్నింటికీ ఫుల్‌స్టాప్ పెట్టేందుకు కేసీఆరే రంగంలోకి దిగుతున్నాడురు.

### – ఈనెల 20న భేటి



నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో కేసీఆర్ ప్రత్యేక సమావేశం అవుతున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గానికి శివారులో సికింద్రాబాద్ వెళ్లే దారిలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఈనెల 20న జరిగే సమావేశానికి ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఆయా గ్రామ పార్టీల అధ్యక్షులు, జిల్లా, మండల స్థాయి నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు, ఇందుకు ప్రతి ఒక్కరికి సమాచారం చేరినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా కేసీఆర్ తమతో మాట్లాడితే తప్ప నిర్ణయం తీసుకుంటామని అల్టిమేటం ఇచ్చిన క్రమంలో వాటన్నింటికీ చెక్ పెట్టేందుకు స్వయానా అధినేతే అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

### – అసంతృప్తులు శాంతించేలా

ఈ నెల 20వ తేదీన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇటీవల బిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా గళం విప్పిన వారంతా మళ్లీ గాడిలో పడతారా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సమావేశమైన ముఖ్య నేతలంతా ప్రాధాన్యత దక్కడం లేదని, కొత్త వారికి అవకాశాలు ఇస్తున్నారంటూ బాహాటంగానే విమర్శలు చేసిన నేపథ్యంలో వారిని సంతృప్తిపరిచేందుకు కేసీఆర్ ఏ విధంగా వ్యూహాన్ని రచిస్తున్నారో అన్నది కాస్తంత ఉత్కంఠగానే మారింది. ఏది ఏమైనా అభినవ చాణక్యుడిగా పేరున్న కేసీఆర్ అసంతృప్తులు, పాత, కొత్త తరాన్ని ఏకం చేసి బిఆర్ఎస్‌ను బలమైన శక్తిగా నియోజకవర్గంలో మార్చేందుకు ఈ సమావేశం దోహదపడుతుందని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నరు.

# తీరొక్క పూల పండుగ బతుకమ్మ

- ఎస్‌డిఆర్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎం.వెంకటరమణ
- సురభి దయాకర్‌రావు ఫార్మసీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



తొగుట, అక్టోబర్ 19, (మనం న్యూస్): తెలంగాణ సంస్కతి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా పిలిచే తీరొక్క పూల పండుగ మన తెలంగాణ బతుకమ్మ పండుగ అని సురభి దయాకర్‌రావు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డా. మాచర్ల వెంకటరమణ కొనియాడారు. బతుకమ్మ పండుగ ముందస్తు సంబరాల్లో భాగంగా గజ్వేల్ మండలం రమ్మనగూడ శివారులోని సురభి దయాకర్ రావు ఫార్మసీ కళాశాలలో గురువారం కళాశాల విద్యార్థినిలు సిబ్బందిచే బతుకమ్మ పండుగను కళాశాల సెక్రటరీ ఎమ్మెల్సీ సురభి వాణిదేవి ఆదేశాల మేరకు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ బతుకమ్మ అనగానే తెలంగాణ ప్రజలకు ఓ ప్రైత్యేకమైన పండుగలా భావించి ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూవులను పూజించే పండుగఅన్నారు. తొమ్మిది రోజుల పాటు ఆడపడుచులు ఈ పండుగను నిర్వహిస్తారని దేశంలో ఎన్నో పండుగలు ఉన్నాకూడా బతుకమ్మ పండుగలో సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేసి వాటికి మన దేశంలో విశిష్టస్థానం ఉందని, అందులో రాష్ట్రంలో బతుకమ్మ పండుగకు విశిష్ట స్థానం ఉంటుందన్నారు. తెలంగాణలో బతుకమ్మ పండుగకు విశిష్ట స్థానం ఉంటుందన్నారు. తెలంగాణ అంటేనే బతుకమ్మ అని, బతుకమ్మ అంటేనే తెలంగాణ అనే రీతిలో రాష్ట్ర ప్రభుత్వం పండుగలు నిర్వహిస్తుందని కొనియాడారు. బతుకమ్మ ఒక సామాజిక ఉత్సవంగా కుల మత వర్గ ప్రాంత సాంప్రదాయాలకు అతీతంగా జరుపుకుంటారని తెలిపారు. కళాశాలలో చదువుతోపాటు తెలంగాణ పండుగల ప్రాశస్త్యాన్ని తెలిపే విధంగా పలు రకాల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అందంగా బతుకమ్మలు పేర్చిన విద్యార్థినిలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది డా. శేష ఫణీంద్ర, డా. ఆర్. నిర్మల, చెరుకు రెడ్డి, సౌమ్య, సౌందర్య, ఈశ్వర్, పూజిత, భారతి, బి. అరుణ, మజీద్, కృష్ణ, కె. అరుణ, ప్రవీణ్, కరుణాకర్ అనిల్, లింగం విద్యార్థులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్తల బుజ్జగింపు



కొండపాక, అక్టోబర్ 19, (మనం న్యూస్): బిఆర్ఎస్ పార్టీలో నాయకులు, కార్యకర్తలను చిన్న చూపు చూస్తున్నారని, ఒంటెద్దు పోకడతో నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని ఆరోపిస్తూ తిరుగుబాటు చేసిన కొండపాక మండల బిఆర్ఎస్ నాయకులను బుజ్జగించేందుకు రాష్ట్ర నాయకత్వం సూచన మేరకు గురువారం కార్యకర్తలతో సమావేశమై బుజ్జగించారు. ఈ సందర్భంగా అధిష్టానం పంపిన దూతతో అసమ్మతి నాయకులు మండలంలో పెత్తనం చెలాయిస్తున్న నాయకులు మండలంలో బిఆర్ఎస్ పార్టీని సర్వనాశనం చేశారన్నారు. కార్యకర్తలకు సమాచారం ఇవ్వకుండా తన అనుచరులకే ప్రాధాన్యత ఇస్తూ సీనియర్ నాయకులను విస్మరించారన్నారు. శుక్రవారం జరిగే సీఎం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని బూత్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ కార్యకర్తలు ఆధిపత్యం చలాయిస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో దళిత బంధు, బిసి బంధు, గృహలక్ష్మి వంటి పథకాలను అనర్హులకు కట్టబెట్టారని, ప్రస్తుతం పెత్తనం చెలాయిస్తున్న నాయకులే ఓట్లు అడగాలని మేము ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతామని ప్రశ్నించారు. రేపు సీఎం ఏర్పాటు చేసే సమావేశంలో మాకు అవకాశం కల్పించి మాతో సంప్రదింపులు జరిపి ఒప్పిస్తే ప్రస్తుతం కొనసాగుతున్న నాయకత్వాన్ని మార్చి అందరికీ ఆమోదయోగ్యమైన నాయకునికి బాధ్యతలు అప్పగిస్తే తప్ప మేము పార్టీకి సేవ చేయలేమని హెచ్చరించారు. ప్రస్తుతం నాయకత్వం వహిస్తున్న మండల నాయకులను ఎవరు నియమించారని ప్రశ్నించారు.

## ఆధారాలు లేకుండా డబ్బులు తీసుకువెళ్తే సీజ్ చేస్తాం

- ఆధారాలు లేని 195 స్టీల్ టిఫిన్‌బాక్స్‌లు రూ.62 వేల నగదు స్వాధీనం
- తొగుట ఎస్ఐ బి. లింగం



తొగుట, అక్టోబర్ 19, (మనం న్యూస్): ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆధారాలు లేకుండా ఎవరైనా డబ్బులు కానీ వస్తువులు కానీ తీసుకువెళ్లినట్లయితే వెంటనే సీజ్ చేస్తామని తొగుట ఎస్ఐ లింగం తెలిపారు. పోలీస్ చెక్‌పోస్టులో ఆగంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా గురువారం ఎఫెస్‌టిటీమ్ ఇంచార్జ్ ఎంపిఓ చందన పోలీస్ సిబ్బందితో కలిసి తుక్కాపూర్ శివరులో వాహనాల తనిఖీ చేయగా రాయపోల్ మండలం చిన్నమాసాన్‌పల్లికి చెందిన ఆవుల దుర్గారెడ్డి ఎలాంటి కాగితాలుగానీ, బిల్లులు గాని లేకుండా 195 స్టీల్ టిఫిన్ బాక్సులు తీసుకువెళ్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా తొగుట మండలం రాంపూర్‌కు చెందిన జంగిటి నర్సింలు వద్ద లభించిన రూ. 62 వేలకు ఎలాంటి ఆధారాలు లేనందున సీజ్ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సిపి ఆదేశాల మేరకు స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీమ్‌ల ద్వారా 10 చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎఫెస్‌టి టీమ్‌లు కూడా విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎవరైనా డబ్బులు తీసుకుని వెళ్లే సమయంలో వాటికి సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాటిని ధృవపత్రాలు చూపించి డబ్బులు రిలీజ్ చేయించుకోవచ్చని తెలిపారు.

## విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి



మిరుదొడ్డి, అక్టోబర్ 19, (మనం న్యూస్): ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి చెందిన సంఘటన మిరుదొడ్డి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మిరుదొడ్డి గ్రామానికి చెందిన సత్తు బాల్‌రెడ్డి (55) తన వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ తీగలు తెగి ఉన్న విషయాన్ని గమనించకుండా వాటిని తాకడంతో విద్యుత్ షాక్‌తగిలి రైతు అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే రైతు మృతి చెందాడని స్థానికులు ఆందోళనకు దిగారు. మిరుదొడ్డి ఎస్ఐ నరేష్ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. పొలంలో విగత జీవిగా పడి ఉన్న మృతుడు బాల్‌రెడ్డి మృతదేహాన్ని చూసి కుటుంబీకులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## నవీన్‌కుమార్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



మిరుదొడ్డి, అక్టోబర్ 19, (మనం న్యూస్): అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని బేగంపేట గ్రామంలో ప్రమాదానికి గురైన ఉద్దమారి నవీన్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ కాంగ్రెస్ నాయకులతో కలిసి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పని చేసే నవీన్ కుమార్ ప్రమాదానికి గురి కావడం చాలా బాధాకరమన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు బాల్‌నర్సాగౌడ్, బాలు యాదవ్, చంద్రశేఖర్, సతీష్, ముత్యాలు, బాబు, బాల్‌నర్సు, మహేందర్, బాల్‌రాజు, కర్ణాకర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపిలో చేరిన ముదిరాజ్ సంఘం నాయకులు

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మిరుదొడ్డి, అక్టోబర్ 19, (మనం న్యూస్): అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు కొంత మంది గురువారం దుబ్బాక శాసనసభ్యులు రఘునందన్‌రావు సమక్షంలో బీజేపి పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే రఘునందన్‌రావు సాదరంగా ఆహ్వానించారు. ముదిరాజ్‌లకు అన్యాయం చేస్తున్న పార్టీలో తాము కొనసాగమని ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రామస్వామి, దీపంపల్లి కనకయ్య, బాల్‌రాజు, సత్తయ్యతోపాటు కొంత మంది బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల్లో రెండుసార్లు అవకాశు ఇస్తే దుబ్బాకను అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సహకారంతో రుద్రారం గ్రామంలో నూతన బిటి రోడ్డు నిర్మించడం జరిగిందన్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో భారీ మెజార్టీతో దుబ్బాక ఎమ్మెల్యేగా బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశార

## ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



నంగునూరు, అక్టోబర్ 19, (మనం న్యూస్): మండల పరిధిలోని రాజగోపాల్‌పేట గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా డియర్ ఫ్రెండ్స్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నాలుగవ రోజు దుర్గ అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. మొదటి సంవత్సరం దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా పురోహితుల ఆధ్వర్యంలో దుర్గామాత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారి కృపతో గ్రామస్తులు సుభిక్షంగా ఉండాలని ఆ అమ్మవారిని కోరుకోవడం జరిగిందన్నారు. దుర్గామాతను నెలకొల్పి భక్తి శ్రద్ధలతో దేవి శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, అమ్మవారి కృప కటాక్షాలు పొందాలని ప్రతి ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## మోడీ బిసిబంధు పథకాలకు పేర్లను నమోదు చేసుకోవాలి

చేర్యాల, అక్టోబర్ 19, (మనం న్యూస్): బిసి కులాలకు చెందిన సోదరుల సంక్షేమం కోసం బీజేపి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన విశ్వకర్మ యోజన మోడీ బిసి బంధు పథకాలకు చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామంలో క్యాంప్ నిర్వహిస్తున్నట్లు బిసి సోదరులందరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని బీజేపి నాయకులు చక్రధారి కోరారు. బిసి కులవృత్తులు అన్నింటికీ రూ. 3 లక్షల చొప్పున కేంద్ర ప్రభుత్వం ఖాతాలో జమ చేస్తుందని, బ్యాంకు పాస్ బుక్, ఆధార్‌కార్డు, రేషన్ కార్డులు తీసుకొని సీతారామయ్య పంతులు ఇంటి వద్దకు రావాలని మహిళా మోర్చ నాయకురాలు ఉమారాణి విజ్ఞప్తి చేశారు. విశ్వకర్మ యోజన పథకం ఆకునూరు సమన్వయకర్తలు కార్తీక్‌రెడ్డి, సమ్మయ్య, హరివర్ధనరెడ్డి, విష్ణురెడ్డి, సిద్ధారెడ్డి, శేఖర్‌లు బిసిలందరూ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. 18 కుల వృత్తులకు ప్రయోజనం చేకూర్చేలా విశ్వకర్మ యోజనను కేంద్రం తీసుకువచ్చిందని, ఆకునూరు బిసిలు, ఎస్‌సి మోచి కులస్తులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రంగారెడ్డి

www.manamnews.com
epaper.manamnews.com

శుక్రవారం | హైదరాబాద్
20 | 10 | 2023

Follow :
@Manamnews

మనం 5

# ఎల్బీనగర్ సర్కిల్ 3 టౌన్ ప్లానింగ్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

- 1 లక్ష 50 వేల రూపాయలు తీసుకుంటుండగా ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయ్ లక్ష్మణ్ అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు





ఎల్బీనగర్, అక్టోబర్ 19, (మనం న్యూస్): ఎల్బీనగర్ జిహెచ్ఎంసి సర్కిల్ 3 కార్యాలయంలో గురువారం ఏసీబీ దాడులు నిర్వహించారు . ఈ దాడులను రెడ్యాండ్‌గా దొరికిన జిహెచ్ఎంసి ఔట్సోర్సింగ్ ఎంప్లాయ్ లక్ష్మణ్‌తో పాటు ఆయనకు సహకరించిన టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ ఉమాదేవిపై కేసు నమోదు చేసి లక్ష్మన్ను అదుపులోకి తీసుకున్నారు . వివరాల్లోకి వెళితే రంగారెడ్డి జిల్లా. బాలాపూర్ మండలం. గుర్రం గూడా గ్రామానికి చెందిన జెక్కిడి సుధాకర్ రెడ్డి బిఎన్ రెడ్డి నగర్‌లో ఇంటిని నిర్మాణం చేపడుతున్నారు. ఈ విషయంలో టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ ఉమాదేవి అనుమతికి విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నావని పలుమార్లు బెదిరింపులకు దిగారు. దీంతో మాకు కొంత డబ్బు ముట్ట చెప్పాలని జెక్కిడి సుధాకర్ రెడ్డికి టౌన్ ప్లానింగ్ అధికారులు డిమాండ్ చేసి బెదిరింపులకు దిగారు. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారుల వేధింపులు తట్టుకోలేక సుధాకర్ రెడ్డి ఏసీబీ అధికారులను సంప్రదించారు. జక్కడి సుదాకర్ రెడ్డి పిర్యాదు మేరకు అవినీతి నిరోధక శాఖ అధికారులు సుదాకర్ రెడ్డి దగ్గర 1,50,000 డిపాజిట్ చేయించుకుని ఏసీబీ అధికారుల దగ్గర ఉన్నటువంటి కరెన్సీ 1, లక్ష 50వేల రూపాయలు సుధాకర్ రెడ్డికి ఇచ్చారు. ఇట్టి డబ్బులను జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయ్ లక్ష్మణ్‌కు సుధాకర్ రెడ్డి ఇవ్వడంతో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండ్‌గా లక్ష్మన్ను పట్టుకున్నారు. దీంతో ఆఫీస్ లోనే పలు పత్రాలను అవినీతి నిరోధక శా ఖ అధికారులు తనిఖీ చేశారు. ఇందులో జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ ఉమాదేవి, ఔట్సోర్సింగ్ ఎంప్లాయ్ లక్ష్మణ్ పై కేసు నమోదు చేసి లక్ష్మన్ను

## ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలిపాలి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



పాలకుర్తి, అక్టోబర్ 19, (మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించాలని గురువారం పంచాయితీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు బమ్మెర గ్రామ బీఆర్ఎస్ పార్టీ, యువజన నాయకులకు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాలలో నాయకులు, కార్యకర్తలు సానుకూలంగా ఉన్నారని, యువత సోషల్ మీడియాలో చురుకుగా పాల్గొంటున్నారని, ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బమ్మెర గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, యూత్ నాయకులు జలగం నాగరాజు, జోగు కష్ణ, వంగాల అశోక్, తోకల శోభన్, పులి రవి, చిదురాల మహేష్, రొడ్డ అరుణ్, జోగు ఈశ్వర్, వంగాల నవీన్, జోగు అంజి, రొడ్డ సురేష్, గదరి ప్రసాద్, వంగాల భాస్కర్, కొండ్ర నాగరాజు పాల్గొన్నారు.

## బోధకాలపై రక్త వైద్య పరీక్షలు



లింగాల ఘనపురం, అక్టోబర్ 19, (మనం న్యూస్) : మండల కేంద్రంలో భోధకాలుపై వైద్య సిబ్బంది రక్త పరీక్షలు గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురివి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనియన్ అధికారి శ్యాంసుందర్, వైద్య సిబ్బంది శ్రీనివాస్, శివాజీ, ఏఎన్ఎం స్వరూప, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

## వల్మిడిలో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు



పాలకుర్తి, అక్టోబర్ 19, (మనం న్యూస్) : మండలంలోని వల్మిడి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు సుమారు 30 మంది నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు చంద్రయ్య, ఉపాధ్యక్షులు సోమనారాయణ, మాజీ సర్పంచ్ రాములు, తెలంగాణ ఉద్యమకారుడు ఎల్లయ్య, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రాజు, కార్యదర్శి నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మల్లేష్, దేవేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు

## త్రిపుర గవర్నర్‌ను కలిసిన బూరుగు సురేష్



చేర్యాల, అక్టోబర్ 19, (మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్ బీజేపి మాజీ అధ్యక్షులు త్రిపుర గవర్నర్‌గా ఎంపికైన ఇంద్రసేనారెడ్డిని గురువారం బీజేపి సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేష్ గౌడ్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి హార్ధిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోడీ ప్రధాని అయిన తర్వాత రాష్ట్ర నాయకులకు అనేక పదవులు వస్తున్నాయని కొనియాడారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపి జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వారి వెంట చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాల నాయకులు ఉన్నారు.



మలక్ పేట సలీంనగర్ అక్బర్ బాగ్‌లోని నల్లు ఇంద్రసేనారెడ్డి ఇంటి వద్ద కోలాహలం త్రిపుర గవర్నర్‌గా నియమితులైన బీజేపీ సీనియర్ నేత ఇంద్రసేనారెడ్డి,ని కలిసి గాజుల స్వయం ప్రకాష్ బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర కోశాధికారి శాలువాలతో సన్మానించి బాణసంచా కాల్చి, మిఠాయిలు తినిపించిన గాజుల స్వయం ప్రకాష్, శుభాకాంక్షలు తెలిపారు
- ఎల్బీనగర్, మనం న్యూస్

# 5వ షెడ్యూల్ ప్రాంత్రాన్ని రక్షించుకోవడమే లక్ష్యం

- 12 ఎస్‌టి రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో పోటీ
- ఎస్‌టి సంఘాల ఐక్యవేదిక



ఇల్లందు, అక్టోబర్ 19, (మనం న్యూస్): రాష్ట్రంలో ఐదో షెడ్యూల్ ప్రాంతాన్ని రక్షించుకోవడమే లక్ష్యంగా 12 ఎస్టి రిజర్వ్ అసెంబ్లీ స్థానాల్లో బరిలోకి దిగనున్నామని ఎస్టీ సంఘాల ఐక్యవేదిక నాయకులు రమణాల లక్ష్మయ్య, మొత్తం ఉపేందర్ పేర్కొన్నారు. ఇల్లందులోని గోవింద్ సెంటర్ ఏరియాలో ఉన్న పెన్షనర్ భవన్లో గురువారం ఎస్‌టి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటివరకు ఎస్టీ తెగలకు సంబంధించిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల వల్ల ఎటువంటి ఉపయోగాలు లేవని, స్వప్రయోజనాలకే తప్ప ఎస్టీ తెగలలో నివసిస్తున్న వారికి ఎటువంటి ఉపయోగాలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రకుల నాయకుల చేతిలో కీలుబొమ్మలాగా వ్యవహరిస్తున్నారని, కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేలుగా కొనసాగినప్పుడు ధనిక వర్గాల గడువలు వద్ద కాపలాదారులుగా కొనసాగారని, టిఆర్ఎస్ పార్టీలో ఎస్‌టి ఎమ్మెల్యేలు ఎంపీలు మంత్రులు ఫామ్ హౌస్‌ల వద్ద కాపలాదారులుగా వ్యవహరించారని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఆదివాసీలు పోరాడి సాధించుకున్న ఐదో షెడ్యూల్లో ఉన్న హక్కులు చట్టాలు 1/70 చట్టం పేసా చట్టం అటవీ హక్కుల గుర్తింపు చట్టం ఏజెన్సీలో 100% ఉద్యోగాలు రిజర్వేషన్ అమలు కోసం ఐటిడిఏ పునరుద్ధరించుకోవడం కోసం ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవడం కోసం జీవో ఎంఎస్ నెంబర్ మూడవ స్థానంలో కొత్త జీవోను ఏర్పాటు చేయటం కోసం, ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాజ్యాంగబద్ధంగా రాజ్యాధికారం చేపట్టాలని బరిలోకి దిగనున్నట్లు తెలిపారు. ఆదివాసి ఉద్యమంలో గత పది సంవత్సరాలుగా పనిచేసిన అనుభవం కలిగిన ఆదివాసి ఉద్యమకారులను పరిశీలించి పోటీ చేయించనున్నట్లు తెలిపారు. ఇల్లందు అసెంబ్లీ ఇల్లందు నియోజకవర్గ అసెంబ్లీ స్థానం నుండి తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, కొత్తగూడెం నుండి తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు కొమరం బుచ్చయ్య, భద్రాచలం నుండి గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ, పినపాక నుండి తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు వర్ష శ్రీనివాస్, వైరా నుండి ఎల్‌హెచ్‌పిఎస్ నంగారా బేరి నాయకులు బద్రునాయక్, ములుగు నుండి తుడుం దెబ్బ నాయకులు, మంథని నుండి తుడుం దెబ్బ, నాయక్ పోడ్, ఆసిఫాబాద్ (పర్ధన్) తుడుందెబ్బ ఖానాపూర్ గుండు తుడుం దెబ్బ గోండు అశ్వరావుపేట గుండు వాన సంక్షేమ పరిషత్ పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమణ లక్ష్మయ్య (తుడుందెబ్బా జాతీయ కన్వీనర్) వట్టం ఉపేందర్(తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు)పాయం సత్యనారాయణ (గోండు వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు) బుక్య రాజేష్ నాయక్ (ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు) కొమరం బుచ్చయ్య (తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు) బద్రీ నాయక్ (యల్ హెచ్పీఎస్ రాష్ట్ర నాయకులు) వట్టం కన్నయ్య (తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి) ధనసరి రామ్మూర్తి (తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు) వర్షా శ్రీనివాస్ (తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు) వీసాల రామచంద్రు (తుడుందెబ్బ జిల్లా కోశాధికారి) దుర్గారావు వీరభద్రం (తుడుం దెబ్బ జిల్లా నాయకులు) తదితర ఎస్టి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఆరెపల్లిలో చండీ హోమం



కొండపాక, అక్టోబర్ 19, (మనం న్యూస్): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అమ్మవారి వద్ద గురువారం చండీహోమం నిర్వహించారు. మండల పరిధిలోని ఆరెపల్లి గ్రామంలో నెలకొల్పిన అమ్మవారి వద్ద చండీహోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ప్రతి రోజు అమ్మవారి సన్నిధిలో అనదాన ప్రసాద వితరణ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## స్నేహితుని కుటుంబానికి పరామర్శ, ఆర్థిక సహాయం

రాయపర్తి, అక్టోబర్ 19, (మనం న్యూస్) : రాయపర్తి మండలం అయితే చదువుకున్న విద్యార్థులు 92 93 బ్యాచ్ ఆయన అకాల మరణానికి దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ గురువారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించినట్లు గాదె రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలోపూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పొరపాటు రవీంద్రరెడ్డి చెరుకు రవి, యూసుఫ్, మహబూబ్ రెడ్డి కుమారస్వామి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ద్వారా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

- ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ



ఎల్బీనగర్, అక్టోబర్ 19, (మనం న్యూస్): ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం హైదరాబాద్ కేంద్రంగా లక్షలాది మందితో మాదిగల విశ్వరూప మహాసభను నిర్వహించి మాదిగల సత్తాఏంటో పాలకులకు చుపెడుతామని ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎల్‌బి నగర్ నియోజక పరిధిలోని రోషన్ దౌల బస్తీలో మంద కృష్ణ మాదిగ చేపట్టిన మాదిగల విశ్వరూప మహాపాదయాత్ర ముగింపు సభ తీగల ప్రదీప్ గౌడ్ అధ్యక్షతన వహించిన కార్యక్రమంలో మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ ' ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం 29 ఏళ్లుగా రాజీలేని పోరాటం చేస్తున్న పాలకుల నిర్లక్ష్యం మాదిగలకు శాపంగా మారిందని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఎస్సీ వర్గీకరణపై తీర్మానం చేస్తూ, ఎన్నికల మేనిఫెస్టోలో పెడుతూ మాదిగలను ఊరిస్తున్నాయే గానీ ఆచరణలో చిత్తశుద్ధి చూపడం లేదని అన్నారు. మాదిగల వద్ద ఓట్ల కోసం వచ్చే రాజకీయ పార్టీల నాయకులు అత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణ సమస్య పార్లమెంట్ వద్ద పెండింగ్‌లో ఉందని అన్నారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాలలో బిల్లు తీసుకొచ్చి ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసమే మాదిగలను చైతన్యపరిచేందుకు పాదయాత్ర చేపట్టామని అన్నారు. నవంబరులో లక్షలాది మందితో హైదరాబాద్లో మాదిగల విశ్వరూప మహాసభను నిర్వహిస్తున్నామని, ఆ సభతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతామని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుండి రథయాత్ర ప్రారంభం చేస్తున్నామని, ఈ రథయాత్ర అన్ని జిల్లాలకు వస్తున్న సందర్భంలో మాదిగలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కాశీం, జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ శ్రీనివాస్ రావు, రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ ,పాదయాత్ర కో ఆర్డినేటర్ నరేంద్ర బాబు ,బత్తిని సుధాకర్ మాదిగ, మహిళా నాయకురాలు జెపి లత మాదిగ, కరుణ మాదిగ, మాలతి, సీనియర్ నేతలు వేల్పుల సూరన్న, జానకి రామయ్య చౌదరి, జాతీయ అధ్యక్షులు సోమశేఖర్ మాదిగ, అశోక్ మాదిగ, కొమ్ము శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట పట్టణంలో రోడ్డు ప్రమాదం



వర్ధన్నపేట, అక్టోబర్ 19, (మనం న్యూస్) : వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి ఇద్దరికీ గాయాలయ్యాయి ఒకరీ పరిస్థితి విషమంగా ఉంది స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించారు.

# కేసీఆర్ పాలన తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామరక్ష

- కోదాడలో మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయం



నడిగూడెం, అక్టోబర్ 19, (మనం న్యూస్): సీఎం కేసీఆర్ పాలన తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామరక్ష అని కోదాడ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గల ఫంక్షన్‌హాల్ నందు మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన బూత్ కమిటీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ బీఆర్ఎస్ గెలుపు కోసం గ్రామ స్థాయి నుంచి ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలి ఆయన పిలుపునిచ్చారు. కోదాడ గడ్డపై మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయం అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి పథంలో దూసుకపోతుందనానరు. సీఎం కేసీఆర్ నిరుపేదలకు కావాల్సిన అనేక సంక్షేమ పథకాల రూపంలో అందజేస్తున్నారని రైతులు సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం అన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. గతంలో 200 ఉన్న పెన్షన్‌ను స్వరాష్ట్రంలో 2016 చేసిన ఘనత ముఖ్యంత్రికే దక్కుతుందని గత పాలకులకు ఇలాంటి పథకాలు అమలు చేయాలనే సోయి కూడా లేదన్నారు. పేదల సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ కేసీఆర్ రావాలని చెప్పారు. ప్రజల మనసులో కేసీఆర్ ఉన్నారన్నారు. అభివృద్ధి చేశాం ఆశీర్వదించండిని ప్రజలందరికి వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శి, ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, అన్ని గ్రామాల గ్రామశాఖ అధ్యక్ష కార్యదర్శులు, బూత్ లెవల్ నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉనికిచర్ల టోల్ గేట్ ప్లాజా దగ్గర వాహనాల తనిఖీల్లో రూ 25 లక్షల నగదు పట్టివేత



కాజీపేట, అక్టోబర్ 19, (మనం న్యూస్) : కాజీపేట ఏసిపి డేవిడ్ రాజ్ నేతత్వంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎలాంటి పత్రాలు లేకుండా వాహనంలో తరలిస్తున్న రూ 25 లక్షలను పోలీసులు పట్టుకున్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.

# కాంగ్రెస్ పార్టీకి చెందిన 42 కుటుంబాలు బిఆర్ఎస్‌లో చేరిక



నర్సంపేట, అక్టోబర్ 19, (మనం న్యూస్) : నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 12 వ వార్డు నుండి కాంగ్రెస్ పార్టీకి చెందిన 42 మైనార్టీ కుటుంబాలు నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డి సమక్షంలో గురువారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ లో చేరినవారిలో ఎస్కే యాకూబ్ పాషా, ఎండి మొహమ్మద్ పాషా, ఎస్కే సుభాన్ అలి, ఎస్కే రఫి, ఎస్కే కైసర్, ఎస్కే వహీద్, ఎస్కే చంద్ పాషా, ఎస్కే గౌస్, ఎస్కే రబ్బాని పాషా, ఎండి ఖాజా పాషా, ఎండి ఫాయాజ్, ఎండి అయ్యుబ్, ఎస్కే ఫిరోజ్, ఎండి ముస్తాక్, ఎండి రసూల్ భాయ్, ఎస్కే ఖాజా, ఎస్కే బోలేశ, ఎస్కే యాకూబ్ పాషా, ఎస్కే కైసర్, ఎస్కే సలీం, ఎస్కే యాకూబ్ పాషా, ఉస్మాన్, జావిద్, చోట ఉస్మాన్, బాబా, నిజాం రహీమ్, గౌస్, పయాజ్, విఠల్, శాన్వాజ్, ఖజ్మొనొడియల్, రహీమోద్దీన్, గౌస్ మొనొద్దిన్ పాషా, బాబా, రోమన్ ఉన్నారు. వీరిని12 వ వార్డు కౌన్సిలర్ ఎండి పాషా పార్టీలోనికి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నాగెల్లి వెంకట్ నారాయణ గౌడ్, ముఖ్య నాయకులు గుంటి కిషన్, నల్ల మనోహర్ రెడ్డి, గోనెల యువరాజ్, 12 వ వార్డు మైనార్టీ కమ్యూనిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి బాబా, యువ నాయకులు ఎస్‌కే ఇర్ఫాన్, పట్టణ మైనార్టీ కమ్యూనిటీ ఉపాధ్యక్షులు ఎండి అఫ్జల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## తుంగతుర్తి నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ ఛైర్మన్‌గా చంద్రశేఖర్



జాజిరెడ్డిగూడెం, అక్టోబర్19(మనం న్యూస్): తుంగతుర్తి నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ ఛైర్మన్‌గా కేలోతు చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికైరు. గతంలో నియోజకవర్గంలో రెండు పాస్టర్ కమిటీలు ఉండగా ఒకే కమిటీగా ఏర్పడినట్లు తెలిపారు. ఈసందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కుంభకోణాలు, అవినీతికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్

సూర్యాపేట, అక్టోబర్ 19, (మనం ప్రతినిధి): కుంభకోణాలు, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని, ప్రధాని మోడీ దయాదక్షిణ్యాల మీద గాంధీ కుటుంబం బ్రతుకుందని మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ చేసిన వాఖ్యలపై విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ రాహుల్ గాంధీకి ఉన్న ఏకైక అర్హత వారసత్వ అర్హతనేనని పేర్కొన్నారు. అసలు ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేని పక్కకు పడేసిన గాంధీ కుటుంబం, సిఎం కేసిఆర్‌ను కుటుంబ పాలన అని అనటం విడ్డూరంగా ఉందని, బోఫర్స్ కేసులో పీకల లోతు కూరుకుపోయిన చరిత్ర గాంధీ కుటుంబానిది కాదా అని ప్రశ్నించారు. గుజరాత్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అటువైపుకు చూడకపోవడమే బిజెపి లాలూచీ రాజకీయాలకు నిదర్శమని, తెలంగాణలోని ప్రజలకు చెప్పుకోడానికి ఏమిలేకనే నోటికి వచ్చిన అబద్ధాలను ప్రచారం చేస్తున్నారన్నారు. కేసిఆర్‌ను విమర్శించడమంటే సూర్యుడిపైకి ఊమ్మి వేయడమేనని, ఆయన వలనే రాష్ట్రం ఇప్పుడు సస్యశ్యామలంగా మారిందని, అన్ని



వర్గాల ప్రజలకు పార్టీలకు అతీతంగా న్యాయం చేసిందని, పగటి దొంగలు రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి రాహుల్ అభాసుపాలు అవుతున్నాడని, ఏ యాత్రను చివరి వరకు ముగించిన చరిత్ర ఆయనకు లేదని, ఏ యాత్రలు బిఆర్ఎస్ జైత్ర యాత్రను ఆపలేవని, హ్యాట్రిక్ విజయం తమేదనని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో రైతులకు 5 గం. కరెంట్, పండించిన పంటను సైతం కొనటేనమని చేతులేత్తిసిన చేతకాని దద్దమ్మ ప్రభుత్వమని అన్నారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, గ్రంథాలయాల సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, నరసింహరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి జగదీష్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలు

సూర్యాపేట పట్టణం, ఆత్మకూర్‌ఎస్ మండలానికి చెందిన పలువురు ఇతర పార్టల నుండి గురువారం మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ కండువ కప్పుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సిఎం కేసిఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుండి బిఆర్ఎస్‌లోకి చేరుతున్నారని, నమ్మకంగా పని చేసిన వారికి పార్టీ ఎప్పుడు సముచిత స్థానాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. కనుకు యల్లయ్య, దామోదర్, వెంకటేష్, యల్లమ్మ, అనసూర్యమ్మ, శైలజ, రమణ, రాజు, రాకేష్ తదితరులు పార్టీ కండువ కప్పుకున్నారు.

## న్యూట్రిషన్ కిట్లు అందజేత



తిరుమలగిరి అక్టోబర్ 19, మనం న్యూస్: మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కోట చలం గర్భిణి స్త్రీలకు న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..... గర్భిణి స్త్రీలు విధిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యశాఖ అందిస్తున్న న్యూట్రిషన్ కిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి రోజు క్రమం తప్పకుండా ఉదయం, సాయంత్రం వ్యాయామం చేయాలని, తద్వారా సహజ కాన్పుకు సులభతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు మల్లెల వందన, సిహెచ్‌ఓ బిచ్చు నాయక్, సూపర్వైజర్ రామచంద్ర, స్వరూపకుమారి, ఆశవర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ చేస్తున్న ఆరాచకాలను ప్రజలు గమనిస్తున్నారు



సూర్యాపేట టౌన్, అక్టోబర్ 19, (మనం న్యూస్): రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, గడీల పాలనను అంతం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టె జానయ్య యాదవ్ అన్నారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో 30వ వార్డుకు చెందిన పలువురు ఇతర పార్టీల కార్యకర్తలు బిఎస్పీలోకి చేరారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ. బహుజన రాజ్య స్థాపనకు బడుగుబలహీన వర్గాల ప్రజలంతా ఏకంకావాలని, పేట నియోజకవర్గంలో బహుజన రాజ్యానికి కృషి చేయాలని కోరారు. అంతకు ముందు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బహుజన బిడ్డగా తనను గెలిపించేందుకు ప్రతి ఒక్క కార్యకర్త శ్రమించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనార్టీ ప్రజలందరు తనను దీవించాలని, అగ్ర వర్ణాలు బహుజనులను అణగదొక్కడానికి ప్రయత్నిస్తున్నారని, ప్రజలు దీనిని గమనించాలని వేడుకున్నారు. ప్రజా బలం ముందు ధనబలం పనిచేయదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వనదుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



హుజూర్‌నగర్, అక్టోబర్ 19, (మనం న్యూస్): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కనకదుర్గ దేవాలయంలో గురువారం అమ్మవారిని శ్రీ వనదుర్గా దేవిగా అలంకరించి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులున రగిరినాథుని రంగబట్టాచార్యలు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో ఆలయ కమిటీ అధ్యక్షులు బాచిమంచి కొండయ్య- అనంతలక్ష్మి దంపతులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. సరస్వతి దేవాలయంలో పట్టణంలోని టీచర్స్ కాలనీలో వేంచేసి ఉన్న జ్ఞానసరస్వతి దేవాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేకపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పొట్టు ముత్తు సోమలక్ష్మి దయనంద్, భక్తులు పాల్గొన్నారు.

## బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు గుణపాఠం చెప్పాలి

- సీపీఎం మండల కార్యదర్శి అనంత ప్రకాష్



పాలకీడు, అక్టోబర్ 19, (మనం న్యూస్): కేంద్రంలో అధికారంలో ఉ న్న బీజేపీ, తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని సీపీఎం మండల కార్యదర్శి అనంత ప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018ఎన్ని కల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైనాయన్నారు. ఈ ఎన్ని కల్లో ఓటుహక్కు ద్వారా ప్రజలను మోసగించిన బిజేపీ, బీఆర్ ఎస్‌లను ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పగడాల మట్టేష్, ఎంపీటీసీ వెంకటయ్య, నాయకులు పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయుడు క్షేమంగా బయటకు రావాలని ప్రత్యేక పూజలు

సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 19, (మనం న్యూస్) : అక్రమ కేసుల్లో అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో నిర్బందించిన మాజి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్షేమంగా, ఆరోగ్యంగా భయటకు రావాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని ప్రాచీన శివాలయంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మునుగోడు నియోజకవర్గ ఇంచార్జీ ఐలయ్య యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నిజాయితీతో 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా వుండి ప్రజల కోసం నిత్య శ్రమికుడిల కష్టపడి పని చేశాడని తెలుగు రాష్ట్రాల్లో సంపద సృష్టించడంతో లక్షల కోట్ల రూపాయాల సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయంటే చంద్రబాబు నాయుడు కృషి అన్నారు. రాజకీయాలలో హుందాగా ఉండి దేశ ప్రజలకి ఆదర్శంగా ఉన్న చంద్రబాబును అవినీతి కేసుల్లో కుట్ర చేసి ఇరుకించడం దేశ విదేశాలలో నిరసనలు చేస్తుంటే తెలంగాణలో అంక్షలు విధించడం సిగ్గు చేటన్నారు. ఏలాంటి ఆధారాలు లేకున్న 40రోజుల నుండి బయటికి రాకుండా అడ్డుకోని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.ప్రజల దివనెలతో



కడిగిన ముత్యమల్లే తిరిగి బయటకు వస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఏర్పుల సుదర్శన్, మండల ప్రధాన కార్యదర్శి అవ్వరి సుబ్బారావు, మండల ఉపాధ్యక్షులు ముత్యాల విజయ్ కుమార్, కోలను వేణుగోపాల్‌రెడ్డి, మాజి సర్పంచ్ శ్రీపతి రాంరెడ్డి, నాయకులు నర్రి నర్సింహ్మా, పగిల్ల రవీందర్, వలిగొండ మాధవ్, బొల్లెపల్లి భగవంతు, రాములు, నీళ్ళ జంగయ్య, వావిల్ల సత్తయ్య, శివ, ముత్యాలు, బిక్షపతి, బొంగు జంగయ్య, ఉస్మాన్, మంగ నర్సింహ్మా, జనార్ధన్, అంజయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత హామీలు ఇచ్చి అమలు చేయని ప్రభుత్వం బిఆర్ఎస్



సూర్యాపేట టౌన్, అక్టోబర్ 19, (మనం న్యూస్): ఎన్నికల సమయంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉచిత హామీలను ఇచ్చి వాటిని అమలు చేయలేదని, ఇచ్చిన మాట తప్పిన సిఎం కేసిఆర్, మంత్రి జగదీష్‌రెడ్డిలను ఓడించి తీరాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి పార్టీ ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అవినీతి పార్టీలన్నారు. మంత్రి జగదీష్‌రెడ్డి ఎన్నికల్లో గెలిపిస్తే పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలం ఉన్నవారికి రూ. 5 లక్షలు ఇస్తానని చెప్పి మోసం చేశాడని, గిరిజనులకు గిరిజన బంధు ఇవ్వకుండా అనుచరులకు మంత్రి పథకాలను అందించాడని, తండాలలో బెల్టు షాపులు విపరీతంగా పెంచి పేదల కష్టాన్ని సిఎం కేసిఆర్, మంత్రి జగదీష్‌రెడ్డిలు దోచుకుంటున్నారని, వరి ధాన్యానికి మద్దతు ధరను పెంచి ఘనత కేంద్రంలోని బిజెపిదేనని పేర్కొన్నారు. జిల్లాలోని రైస్ మిల్లర్లతో మంత్రి కుమ్మక్కై అవినీతి సోమ్మును కొల్లగొట్టాడని చెప్పారు. అసంఘటిత కార్మికులు మృతి చెందితే ఈ శ్రామ్ కార్డు ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ. 5 లక్షలు ఇవ్వడమేకాకుండా ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ప్రజలకు రూ. 5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య వైద్య ఖర్చులు అందజేసే పథకం ప్రవేశపెట్టిందని, తనను రాబోయే ఎన్నికల్లో గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు రావాల్సిన ఉచిత పథకాలను తీసుకువస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉచిత వైద్యం, విద్య, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. అనంతరం సూర్యాపేట మండల పరిధిలోని ఇమాంపేట, జాటోత్ తండా, రామ్‌ల తండా, రూప్లా తండా, తాళ్లఖమ్మంపహాడ్, జమున నగర్, కాసరబాధలలో ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

సూర్యాపేట అక్టోబర్ 19 (మనం ప్రతినిధి): పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. ఈ నెల 21 పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ ఫ్లాగ్‌డే నిర్వహిస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అక్టోబర్ 21 సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి పురస్కరించుకుని 31 వరకు జాతీయ ఐక్యత దినోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు, యువతకు, ఫోటోవిడియో గ్రాఫర్లకు పలు సేవా కార్యక్రమాలు, మూఢనమ్మకాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, అత్యవసర పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాలలో పోలీసుల సేవలను పెంపొందించే విధంగా పలు రకాల పోటీలు నిర్వహించనున్నామన్నారు. పోటీల్లో అత్యత్తుమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయిలో చేపట్టే పోటీల్లో అర్హత లభిస్తుంచడంతో పాటు బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు.




### పారామిలిటరీ సిబ్బందికి వసతి

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బందోబస్తు నిర్వాహణలో భాగంగా పారామిలిట రీ సిబ్బందికి జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే పట్టణంలోని ఆర్య వైశ్య భవన్‌లో వసతిని గురువారం పరిశీలించారు. వారికి ఏలాంటి ఇబ్బందిలేకుండా అన్ని వసతులను కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయనతో అధనపు ఎస్పీ నాగేశ్వర్రావు, డీఎస్పీ నాగభూషణం, సిఐ రాజశేఖర్‌లు ఉన్నారు.

## ఎమ్మెల్యే సైదిరెడ్డి విధానాలు నచ్చకే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా

- స్థానిక ప్రజాప్రతినిధులకు గౌరవం లేదు
- మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతగాని లక్ష్మమ్మ శ్రీనివాస్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గోపిరెడ్డి

హుజూర్‌నగర్, అక్టోబర్ 19, (మనం న్యూస్): హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యనాయకులు వరుసగా బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నారు. తాజాగా హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతగాని లక్ష్మమ్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి, కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు, పీఏసీఎస్ డైరెక్టర్లు వారి అనుచరులు బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నట్లు ప్రకటించి వారి రాజీనామ పత్రాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్యాయాదవ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతగాని లక్ష్మమ్మ, శ్రీనివాస్ నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా, బానిసలుగా మాత్రమే ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి బావిస్తున్నారని, ఆయన నిరంకుశ నియంతృత్వ విధానాలు నచ్చకనే పార్టీని వీడుతున్నామన్నారు. 2014 నుండి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి 2018 సాధారణ, 2019 ఉప ఎన్నికలలో ఎమ్మెల్యే సైదిరెడ్డి విజయానికి, ఎంపీ ఎన్నికలలో బీఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి విజయానికి ఎంతో కృషి చేసి మెజార్టీ తెచ్చామన్నారు. స్థానిక ఎన్నికలలో మేము విజయం సాధించి ప్రజాప్రతినిధులుగా గెలిచినప్పటికిని ఎన్నుకున్న ప్రజలకు గాని, మమ్మలని నమ్ముకున్న పార్టీ కుటుంబాలకు, శ్రేణులకు ఏమి చేయలేని నిస్సాహాయ స్థితిలో



ఉన్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీలో బానిసలుగా ఉండలేమని బావించి పార్టీకి రాజీనామా చేస్తున్నామని అందరి నిర్ణయం మేరకు త్వరలో ఏ పార్టీలో చేరుతామన్నది తెలియజేస్తామన్నారు.బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన వారిలో హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతగాని లక్ష్మమ్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, మండల బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి,21వ వార్డు కౌన్సిలర్ దొంతగాని పద్మా, మాజీ కౌన్సిలర్ తేజవత్ రవినాయక్, మలిదశ ఉద్యమకారుడు కడియాల రామకృష్ణ, వేపలసింగారం ఉప సర్పంచ్ కర్నే సావిత్రీవీరారెడ్డి, వార్డు మెంబర్లు కందూరు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌కే. బాబు, పోలగాని నాగరాజు, పెద్దారపు హుస్సేనమ్మ, కలవెండి విజయలక్ష్మీ, చడపంగు సైదమ్మ, పీఏసీఎస్ డైరెక్టర్లు నందిగామ వెంకటేశ్వర్లు, మాసిరెడ్డి వెంకట్‌రెడ్డి, శివాలయం చైర్మన్ బోగాల కొండారెడ్డి, వారి అనుచరులు ఉన్నారు.

## బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాంగ్రెస్‌లోకి



సూర్యాపేట టౌన్, అక్టోబర్ 19, (మనం న్యూస్): మాజీ కౌన్సిలర్, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు తండు శ్రీనివాస్ గౌడ్ ఆ పార్టీకి రాజీనామా చేసి గురువారం కాంగ్రెస్ పార్టీ టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్‌కు పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించాడు.

## బిసిలకు కాంగ్రెస్ పార్టీ 34 టికెట్లు ఇవ్వాలి

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 19, (మనం న్యూస్): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బిసిలకు 34 అసెంబ్లీ టికెట్లను ఇవ్వాలని పిసిసి ఓబిసి వైస్ చైర్మన్ తండు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉదయ్‌పూర్‌లో ఇచ్చిన డిక్లరేషన్ ప్రకారమే ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బిసిలకు రెండు చోప్పున అసెంబ్లీ టికెట్ కాంగ్రెస్ పార్టీ కేటాయించాలన్నారు. అంతేకాకుండా ఎప్పటి నుంచో పార్టీని నమ్ముకుని పార్టీ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్న నాయకులు, కార్యకర్తలను పార్టీ అధినేతలు గుర్తించాలన్నారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మహబుబాబాద్ జిల్లాలలో బిసిలకు టికెట్‌ను ఇవ్వలేదని, బిసిలకు టికెట్ ఇవ్వకపోతే రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బిసిల వద్దకు వెళ్లి ఓట్లు ఎలా అడగాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబిసి సెల్ నాయకులు బెంజారపు రమేష్‌గౌడ్, గుంటి సైదులు, గోపినాథ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


## నిర్ణయించిన ధరల మేరకు రేట్లు ఉండాలి



సూర్యాపేట, అక్టోబర్ 19, (మనం ప్రతినిధి): అభ్యర్థుల ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఉపయోగించి ప్రచార సామాగ్రి ధరలు జిల్లా కమిటీ నిర్ణయించిన మేరకు మాత్రమే ఉండాలని కలెక్టర్ ఎస్ వెం కట్రావ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల సామాగ్రి ధరలు, ఎన్నికల పరికాల మొదటి విడుత ర్యాండమైజేషన్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేడు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు పాత కలె క్టరేట్‌లోని వివి ప్యాడ్స్, ఈవిఎంల ర్యాండమైజేషన్‌పూర్తి చేసి ఆయా నియోజకవర్గాలలోని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్ర పరచడం జరుగుతుందని, వాటిని భద్రపరిచేందుకు తీసుకెళ్లే సమయంలో అన్ని పార్టీల ప్రతి నిధులువాహానాల వెంట వెళ్లి పరిశీలించవచ్చునని, వాహానాలన్నింటికి జిపిఎస్ ట్రాకింగ్ సిస్టమ్ అమర్చడం జరిగిందని తెలిపారు. ఎన్నికల ప్రచార సామాగ్రి ఈ నెల 12న వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో నిర్ణయించిన రేట్ల ప్రకారమే ఉండాలని, తెలంగాణ రాష్ట్ర శాసనసభ సార్వత్రిక ఎన్నికల వ్యయాన్ని నమోదు చే యాడానికి మాత్రమే రేట్లు పరిగణలోకి తీసుకోబడతాయన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ. మైక్, సౌండ్ సిస్టం, అనుమతి కొరకు ముందుగా ధరఖాస్తు చేసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందికలుగకుండా పార్టీ ప్రచారాలను చేపట్టాలని సూచించారు. అంతకు ముందుకు సివిజిల్ యాప్‌పై ప్రజలకు అవగాహన సమావేశాన్ని సంబంధిత అధికారులతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్‌డిఓ వీరబ్రహ్మాచారి, డిఎస్పీ నాగభూషణం, మున్సిపల్ కమీషనర్ రామాంజులరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

## ఎక్సైజ్- సివిల్ పోలీసు శాఖల ఆధ్వర్యంలో దాడులు

- 60లీటర్ల సారా, బెల్లంవాష్ స్వాధీనం
- 3గురిపై కేసు నమోదు



హుజూర్‌నగర్, అక్టోబర్ 19, (మనం న్యూస్): నియోజకవర్గ పరిధిలోని హుజూర్‌నగర్ ఎక్సైజ్ సిబ్బంది, మఠంపల్లి మండలం పోలీసు శాఖ, సూర్యాపేట,నల్గొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది మండల పరిధిలోని బిల్యానాయక్‌తండా, కొత్తతండా, రామచంద్రాపురం తండా, సుల్తాన్‌పూర్‌తండాలలో నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 60లీటర్ల నాటుసారా, 3వేల లీటర్ల బెల్లంవాష్, 3మోటర్ సైకిళ్ళను స్వాధీనం చేసుకుని 3గురిపై కేసు నమోదు చేశారు. మేళ్ళచెర్వు మండల హేమ్లాతండా నుండి టీవీఎస్ఎక్స్ఎల్ వాహానంపై సరఫరా చేస్తున్న 10లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. దాడులు నిర్వహిస్తున్న సమయంలో అడ్డుకున్న ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసి వారిపై సెక్షన్ 50ఏ చట్టం క్రింద అరెస్టు చేశామన్నారు. ఈ దాడులలో ఎక్సైజ్ సీఐ నాగార్జున్‌రెడ్డి, మఠంపల్లి ఎస్ఐ బాలకృష్ణ, ఎక్సైజ్ ఎస్ఐలు జగన్‌మోహన్‌రెడ్డి, దివ్య, వెంకన్న, సిబ్బంది రవి, నాగరాజు, ధనుంజయ, నాగయ్య, నరేష్, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

# వేములవాడలో నేడే సద్దుల బతుకమ్మ వేడుకలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన మున్సిపల్ అధికారులు
- వేడుకలకు హాజరుకానున్న ప్రముఖులు





వేములవాడ, అక్టోబర్ 19, (మనం న్యూస్): తెలంగాణ ఆడపడుచులు ఎంతో ఇష్టంతో జరుపుకునే పండగ బతుకమ్మ. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే కమనీయమైన పండుగ. సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే మధురమైన ఘనత. తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండగను తొమ్మిది రోజుల పాటుగా మహిళలు అత్యంత వైభోపేతంగా నిర్వహించుకుంటారు.చివరి రోజున సద్దుల బతుకమ్మగా పేర్కొంటూ ఆడబిడ్డలు గౌరమ్మ తల్లిని సాగనంపుతారు. ఆరోజు అత్యంత ఘనంగా వేడుకలు నిర్వహించి బతుకమ్మలను నిమజ్జనం చేసి గౌరమ్మకు వీడ్కోలు పలుకుతారు. రాష్ట్ర వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ అక్టోబర్ 21వ తేదీన నిర్వహించనున్నారు. అయితే అందుకు భిన్నంగా వేములవాడ పట్టణంలో ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా వేములవాడలో శుక్రవారం నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకలకు మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 16 లక్షలు ఖర్చు చేసి మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పండగ గొప్పతనం ఉట్టి పడేలా చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని మూలవాగు వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలకు ముస్తాబు చేశారు.రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు భిన్నంగా వేములవాడలో ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ కాబట్టి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.శ్రీ రాజరాజేశ్వర స్వామి కొలువైన వేములవాడలో ఏడు రోజులకే సద్దుల బతుకమ్మను నిర్వహిస్తారు. పుట్టినింటికి మెట్టినింటికి అనుసంధానంగా శ్రీ రాజరాజేశ్వరి దేవి కొలువైన వేములవాడ పుణ్యక్షేత్రంలో మాత్రమే రెండు రోజుల ముందుగా సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారు. వేడుకల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

### ఏడు రోజుల బతుకమ్మ గొప్పతనం

వేములవాడలో నేడు సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించుకునే ఆడబిడ్డలు తర్వాత తమ పుట్టినిల్లు, మెట్టునిండ్లకు వెళ్లి అక్కడ సైతం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటారు. అమ్మవారు కొలువైన పుణ్యక్షేత్రం కాబట్టి రెండు రోజుల ముందే సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించి ఆ తల్లిని పూజిస్తారు.కేవలం ఇది వేములవాడ పట్టణంలో మాత్రమే కనిపిస్తుంది. చుట్టుపక్కల గ్రామాలను యధావిధిగా తొమ్మిది రోజులకు బతుకమ్మ ఆడతారు.ఇక నేడు జరగనున్న సద్దుల బతుకమ్మ వేడుకలకు మూలవాగు వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. బతుకమ్మ తెప్ప వద్ద ఫ్లడ్ లైట్లు, బ్యారికేడింగ్, స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. బతుకమ్మ ఆడుకునేందుకు వచ్చే మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు చేపట్టారు. అన్ని ఏర్పాటు చేశాం

### మున్సిపల్ కమిషనర్ అన్వేష్

మూల వాగు బతుకమ్మ తెప్ప వద్ద మహిళలు ఆడుకునే విధంగా గ్రౌండ్‌ను చదును చేశాం.దారి పొడవునా ఎల్ఈడి లైట్లు తో పాటు వారు ఆడుకునే ప్రదేశాల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశాం.ఒక వేళ విద్యుత్ అంతరాయం ఏర్పడితే దానికి అనుగుణంగా జనరేటర్లను సైతం ఏర్పాటు చేయడం జరిగింది. మహిళలు ప్రశాంతంగా ఆడుకునేందుకు మున్సిపల్ తరపున అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

## బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా సోమ ప్రశాంత్



గోదావరిఖని, అక్టోబర్ 19, (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా సోమ ప్రశాంత్‌ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందించారు. నియామకానికి కృషి చేసిన మంథని శాసనసభ్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు,కాంగ్రెస్ పార్టీ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ మహంకాళి స్వామి, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ కార్పొరేషన్ అధ్యక్షులు గట్ల రమేష్, కార్పొరేటర్ ఎండి ముస్తఫా, పాతపల్లి ఎల్లయ్య, ధూళికట్ట సతీష్, దాసరి విజయ్ లకు ప్రశాంత్ కృతజ్ఞతలు తెలిపారు

## బిఆర్ఎస్‌లో చేరిన బిజెపి శ్రేణులు



తిమ్మాపూర్, అక్టోబర్ 19, (మనం న్యూస్): తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామ మాజీ సర్పంచ్, బీజేపి నాయకులు కోమటి రెడ్డి కిష్టారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ రెడ్డి అంజిరెడ్డి తోపాటు బిజెపి ముఖ్య నాయకులు, గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు గురువారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. బిఆర్ఎస్ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రసమయి వారికి గులాబీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ పాశం అశోక్ రెడ్డి, సీనియర్ నాయకులు రెడ్డి తిరుపతిరెడ్డి, ముసుకు మోహన్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు అసోద శ్రీనివాస్‌తో పాటు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆర్జీ-3 జీఎం



రామగిరి, అక్టోబర్ 19, మనం న్యూస్ : సింగరేణి సంస్థ రామగుండం-3 ఏరియాలోని ఓసిపి-1 ఉపరితల గని సైట్ ఆఫీస్‌లో దేవి శరన్నవరాత్రుల సందర్భంగా గని ఆవరణలోని గల మైసమ్మతల్లి దేవాలయంలో గురువారం చండీ హోమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ఆర్జీ-3 జీఎం ఎన్. సుధాకర్‌రావు, వారి సతీమణి అలివేణి చండీ హోమంలో పాల్గొని, ప్రత్యేక పూజలను నిర్వహించి,అనంతరం జరిగిన మహా అన్నదాన ప్రసాద వితరణలో పాల్గొన్నారు. జీఎం ఏపీఏకే.వెంకటేశ్వర్లు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలను చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఎన్. రాధాకృష్ణ దంపతులు,ప్రాజెక్టు ఇంజనీర్ ఆర్.శ్రీనివాస్,మేనేజర్ ఉదయ్ హరిజన్,పర్సనల్ ఎం.రవీందర్‌రెడ్డి,సేఫ్టీ ఆఫీసర్ కోటయ్య, డివైపిఎం వి.సునీల్ ప్రసాద్‌లతో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మానవ మనుగడ రక్షకులు మహిళలే

- స్త్రీలలోనే భక్తిభావం అధ్యాత్మికత ఎక్కువ
- ప్రతి విషయాన్ని సక్రమంగా వింటేనే మళ్లీ చెప్పగలం
- బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధుకర్




మంథని, అక్టోబర్ 19, మనం న్యూస్ : మహిళలను గౌరవించినప్పుడే దేశం బాగుపడుతుందని మనవ మనుగడ రక్షకులు మహిళలేనని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి,జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. మంథని మున్సిపల్ పరిధిలోని పవర్ హౌజ్ కాలనీలోని సీయోను ప్రార్థన మందిరంలో ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా,ఫెలోషిప్ ఆఫ్ ఎవంజలికల్ చర్చస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 43వ క్రైస్తవ స్త్రీల వార్షికోత్సవ మహాసభలకు ఆయన ముఖ్యఅధితిగా హాజరై మాట్లాడారు. దేశం మొత్తం భారత మాత పేరుపైనే నడుస్తోందని, స్త్రీలను గౌరవిస్తూ ముందకు సాగే సంస్కృతి మనదేశమే అని అన్నారు. స్త్రీలలోనే అధ్యాత్మికత, భక్తిభావం ఎక్కువగా ఉంటుందని దేవుడితో అనుసందానం ఉన్న మనుషుల్లో స్త్రీలే ఎక్కువగా ఉంటారని అన్నారు. ఇంలాటి సభలు ఆధ్యాత్మకత పటిష్టతకు మరింత ఉపయోగపడుతాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈనాటి సమాజంలో మనుషులు అనేక చెడు అలవాట్లతో ఉంటున్నారని ఒక కుటుంబాన్ని కాపాడుకోవడం కోసం విపత్తును సృష్టిస్తున్నాడని ఆయనావేదన వ్యక్తం చేశారు. మరణించిన వాళ్లు ఏమీ పట్టుకుపోరని తెలిసినా ఇంకా ఏదో సాధించాలనే ఆశ మాత్రం పోవడం లేదని ఆయన వాపోయారు. కరోనా విపత్కర పరిస్థితులు అందుకు నిదర్శమని పేర్కొన్నారు. కరోనా బారినపడి ఎవరైన మృతి చెందితే కుటుంబసభ్యులే దగ్గరకు రాని దుస్థితి ఉండేదని ఆయన వివరించారు. ఎవరైనా చెప్పితే సక్రమంగా వింటేనే మనం మరోసారి చెప్పగలుగుతామని ఆయన అన్నారు. సమాజ మార్పు కోసం ప్రతి కృషి చేయాలని,ఇలాంటి సభలు అందుకు ఉపయోగపడాలన్నారు. ఆడవాళ్లను గౌరవిస్తే మనల్ని సమాజం గౌరవిస్తుందని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. యుగోస్లేమియా దేశంలో పుట్టిన మధర్ థేరిస్సాను మన దేశంలో ఇంకా పూజిస్తునే ఉన్నారని మనుషులను ప్రేమించేవాళ్లు క్రైస్తవులేనని సందేశం ఇచ్చిందన్నారు. క్రైస్తవ మతం మన దేశానికి ఎన్నో నేర్పిందనే విషయాలను మర్చిపోవద్దన్నారు. ఈనాడు కొంతమది తమ స్వార్థం కోసం క్రైస్తవుల్లో చేరవద్దని,చర్చీలు కూలగొట్టాలని అంటున్నారని, అలాంటి వారితోనే సమాజానికి ప్రమాదమన్నారు. ముఖ్యంగా ప్రేమించడం,గౌరవించడం నేర్చుకోవాలని,మనుషులుగా గుర్తించడం అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఇలాంటి మహాసభలకు తనను ఆహ్వానించడం సంతోషంగా ఉందని,ఇలాంటి అధ్యాత్మిక కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగపడుతాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వాక్యోపదేశకులు విజయ ఆగస్టీన్, మంజుల సుధాకర్, స్త్రీల సమాజం నాయకులు ఎంకే హేమలత, మున్సిపల్‌కో ఆప్షన్ సభ్యులు అంకరి పద్మజ- కుమార్, ఐఎంఐ చైర్మన్ ఐజాక్ ప్రధాన కార్యదర్శి గోపి జోన, కోశాధికారి అంకరి కుమార్, ఎఫ్ఈ సి ప్రధాన కార్యదర్శి డేవిడ్, కోశాధికారి వల్లూరి ప్రభాకర్,డైరెక్టర్లు రీచర్డ్ థామస్, పాల్సన్ రాజు, ఎంకె జోసెఫ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# దొరల తెలంగాణ వద్దు ప్రజల తెలంగాణ కావాలి

- వచ్చే ఎన్నికల్లో ప్రజలు దొరల పాలనకు స్వస్తిపలకాలి
- కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆరు గ్యారెంటీ పథకాలు అమలు
- మంథని బస్సు యాత్రలో రాహుల్ గాంధీ పిలుపు



మంథని, అక్టోబర్ 19, మనం న్యూస్ : రాహుల్ గాంధీ బస్సు యాత్రలో భాగంగా గురువారం మంథని నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంథని మండల కేంద్రంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దొరల పాలన సాగుతుందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు దొరల పాలనకు స్వస్తిపలికి ప్రజల పాలన తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. కాలేజీలో ప్రాజెక్టులో నిర్మాణం పేరుతో ప్రజల సొమ్మును దోచుకున్న కేసీఆర్ కుటుంబానికి తెలంగాణ ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పాలన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించి సోనియా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ తెలంగాణను సహకారం చేస్తే కేసీఆర్ కుటుంబం మాత్రమే అన్ని విధాలాగా ప్రయోజనం పొందుతున్నారని ఆరోపించారు. తెలంగాణను దొరల చేతిలో పెట్టి ప్రజలు అన్ని విధాల నష్టపోయారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో ఇచ్చిన గ్యారెంటీ పథకాలు అమలు ఆవుతున్నాయో లేదో ప్రజలు తెలుసుకోవాలన్నారు. నెహ్రూ,ఇందిరాగాంధీ కాలం నుంచి ప్రజలతో తమకున్నది అభినాభావ సంబంధమని,అందుకే తన సోదరి ప్రియాంక గాంధీని తెలంగాణకు తీసుకొచ్చానని చెప్పారు. బీజేపీది కేవలం రాజకీయ బంధం మేనని బిఆర్ఎస్,బీజేపీ,ఎంఐఎం ఒక్కటేనని మరోసారి ధ్వజమెత్తారు. దేశంలో కులగణన జరపడంలో ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. దీనివల్ల పేదలకు సంక్షేమ,అభివృద్ధి పథకాలు అందకుండా అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ గనన చేపడతామని రాహుల్ గాంధీ తెలిపారు. ఈ రోడ్డు షో కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి,సిఎల్పీ నాయకుడు బట్టి విక్రమార్కు,ఏసిసి కార్యదర్శి,మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు,ములుగు ఎమ్మెల్యే సీతక్కతో పాటు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రత్నాపూర్‌లో సహాపంక్తి భోజనాలు



రామగిరి, అక్టోబర్ 19, మనం న్యూస్ : రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో గురువారం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. దుర్గాదేవి విగ్రహం వద్ద వద్ద పూజారి సౌమిత్రి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు రూ.10,116 కమిటీకి విరాళంగా అందిచారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ, మండల రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు మ్యాదరవేణి కుమార్‌యాదవ్, టిఆర్ఎస్ అధ్యక్షులు భద్రపు ప్రశాం తరావు, కాపరమైన భాస్కర్, వార్డు సభ్యులు ఉడుతా శంకర్,కొవ్వూరి సురేష్, విగ్రహ దాత కేశవేన శ్రీకాంత్, భవానీలు ఎంపీటీసీలు ధర్మూల రాజ సంపత్, భవానీలు కెక్కర్ల. మోహన్, సింగరవేన రవి, దాసరి మల్లీ, దాసరి సుమన్, రౌతు శివ కుమార్ పటేల్, సింగారపు స్వామి, ముడుసు వంశీ, బెజ్జాల తిరుపతి, చేలుకల అధిత్యతో బుద్దే ఉదయ్, సైండ్ల తిరుపతి, సందవేన కుమార్, జక్కుల చందన్‌కుమార్, విష్ణు భక్తుల వంశీ, నగునూరి శ్రీనివాస్, గుమ్మడి ప్రసాద్, కనెవేన సది, .దర్ములసాయి, పాల్గొన్నారు.

## అమ్మవారికి బోనం సమర్పించిన ఏపీఏ - జీఎం



రామగిరి, అక్టోబర్ 19, మనం న్యూస్ : దుర్గాదేవి శరన్నవరాత్రుల్లో భాగంగా అడ్రియాల లాంగ్ వాల్ గని ఆవరణలో గల శ్రీ శక్తి మాత ఆలయంలో అమ్మవారికి ఏపీఏ జీఎం శ్రీ కే.వెంకటేశ్వర్లు వారి సతీమణి శ్రీమతి విజయలక్ష్మి ఉద్యోగుల సమక్షంలో బోనం సమర్పించారు. అనంతరం మహా అన్న ప్రసాద వితరణలో పాల్గొన్నారు. అక్టోబర్ 21న శ్రీ శక్తి మాత ఆలయంలో హోమం కార్యక్రమాన్ని నిర్వహించబడునని తెలిపారు. అర్జీ-3 జీఎం ఎన్.సుధాకరరావు,వారి సతీమణి అలివేణిలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ సీతారామం,ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వరరావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సిహెచ్. వెంకటరమణ, సివిల్ డీజీఎం పద్మరాజు, ఎస్ఓఎంలు కె.జనార్ధన్, ఎం.తిరుపతిలతో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో చేరికలు



వీణవంక, అక్టోబర్ 19, (మనం న్యూస్): బిఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమపథకాలకు ఆకర్షితులై గురువారం మండలంలోని ఐలాబాద్, మల్లారెడ్డిపల్లి, కోర్కల్, నర్సింహులపల్లి గ్రామాలలోని పలువురు యువకులు ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరగా ప్రభుత్వ విప్‌పాడి కౌశిక్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## ఈ నెలాఖరు వరకు వంద శాతం పన్నులు వసూలు చేయాలి

- మోడల్ కోడ్ నేపథ్యంలో ప్లెక్సీలు, వాల్ రైటింగులు తొలగించాలి
- డిపివో వీర బుచ్చయ్య



చిగురుమామిడి, అక్టోబర్ 19, (మనం న్యూస్): ఈ నెల చివరి వరకు ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో వంద శాతం పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య తెలిపారు. గురువారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామాన్ని సందర్శించారు.అనంతరం చిగురుమామిడి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన గ్రామపంచాయతీ కార్యదర్శుల,కారోబార్లతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చిగురుమామిడి మండలంలో 64శాతం పన్నులు వసూలైనట్లు, ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఈ నెలాఖరి వరకు వంద శాతం వసూలు చేయాలని పేర్కొన్నారు. కాంపోస్టు షెడ్ నిర్వహణ, ట్రాక్టర్ల ద్వారా డోర్ టు డోర్ చెత్తను సేకరించి వర్మి కంపోస్ట్ తయారుచేసి ఆర్థిక అభివృద్ధి సాధించాలని వివరించారు. గ్రామంలో ఉన్న పల్లె ప్రగతి షెడ్డు,క్రీడా ప్రాంగణాలను వినియోగించుకోవాలని ఆయన చెప్పారు. మోడల్ కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్స్ ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం ఉన్నాయా అన్నది పరిశీలించాలని కార్యదర్శులకు సూచించారు. ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించి గ్రామపంచాయతీలలో ఎలాంటి తీర్మాణాలు చేయరాదని, తీర్మాణాలు చేస్తే చట్టప్రకారం చర్యలుంటాయని డిపిఓ చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మామిడి నరసయ్య, మండల పరిషత్ సూపరింటెండెంట్ ఖాజా మొయినుద్దీన్, ఎంపీఓ శ్రవణ్ కుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి నా ధ్యేయం

- ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి



వీణవంక, అక్టోబర్ 19, (మనం న్యూస్): మండలంలోని కోర్కల్, నర్సింహులపల్లి, దేశాయిపల్లి,మల్లారెడ్డిపల్లి, వల్భాపూర్, లస్మక్కపల్లి గ్రామాలలో ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి గురువారం బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి కోసం సంక్షేమపథకాలను తీసుకురావడం జరిగిందని, రైతుబంధు, రైతుభీమా, దళితబంధు, బిసి బంధు పథకాలు ఆ కోవకు చెందినవేనని అన్నారు. తెలంగాణ ప్రజల కోసం ముఖ్యమంత్రి కెసీఆర్ ప్రకటించిన ఎన్నికల మెనిఫెస్టో పై అన్ని వర్గాల నుండి మంచి స్పందన వస్తుందని, వివిధ పథకాల కింద అందజేసే డబ్బులను పెంచినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధే నా ధ్యేయంగా పని చేస్తానని, రాబోయే శాసనసభ ఎన్నికల్లో హుజురాబాద్ నియోజకవర్గం నుండి భారీ మెజార్టీతో ఓటు వేసి నన్ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిడ్డి, జడ్పీటిసి వనమాల సాధవరెడ్డి, జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి, ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, సర్పంచులు నీల కుమారస్వామి,మర్రి వరలక్ష్మి స్వామి, ఎక్కటి మహిపాల్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ కామిడి కావ్య శ్రీనివాస్‌రెడ్డి, ఆశవేన తిరుపతి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బిసి సెల్ ప్రధాన కార్యదర్శిగా సోమ ప్రశాంత్



గోదావరిఖని, అక్టోబర్ 19, (మనం న్యూస్): రామగుండం కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ ప్రధాన కార్యదర్శిగా సోమ ప్రశాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్ ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన మంథని శాసనసభ్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, డిసిసి అధ్యక్షులు రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండి. ముస్తఫా, పాతపల్లి ఎల్లయ్య, గట్ల రమేష్, దూళికట్ట సతీ ష్, దాసరి విజయ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

# సీజ్ చేసిన నగదును గ్రీవెన్స్ కమిటీకి అప్పజెప్పాలి

- ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్



మహబూబాబాద్ అక్టోబర్ 19(మనం ప్రతినిధి): ఎలాంటి రిసిప్ట్ లేకుండా 50వేలకు మించి తీసుకెళుతున్న నగదు ను సీజ్ చేసి జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించాలని జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ అన్నా రు. గురువారం మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జీ పాటి ల్ గార్ల బయ్యారం మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ లను ఆకస్మిక తనిఖీ నిర్వహించి ఎన్నికల కోడ్ లో భాగంగా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పోలీస్ అధికారులు సిబ్బంది విధులను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌కు సంబంధించిన ఫైల్స్ రికార్డ్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తమ పరిధిలోని గ్రామా ల్లో పట్టణాల్లో ఎన్నికల దృష్ట్యా జరిగే నగదు సరఫరాపై పకడ్బందీగా నిఘా ఉంచి నగదు సీజ్ చేయాలని అన్నారు. రోజూ వారిగా విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించి ఎలాంటి రిసిప్ట్ లేకుండా 50వేలకు మించి తీసుకెళుతున్న నగదును సీజ్ చేసి జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించాలని అన్నారు. ఆక్రమౌాగా రవాణా అవుతున్న లిక్కర్ ను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని అన్నారు. పోలీస్ స్టేషన్ ల పరిధిలో రౌడీ షీటర్‌లను ఎన్నికలలో గొడవలను సృష్టించే వారిని ముందస్తుగా గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల కోడ్ తరువాతా ఆయా పోలీస్ స్టేషన్ ల పరిధిలో ఇప్పటి వరకు సీజ్ చేసిన నగదు లిక్కర్ బైండోవర్ కేసుల వివరాలనుపరిశీలించారు.గత ఎన్నికల్లో నమోదు అయిన కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఎస్సలు రోజు గ్రామాలను సందర్శించి ముందస్తు సమచారం తెలుసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా జరిగే ప్రతి సంఘటన ను ఎప్పటికప్పుడు తెలుసుకోగలగాలని సూచించారు.గ్రామాల్లో బెల్ట్ షాపులపై నిఘా ఉంచాలని బెల్టు షాపులను నిర్వహించకుండా పూర్తి అడ్డుకట్ట వేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి ఒక్క పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తూ ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాన్ని సమీపించే దారులను పరిశీలించాలన్నారు. ఆయా గ్రామాలలో ప్రజ ప్రతినిధుల వివరాలు గతంలో ఎన్నికల సందర్భంగా ఆయా గ్రామా లలో అయిన కేసుల వివరాలు అడిగి ఎస్పీ తెలుసుకున్నారు. ఎన్నికలను ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ అధికారులు సిబ్బంది పక్బందీగా బాధ్యతతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

## పండుగ తర్వాతనే ఎమ్మెల్సీ వర్గీయుల మద్దతుపై స్పష్టత



మహబూబాబాద్, అక్టోబర్19(మనం న్యూస్): మహబూబాబాద్ నియోజకవర్గంలో బిఆర్ ఎస్ ఎమ్మెల్యేకు ఎంఎల్‌సి వర్గం మద్దతు పండుగ తదునంతరం వెల్లడించ నున్నట్లు సమాచారం. మహబూబాబాద్ జిల్లా ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు తన అనుచరులతో సుమారు 6 గంటల పాటు సుదీర్ఘంగా చర్చించి నట్లు సమాచారం. ఎమ్మెల్యే గెలుపుకు సహకరించడంపై నాయ కులు, అనుచరులలో భిన్నభిప్రాయాలు వ్యక్తమయ్యాయని, ఈ విషయంపై మరో మారు చర్చించి దసరా పండుగ తర్వాత పత్రిక ముఖంగా వెల్లడిస్తామని తెలిపారు.

## కారు దిగి కాంగ్రెస్ గూటికి...

- పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా
- హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి



తొర్రూరు, అక్టోబర్ 19(మనంన్యూస్): పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు పట్టణ కేంద్రంలో 4వ వార్డ్‌కు చెందిన బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు బోల్లు సందీప్ వారి బృందం పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్, తాళ్లపల్లి బిక్షం గౌడ్, జలకం నవీన్ వారి ఆధ్వర్యంలో సుమారు 50 మంది కారు దిగి కాంగ్రెస్ పార్టీలో ఝాన్సీ రెడ్డి ఆధ్వర్యంలో చేరారు. వీరిని సాధారణంగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ఎవ్వరు అధైర్యపడవద్దని, బి ఆర్ ఎస్ పార్టీ బెదిరింపులకు భయపడేది లేదని, ఎలాంటి భయభ్రాంతులకు గురిచేసిన ఏమీ చేయలేవని.. నేను మీకు అండగా ఉంటానని పార్టీ కార్యకర్తలకు ధైర్యాన్ని ఇచ్చారు. ఇదేవిధంగా మాటేడు, చర్లపాలెం గ్రామాలలో కాంగ్రెస్ పార్టీకి విశేష స్పందన ఉన్నదని భారీగా చేరికలు జరిగాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్‌ఎస్‌యుఐ అధ్యక్షులు బసనబోయిన రాజేష్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మోపా మహబూబాబాద్ అధ్యక్షుడిగా మహేష్





కేసముద్రం, అక్టోబర్ 19 (మనం న్యూస్): ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) విస్తీరం లో భాగంగా మహబూబాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కేసముద్రం మండలం అర్పణ పల్లి గ్రామానికి చెందిన సింగని మహేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి గైరబోయిన మహేందర్ ముదిరాజ్ ను నియమించినట్లు మెపా రాష్ట్ర కౌన్సిలర్ మెంబర్ కేవీ రమణ ముదిరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని కేంద్ర కార్యాలయంలో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 60 లక్షల జనాభా ఉన్న ముదిరాజులకు సరైన రిజర్వేషన్ ఫలాలు అందడం లేదని మేము ఎంతో మాకంత రిజర్వేషన్ వాట అనే నిదానంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సింగని మహేష్ ముదిరాజ్ మాట్లాడుతూ తన నియోజకవర్గ అధ్యక్ష బాధ్యత అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు కొత్తగట్టు శ్రీనివాస్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజుకు ధన్యవాదాలు తెలిపారు ముదిరాజ్ యువత విద్య, ఉపాధి, సాధికారత కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

## రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ షార్ట్ ఫిలిం పోటీలకు ఆహ్వానం

- ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జీ పాటిల్



మహబూబాబాద్, అక్టోబర్19 (మనంప్రతినిధి):పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్‌డే)ను పురస్కరించుకొని మహబూ బాబాద్ జిల్లా పరిధిలో విద్యార్థిని విద్యా ర్థులకు యువతి యువకులకు ఔత్సాహిక ఫోటోగ్రా ఫర్లకు ఫోటోగ్రఫీ షార్ట్ ఫిల్మ్‌ల కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఆధ్వర్యంలో జిల్లా రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్న ట్టు మహ బూబాబాద్ జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ గురువారం ఓ ప్రక టన ద్వారా తెలిపారు. పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ ఈ నెల 21 నుంచి 31 వరకు వారోత్సవాలు నిర్వహి ంచబడుతాయని ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండి ఈ మధ్య కాలంలో తీసిన (3) ఫోటోలు తక్కువ నిడివి (3 నిమిషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం అక్టోబర్ 22వ తేదీలోపు మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సంబంధిత షార్ట్ ఫిల్మ్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్ 10-8 సైజ్ ఫోటోలను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ పీ.అర్.ఓకు అందజేయాలన్నారు. ఈ పోటీలకు నామినేషన్లు పంపించే ఔత్సాహికులు రోడ్డు ప్రమాదాలు సైబర్ నేరాలు ఈవ్ టీజింగ్ ర్యాగింగ్ కమ్యూనిటీ పోలీసింగ్ మూఢనమ్మాలు ఇతర సామాజిక రుగ్మతలు అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన ప్రకృతి వైపరిత్యాల్లో పోలీసుల సేవ ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొం దించే అంశాలకు సంబంధించి గత సంవత్సరం 2022 అక్టోబర్ నుండి ప్రస్తుత సంవత్సరం ఇప్పటివరకు తీసిన మూడు ఫోటోలు, షార్ట్‌ఫిల్మ్ మాత్రమే పంపించాల్సి వుంటుందని ఎస్పీ తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7702513469 నెంబర్ ద్వారా పీ.ఆర్.ఓను సంప్రదించాలన్నారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం శ్రమించి అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ నిర్వహిస్తున్న పోటీలకు విద్యార్థులతో పాటు ఔత్సాహికులు పెద్ద సంఖ్య లో పాల్గొన్ని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ కోరారు.

## ఇళ్ల స్థలాలు దక్కేవరకు పోరాటం చేయాలి

- పేదలకు ఇల్లు కట్టించి ఇచ్చే బాధ్యత ప్రభుత్వాలదే
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య



మహబూబాబాద్, అక్టోబర్ 19 (మనం న్యూస్): ఇళ్ల స్థలాలు దక్కేవరకు పోరాటం చేయాలని పేదలకు ఇల్లు కట్టించి ఇచ్చే బాధ్యత ప్రభుత్వాలదని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జీ నాగయ్య పేర్కొన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పేదలు వేసుకున్న గుడిసెలను సందర్శించి గుడిసె వాసుల సభలో సిపిఎం పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్ అధ్యక్షతన సభ నిర్వహించారు ఈ సభలో జి నాగయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పేదలు వేసుకున్న గుడిసెలకు అక్కడున్న కలెక్టర్లు ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధులు హక్కు పత్రాలు ఇచ్చి నివాసయోగ్యం కల్పిస్తే ఇక్కడున్న స్థానిక ఎమ్మెల్యే శంకర్ నాయక్ పేదల గుడిసెలను 15 సార్లు కూల్చి వేశారని పేదల గుడిసెలు కూల్చిన ఎమ్మెల్యే శంకర్ నాయక్ ను అడిగే రోజు దగ్గర పడిందని అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల కొమ్ముకాస్తున్న ఎమ్మెల్యే శంకర్ నాయక్ పై ప్రభుత్వ భూములు ఇళ్ల స్థలాలు దక్కేవరకు పోరాటం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు స్వర్ణపు సోమయ్య , పాల్గొని మాట్లాడుతూ పేదల సంఘటితంగా ఐక్యంగా పోరాడి సాధించుకోవాలని పాలకులు ఎక్కడ పోరాటం లేకుండా ప్రజలకు హక్కులు ఇవ్వబడలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుల పట్టణ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు చీపిరి యాకయ్య, భానోత్ వెంకన్న, బూర్గుల లక్ష్మణ్, సురేష్, జానీ, వెంకటాద్రి ,ఇందిరా, వినోద, విజయలక్ష్మి, విటల్ ,వేణు, ప్రియాంక, మనోహర్, ఉపేందర్ ,అనుష రోజా, నిజాం, రాజేశ్వరి ,సురేష్, వెంకన్న, సునీత, కుమార్, కొమరమ్మ, బుచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు

## బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలి

- కొత్తగూడెం నియోజకవర్గంలో సిపిఐ గెలుపు ఖాయం
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎసకె.సాబీర్ పాషా



భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 19 (మనంప్రతినిధి): సంక్షేమ పథకాలు అమలులో, నీళ్ళు, నిధులు, నియామకాల విషయంలో చతికల పడిన కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టి ప్రజలను చైతన్యవంతం చేయడం ద్వారా బీఆర్‌ఎస్ కు విడ్కోలు పలకాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. విద్యానగర్ కాలనీలో గురువారం జరిగిన చుంచుపల్లి మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల సంక్షేమంకోసం కాకుండా అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు, చోటామోటా నాయకులకు డబ్బులు సమకూర్చే పథకాలుగా మారాయన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేసిన సంక్షేమ పథకాలు అర్హులైన ఏ పేద దరిచేరలేదన్నారు. నీళ్ళు, నిధులు, నియామకాల నినాదంతో అధికారం చేపట్టిన కేసీఆర్ ప్రభుత్వం ఆ నినాదాన్ని అటకెక్కించి కుటుంబ పాలనకు తెరతీశారని విమర్శించారు. ఉద్యమ పార్టీ అని చెప్పుకుంటూనే బూర్జువా పార్టీ ముసుగుతో ప్రజా, ఉద్యోగ, కార్మిక ఉద్యమాలపై ఉక్కుపాదం మోపి అనిచివేసే కుట్రలు చేసిన విషయం ప్రజలకు తెలియంది కాదన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రజలు సిపిఐ పక్షాన ఉన్నారని, ఏ శక్తి సిపిఐ గెలుపును అడ్డుకోలేదని స్పష్టం చేశారు. నలపై రోజులపాటు పార్టీ శ్రేణులు అహర్నిషలు శ్రమించి సిపిఐ గెలుపుకోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జి.వీరస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బందెల నర్సయ్య, సలిగంటి శ్రీనివాస్, మండల కార్యదర్శి వాసిరెడ్డి, మురళి, జిల్లా సమితి సభ్యులు వట్టికొండ మల్లికార్జున్ రావు, వంగా వెంకట్, బానోతు గోవిందు, పోలమూరి శ్రీనివాస్, నాయకులు రాంచందర్, నాయకులు ఎస్.వి. రమణమూర్తి, గుమ్మడి సాగర్, బాగం మహేశ్వర్రావు, రాంచందర్, ఎస్. సుధాకర్, రాంజి, ఈశ్వర్, జులేఖ తదితరులు పాల్గొన్నారు.

## కనీస మద్దతు ధరపై విస్తృత ప్రచారం




కారేపల్లి, అక్టోబర్ 19 (మనం న్యూస్): నాణ్యత ప్రమాణాలు -పంటల మార్పిడి విధానం పాటించడం ద్వారా అధిక దిగుబడి పెరగడమేగాక, పంటలకు సైతం కనీస మద్దతు ధర లభిస్తుందని ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది ఎస్కే మునీర్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన కారేపల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరపై వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి మద్దతు ధరపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మీరు మాట్లాడుతూ 2023-24 సీజన్లో వరి ధాన్యం కనీసం మద్దతు ధర మొదటి గ్రేడ్ రకం ఒక క్వింటాకు 2203, సాధారణ రకం 2183 రూపాయలుగా ఉందన్నారు. మార్కెట్లో వరి ధాన్యం వికరించడానికి వచ్చిన రైతులు ధాన్యం తేమ సరిగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. పిల్లలు రాళ్ల చెత్త తాలు చెడిపోయిన రంగు మారినా మొలకెత్తిన పురుగుతున్న దాన్ని పూర్తిగా తయారు కాని మురుచుకుపోయిన దాన్ని వరి ధాన్యంతో మద్దతు ధర పూర్తిస్థాయిలో లభించదన్నారు. పూర్తిస్థాయిలో మద్దతు ధర లభించాలంటే నాణ్యమైన ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. కొనుగోలు లో ఉన్న ఇబ్బందులను, మార్కెట్ రేట్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులందరూ ఒకేసారి తమ ధాన్య ము మార్కెట్‌కు తీసుకు రాకుండా దశలవారీగా తీసుకొని రావాలన్నారు. ధాన్యం విక్రయానికి వచ్చే రైతులు వ్యవసాయ శాఖ అధికారులు అందజేసిన ధ్రువీకరణ పత్రం, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాసు పుస్తకము మొదటి రెండు పేజీలు, ఆధార్ కార్డు తీసుకు రావాలన్నారు. కాగా కారేపల్లిలోని లక్ష్మీ ప్రియా కోటక్స్ జిన్నింగ్ మిల్లులో ఈ సీజన్లో సిసిఐ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

## పద్మశాలి ప్రతిభ అవార్డు అందజేసిన సామల నరసయ్య



కేసముద్రం, అక్టోబర్ 19 (మనం న్యూస్): గురువారం రోజున పద్మశాలి అఫీషియల్స్అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ అధ్యక్షుడు సామల నరసయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవన్లో పద్మశాలి ప్రతిభా అవారడ్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎస్‌ఐ కోగిల తిరుపతి హాజరైనారు. మండల వ్యాప్తంగా చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పద్మశాలిలోని విద్యార్థులు ఎంఎస్ మెడికల్ సీటు దేవులపల్లి హర్షిత, బీ టెక్ లో మామిడాల సాత్విక్, ఎంసీఏ లో రాపాక వివేక్, పదవ తరగతిలో బెతు షాహిని, మామిడాల ప్రజ్ఞ శ్రీ, గుడ్ల కార్తీక్, ఇంటర్లో బేతు శరణ్య, గుడ్ల సాత్విక్, మిడతనపల్లి రాహుల్, డిగ్రీలో మామిడాల మహేష్, మామిడాల మౌనిక, సాంబరి ప్రకాష్ లకు ఎస్‌ఐ తిరుపతి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. చదువుకు పేదరికం అడ్డు కాదని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు సాధించి కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని తెలిపారు .పిల్లలను ప్రోత్సహిస్తూ పద్మశాలి ప్రతిభ అవార్డులు అందజేసిన సంఘ బాధ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు సామల నరసయ్య, కోశాధికారి మామిడాల శ్రీనివాస్,గార్ల పోపా చిలక నరసయ్య, పట్టణ యూత్ అధ్యక్షుడు చెలమల్ల కిరణ్,సంఘ భవన నిర్మాణ కన్వీనర్ సామల రమేష్,పట్టణ కోశాధికారి మిడతనపల్లి ప్రకాష్, పట్టణ యూత్ ట్రెజరర్ అందే రంజిత్,వివిధ గ్రామ అధ్యక్ష,కార్యదర్శులు రుద్ర యాదగిరి,గుండు శ్రీనివాస్,కాముని కుమారస్వామి, సామల రమేష్,కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ వస్తే విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత

- ఆర్‌ఎస్పీతోనే బహుజన స్థాపన
- వైరా అభ్యర్థి బానోతు రాంబాబు



ఏన్కూరు, అక్టోబర్ 19(మనం న్యూస్): రాబోవు ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ అధికారంలోకి వస్తే విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని ఆ పార్టీ వైరా నియోజకవర్గ అభ్యర్థి బానోతు రాంబాబు ఉద్ఘాటించారు. గురువారం మండల పరిధిలోని మేడేపల్లిలో ఎన్నికల ప్రచారనంతరం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బానోతు రాంబాబు మాట్లాడుతూ.. బీఎస్పీ పార్టీకి గ్రామాల్లో విశేష స్పందన లభిస్తుందని తెలిపారు. బహుజన సమాజ స్థాపన కోసం తమ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ తన పదవిని త్యాగం చేశారని గుర్తు చేశారు. విద్యార్థి సంఘం నేతగా గతంలో తాను అనేక ఉద్యమాలు చేశానని, అనేక సమస్యలపై పోరాడానని తెలియజేశారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ ఆచరణ సాధ్యం కానీ హామీలను ప్రకటించి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. వైరా నియోజకవర్గంలో అనేక సమస్యలను ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గ్రామాల్లో కనీస గూడు లేని నిరుపేదలు పూరి గుడిసెల్లో బిక్కుబిక్కుమంటూ బ్రతుకుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఎస్పీ పార్టీని ఆదరిస్తే అందరికీ అందుబాటులో ఉండి అండగా నిలుస్తానన్నారు. బీఎస్పీ పార్టీ అధికారంలోకి వస్తే యువతకు ఐదేళ్లలో పది లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ప్రతి మండలానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మిస్తామని, రైతు బీమా ద్వారా ప్రతి పంటకు కనీస మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులకు విత్తనాల నుండి విక్రయం వరకు ప్రభుత్వ రాయితీ కల్పిస్తామని, ప్రతి మహిళా కార్మికులకు, రైతులకు ఉచిత వాషింగ్ మిషన్, స్మార్ట్ ఫోన్స్, డ్రైవింగ్ శిక్షణ ఏర్పాటు చేస్తామని, మహిళా సంఘాలకు ప్రతి ఏట లక్ష రూపాయలు రుణాన్ని మంజూరు చేస్తామని, ప్రతి కుటుంబానికి రూ.15 లక్షల ఆరోగ్య భీమాను అందిస్తామని, భూమి లేని ప్రతి పేదలకు ఎకరం భూమిని మహిళలు పేరిట పట్టా చేయిస్తామని ఓటర్లకు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో తంబర్ల నరసింహారావు, యంగల నరేష్, కాంపాటి రవి, మడుగుల శరత్, నారాపోగు ఉదయ్ వారియర్, మంద మోషే, బానోత్ రజిని, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వేట కొడవళ్ళతో దాడి



పాల్వంచ, అక్టోబర్ 19 (మనం న్యూస్): పాండురంగాపురం గ్రామ పంచా యతీ పరిధిలో ఉన్నటువంటి ఆడె పు దయాకర్ అనే వ్యక్తి పై వేట కొడవళ్లతో అదే గ్రామానికి చెంది న పచ్చిపాల భాస్కర్, పచ్చిపాల రాములు దాడికి దిగారు. ఈ దాడిలో దయాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఖమ్మం లోని ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించారు. బాధితుడి తల్లి ఆడపు యేసమ్మ ఫిర్యాదు మేరకు పాల్వంచ రూరల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సమ్మక్క సారక్క ఆలయ ప్రాంగణంలో ఎన్నికల ప్రచారం

- ప్రారంభించిన బిఎస్‌పి నాయకులు బాదావత్ ప్రతాప్ నాయక్



ఇల్లందు, అక్టోబర్ 19, (మనం న్యూస్): ఇల్లందు బిఎస్పి పార్టీ ఇల్లందు నియోజకవర్గ ఇన్చార్జ్ బాదావత్ ప్రతాప్ ఆధ్వర్యంలో గురువారం ఇల్లందు మండలంలోని బుజ్జాయిగూడెం సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద ప్రచార రథానికి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రచార రథాన్ని బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు ఇర్పా రవికుమార్ దొర ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఎస్పి పార్టీ ఇల్లందు నియోజకవర్గ ఇన్చార్జ్ బాదావత్ ప్రతాప్ మాట్లాడుతూ ఇల్లందు నియోజకవర్గంలో మొట్టమొదటిసారి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభరించామన్నారు. దేశ జనాభాలో 90 శాతం ఉన్న బహుజనులు జీవితాలు మారాలంటే బీఎస్పీని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. బిఎస్పి ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి కల్పన ప్రాథమిక ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కెవి రమణ, జిల్లా మహిళా కన్వీనర్ బండి రమణి, జిల్లా కార్యదర్శి చిప్పలపల్లి శ్రీనివాసరావు, లేత ఆకులు కాంతారావు, సీనియర్ నాయకులు రాయల శ్రీనివాసరావు, గోపీనాథ్, నియోజకవర్గ ఇన్చార్జ్ బాదావత్ ప్రతాప్, నియోజకవర్గం అధ్యక్షులు తచ్చోడి సత్య నారాయణ దొర, మండల నాయకులు సింగారం, మహేందర్, వినోద్, రమేష్, వంశీ, కిషన్, సరోజ, అరుణ, రంభై, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తున్న బిఆర్ఎస్

- మణుగూరు ఏఆర్ఓకు బిజెపి నాయకుల వినతి



మణుగూరు, అక్టోబర్ 19, (మనం న్యూస్): మణుగూరు మండలంలో బిఆర్ఎస్ నాయకులు అధికార దాహంతో ఎన్నికల నియమావళి ధిక్కరిస్తున్నారని, మండలంలో ఏ గల్లిలో చూసినా బిఆర్ఎస్ గోడపత్రికలే దర్శనమిస్తున్నాయని భారతీయ జనతా పార్టీ నాయకులు మణుగూరు ఏఆర్ఓని కలసి వినతి పత్రం అందజేశారు. ప్రతి బూతులో బిఆర్ఎస్ కార్యాలయాలు ఓపెన్ చేసి వాటి ద్వారా దందాలు నడిపిస్తున్నారని, ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని అట్టి కార్యాలయాలకు ఎన్నికల అధికారి నుండి అనుమతులు ఉన్నాయా అని ఏఆర్ఓని వివరణ కోరారు. పట్టణంలో విచ్చలవిడిగా ప్రతి గల్లీలో దర్శనమిస్తున్న గోడ పత్రికల గురించి మున్సిపాలిటీ కమిషనర్‌ని ఫోన్ ద్వారా వివరణ కోరారు. గోడపత్రికలను తాము తొలగిస్తున్నా మళ్లీ అంటుస్తున్నారని మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు. ఎన్నికల అధికారుల మాటలను బేఖాతరు చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ వారిపై తక్షణమే చర్య తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ కన్వీనర్ పున్నం బిక్షపతి, మణుగూరు పట్టణ అధ్యక్షులు లింగంపల్లి రమేష్, మణుగూరు పట్టణ ప్రధాన కార్యదర్శి బీర. రమేష్ పాల్గొన్నారు.

## కూలీ లైన్‌లో సిపిఐ బూత్ కమిటీలు ఏర్పాటు



భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 19, (మనం ప్రతినిధి): కొత్తగూడెం నియోజకవర్గంలో మిత్రపక్షాల సహకారంతో సిపిఐని గెలిపించాలని సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ప్రజలకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కూలి లైన్ 23 వార్డులో కూలీ లైన్ ఏరియా సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కూలీ లైన్ ఏరియా 23, 33, 34, 35, 36 వార్డుల పరిధిలో ఉన్న10 బూతులకు ఒక్కో బూతుకు పది మంది చొప్పున 90 మందితో బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మిత్రపక్షాల మద్దతుతో పోటీ చేయబోతున్న సిపిఐ పార్టీ గెలుపు కోసం బూత్ కమిటీల సభ్యులు పార్టీ కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మామిడిపల్లి బుచ్చిరాములు, కందుల జ్ఞానయ్య, కత్తెర రవీందర్, గడ్డం రాజయ్య, అనంతగిరి అంజయ్య, మోత్కూరు శంకర్, ప్రకాష్, కిషోర్, మోహన్ రావు సత్యనారాయణ, ఐలయ్య,జ్యోతి, నాగమణి, లక్ష్మి, జడల గౌతమ్, కృష్ణ, వెంకట్, బిక్షపతి పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా అరికడతాం



బూర్గంపహాడ్, అక్టోబర్ 19,(మనం న్యూస్): బూర్గంపహాడ్ మండల పరిధిలోని కిన్నెరసాని, గోదావరి నది పరివా హక ప్రాంతాలలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని మీడియా పత్రిక వేదికగా వచ్చిన కథనాలకు తహశీల్దార్ కె.రాజారావు స్పందించారు. మండలంలో అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా కొనసాగించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేసి బైండ్‌ఓవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. కిన్నెరసాని, గోదావరినది ప్రవాహ ప్రాంతాల నుండి అర్ధరాత్రులు 10 నుండి 15 ట్రాక్టర్లు క్రమం తప్పకుండా ఇసుకతో లకాలు నిర్వహిస్తున్నారని ఇటీవల సోషల్ మీడి యాలో వార్తలు హల్చల్ చేశాయి. దీంతో అక్రమ రవాణాను అరికట్టేందుకు సుమారు 10 నుండి 15 ట్రెంచ్లు తీయించేలా చేపట్టనున్నట్లు తహశీల్దార్ తెలిపారు.

# మా మద్దతు తుమ్మలకే

- పలువురు ఖమ్మం ప్రముఖులు ఉద్ఘాటన
- ఖమ్మం నగరంలో తుమ్మల విస్తృత పర్యటన



ఖమ్మం, అక్టోబర్ 19, (మనం బ్యూరో): ఈ ఎన్నికల్లో తమ మద్దతు తుమ్మలకేనని నగరంలోని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. గురువారం ఖమ్మం నగరంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విస్తృతంగా పర్యటించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల్ని వారి ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం మద్దతివ్వాలని కోరారు. తొలుత కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రముఖ న్యాయవాది స్వామి రమేష్‌ని, ప్రముఖ సీనియర్ వైద్య నిపుణులు బోడెపూడి శైలజ అజయ్ కుమార్‌ని, బిలీఫ్ హాస్పిటల్ డాక్టర్ రమాదేవిని, డాక్టర్ బాబురావుని, మాజీ కౌన్సిలర్ నిర్మలని, మచ్చా లక్ష్మిని, బీసీ సంఘం సీనియర్ నాయకులు మేకల బిక్షమయ్యని, ప్రముఖ ఆడిటర్ వ్యాపారవేత్త, ఈశ్వరప్రగడ హరిబాబుని కలిశారు. ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ కె. వి. కృష్ణారావు ఇంటి దగ్గర వివిధ పార్టీల నాయకులతోపాటు పాత తరపు తెలంగాణ ఉద్యమ నాయకుడు విద్యాసాగర్‌ని, బిసి నాయకులు వీరభద్రంని, ఎల్‌హెచ్‌పిఎస్ నాయకులు ప్రేమ్ చంద్ర నాయక్, రాంబాబు నాయక్, ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని తుమ్మల మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీమాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ మాటకు కట్టుబడి తెలంగాణ ఇచ్చినందుకు ఈసారి మీరంతా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అధికారంలో తీసు కురావాలని కోరారు. త్రీ టౌన్ ప్రాంతంలోని సీనియర్ నాయకులు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీతోపాటు నవరాత్రి ఉత్సవాల్లో అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో మాజీ కార్పొరేటర్ తిలక్ పాల్గొన్నారు. మరోవైపు ఖమ్మం పట్టణ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సిపిఎం సీనియర్ నాయకురాలు సమీనా ఖయ్యూం ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి కాంగ్రెస్ పార్టీ గెలుపుకై వారి మద్దతు కోరారు. అనంతరం కాంగ్రెస్ ఖమ్మం పట్టణ మాజీ అధ్యక్షులు దీపక్ చౌదరిని వారి ఇంట్లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.



## ఈవిఎంల భద్రత, రిసెప్షన్ కేంద్ర ఏర్పాటుకు పరిశీలన

- కలెక్టర్ విపి గౌతమ్, సిపి విష్ణు ఎస్.వారియర్



ఖమ్మం, అక్టోబర్ 19, (మనం బ్యూరో): రానున్న శాసనసభ ఎన్నికల దృష్ట్యా వైరా నియోజకవర్గానికి సంబంధించి ఇవిఎం ల భద్రత, రిషిప్షన్ కేంద్ర ఏర్పాటుకు సాంఘీక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల భవనాలను జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్. వారియర్‌తో కలిసి గురువారం పరిశీలించారు. వైరా అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి రాండమైజేషన్ తదుపరి ఇవిఎంలు రానున్నట్లు వారు తెలిపారు. మొదట రెసిడెన్షియల్ కళాశాలకు సంబంధించి నూతన భవనాన్ని పరిశీలించి, ఇవిఎం స్ట్రాంగ్ రూం, కమీషనింగ్ కు అనువైన గదుల గురించి పరిశీలించారు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్థుల గదులు అన్ని పరిశీలించి, గదుల నిడివి, ఇవిఎంల భద్రపర్చడం గురించి ఆలోచన చేశారు. అనంతరం రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలకు సంబంధించి ఉన్న పాత భవనాలను పరిశీలించారు. డైనింగ్, డార్మిటరి, ఇతర గదులు పరిశీలించి, పాత భవనాల్లోనే ఇవిఎం, స్ట్రాంగ్ రూంల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇవిఎం స్ట్రాంగ్ రూంకు సంబంధించి ఒక తలుపు మాత్రమే ఉంచి, మిగతా తలుపులు, కిటికీలు, వెంటిలేటర్లు ఇటుకలతో పకడ్బందీగా మూసివేయాలన్నారు. హాల్‌లో ఇవిఎం, పోలింగ్ యంత్రాలు భద్రపర్చడానికి కావాల్సిన ఏర్పాట్లు వెంటనే చేపట్టి పూర్తి చేయాలన్నారు. భద్రత దృష్ట్యా చేపట్టాల్సిన బ్యారికెటింగ్, ఇతర చర్యల గురించి అధికారులకు సూచనలు చేశారు. రిషిప్షన్ కేంద్ర ఏర్పాటు, భోజన ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్‌ల ఏర్పాటుపై చుట్టూ తిరిగి పరిశీలించారు. చేపట్టాల్సిన చర్యల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాత భవనంలో ఎన్నికల సంబంధ పనులు చేపట్టనుండడంతో, నిర్మాణం పూర్తయిన క్రొత్త భవనంలో మిగిలిన టాయిలెట్, ఇతర చిన్న చిన్న పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. విద్యార్థినులు దశరా సెలవుల అనంతరం తిరిగి పాఠశాలకు, కళాశాలకు వస్తారని, వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు ఆలోగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, శిక్షణా సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు డిసిపి ప్రసాద్ రావు, ఏసీపీ రహమాన్, విద్యాశాఖ ఇఇ నాగేశ్వు, డిఇ వైకుంఠాచారి, తహసీల్దార్లు శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్లు వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ కరుణాకర్ రెడ్డి, విద్యాశాఖ ఏఇ సురేష్, అధికారులు తదితరులు ఉన్నారు.

## అన్ని పోలింగ్ కేంద్రాలలో కనీస వసతులు ఏర్పాటు చేస్తున్నాం

- తహసీల్దార్ వీరభద్రప్రసాద్



పినపాక, అక్టోబర్ 19, (మనం న్యూస్): పినపాక మండలం పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను మండల తహశీల్దార్ వీరభద్ర ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ నెల చివర వరకు ఆన్లైన్లో నూతన ఓటుకోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగ కుండా ముందుగానే పోలింగ్ కేంద్రాలను ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పరిశీలించామని తెలిపారు. పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాల స్థితిగతులను పరిశీలించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో కరెంటు వసతి, లైటింగ్‌లు అదేవిధంగా వృద్ధులకు, దివ్యాంగులకు ర్యాంపులు తదితర విషయాలను పరిశీ లించి నివేదిక తయారు చేశామని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సైతం గుర్తిస్తున్నామని తెలిపారు.18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని బాధ్యతగా ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని అన్నారు. ఆన్లైన్లో నూతన ఓటరుగా నమోదు చేసుకున్న వారి దరఖాస్తులను పరిశీలించని బీఎల్వోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆర్ఐలు వీరభద్రం, బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు

## గాజా ఆస్పత్రిపై ఇజ్రాయెల్ వైమానిక దాడి అమానవీయ చర్య

- ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకుని యుద్ధాన్ని తక్షణమే ఆపాలి.
- సెమినార్లో సిపియం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, విద్యావేత్త ఐ.వి. రమణారావు




ఖమ్మం, అక్టోబర్ 19, (మనం బ్యూరో): పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధం, దాడులు ఇలాగే కొనసాగితే మరింత మారణహోమం జరుగుతుందని, ఐక్యరాజ్యసమితి వెంటనే జోక్యం చేసుకుని యుద్ధానికి ముగింపు పలకాలని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు, విద్యావేత్త ఐ.వి.రమణారావులు కోరారు. సిపియం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ''పాలస్తీనా-ఇజ్రాయిల్ దురాక్రమణ'' అనే అంశంపై గురువారం నాడు స్థానిక సుందర్యభవన్లో సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన సెమినార్ జరిగింది. ఈ సెమినార్లో నున్నా, రమణారావులు మాట్లాడుతూ ఇజ్రాయిల్ చర్యలను తీవ్రంగా ఖండిరచారు. ఇప్పటికే వేలాది మంది మంది ప్రాణాలు కోల్పోయారని, గాయాలపాలయ్యారని అన్నారు. ఇజ్రాయెల్లోని మితవాద నెతన్యాహు ప్రభుత్వం పాలస్తీనా భూములను విచక్షణారహితంగా ఆక్రమించి వెస్ట్ బ్యాంక్లో యూదుల నివాసాలను ఏర్పాటు చేస్తోందని అన్నారు. అల్ అక్సా మజీద్లో అక్రమంగా యూదులు ప్రార్ధన చేయడానికి ప్రయత్నించిన నాటినుండి హింస పెరిగిందని, ఇజ్రాయ్యె హమాస్ దాడి చేసిందని, ఆ దాడులను సాకుగా చూపి ఇజ్రాయెల్ పాలస్తీనాపై యుద్ధం చేస్తున్నదని అన్నారు. అమెరికా ఇజ్రాయెల్ పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తూ పాలస్తీనా సమస్య పరిష్కారం కాకుండా అడ్డుపడుతున్నదని విమర్శించారు. గాజా నగరంలోని బాప్టిస్ట్ ఆసుపత్రిపై తాజాగా ఇజ్రాయిల్ దళాలు జరిపిన దాడి అత్యంత హేయమైన చర్య అని, సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని, ఈ దాడిలో మహిళలు, పిల్లలతో సహా వందలాది మంది పాలస్తీనియన్లు మరణించారని, ఇది అత్యంత ఘోరమైన దాడి అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాలస్తీనీయులను నేతన్యాహు ప్రభుత్వం ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణిస్తుంటే, ఇక్కడి మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం కూడా ఈ దేశంలోని ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని వారు విమర్శించారు. ప్రజాస్వామ్యం, రాష్ట్ర హక్కులు, లౌకికవాదం, రాజ్యాంగం లేదా రాజ్యాంగ హక్కులు అన్నీ నాశనం చేసేందుకు నిరంకుశ మోడీ ప్రభుత్వం తెగపడుతున్నట్టే, పాలస్తీనా ప్రజల హక్కులను కాలరాసేందుకు అక్కడ జాత్యహంకార నెతన్యాహు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. అమెరికా ప్రత్యక్ష మద్దతుతో ఇజ్రాయిల్ తన ఆక్రమణ సాగిస్తుంటే, దానికి మోడీ వంత పాడుతున్నారని వారు దుయ్యబట్టారు. ఐక్యరాజ్యసమితి పాలస్తీనా ప్రజలకు చట్టబద్ధమైన భౌగోళిక హక్కులను నిర్ధారించి, పాలస్తీనా భూభాగంలోని ఇజ్రాయెల్ ఆక్రమణలను తొలగించాలని, రెండు దేశాలను గుర్తిస్తూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి చేసిన తీర్మానాన్ని ఇజ్రాయెల్ అమలు చేసేలా చూడాలని అన్నారు. ఐరాస తీర్మానానికి అనుగుణంగా తూర్పు జెరూసలేంను పాలస్తీనా రాజధానిగా గుర్తించాలని, ఇజ్రాయెల్ యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని, భారత ప్రభుత్వంతో సహా అంతర్జాతీయ సమాజం చొరవ తీసుకొని పాలస్తీనా సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సెమినార్లో పార్టీ రాష్ట్ర కమిటి సభ్యులు, ఎం.సుబ్బారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రం, జిల్లా నాయకులు, జిల్లా సెంటర్ శాఖల సభ్యులు పాల్గొన్నారు.

## అసాంఘిక శక్తులకు సహకరించకండి

- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎల్లవేళలా అండగా ఉంటాం
- సీఐ శివప్రసాద్



పినపాక, అక్టోబర్ 19, (మనం న్యూస్): ఆదివాసీల అభివృద్ధి కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని ఈ బయ్యారం సిఐ శివప్రసాద్ అన్నారు. గురువారం పినపాక మండల పరిధిలోని ఎర్రగుంట గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వలస గిరిజనులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ శివ ప్రసాద్ మాట్లాడుతూ అసాంఘిక శక్తులకు సహకరించవద్దని, మావోయిస్టుల ప్రలోభాలకు లొంగకుండా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వారు వస్తే ఆశ్రయం ఇవ్వద్దన్నారు. మావోయిస్టుల ప్రలోభాలకు ఆకర్షితులు కావద్దన్నారు. ప్రజలకు రక్షణ, భద్రత కల్పించడమే పోలీసులు ధ్యేయమన్నారు. ప్రజలకు ఎలాంటి ఆపద ఎదురైనా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని లక్ష్యాలను సాధించాలన్నారు. మూఢనమ్మకాలను విడనాడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలి


- కెవిపిఎస్ పిలుపు



నేలకొండపల్లి, అక్టోబర్ 19, (మనం న్యూస్): భారత రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు పాపేట్ల సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని వివిధ గ్రామాలలో కెవిపిఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మనువాద సిద్ధాంతం నశించాలి, భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలనే నినాదంతో భారత రాష్ట్రపతికి అందించే సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతం ముసుగులో దేశ ప్రజల మధ్య ఐక్యతను, విశ్వాసాలను మంటగలిపి, మనువాద సిద్ధాంతాన్ని బలవంతంగా రుద్దేందుకు కుట్ర చేస్తుందని మండిపడ్డారు. భారత రాజ్యాంగ స్వేచ్ఛ, హక్కులు పౌరులకు దక్కకుండా ప్రజలను బానిసలుగా మార్చే అనాగరిక చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. కేంద్రంలో బిజెపి రెండవ సారి అధికారం చేపట్టిన తర్వాత అట్టడుగు వర్గాలుగా ఉన్న దళితులు, గిరిజనులు, మహిళలు, పేద ప్రజలపై నిత్యం దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం ప్రకారం ఆయా వర్గాలకు కల్పించిన హక్కులు ఏమాత్రం అమలు కావడం లేదని, ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన దళిత గిరిజనులు అనేక చోట్ల తీవ్ర వివక్షతకు గురవుతున్నారన్నారు. యూనివర్సిటీ విద్యాసంస్థలలో వివక్షతకు గురై అనేక మంది విద్యార్థులు, యువత ఆత్మ బలిదానాలకు గురికావడం ఆందోళన కలిగిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో దళిత గిరిజనులకు కేటాయించిన నిధులను వారి అభివృద్ధికి ఖర్చు చేయకుండా వేరే రంగాలకు దారి మళ్లించి ఆయా వర్గాల పట్ల తీవ్ర వివక్షతను ప్రదర్శిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. దళిత గిరిజన అట్టడుగు వర్గాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చూపిస్తున్న వివక్షత, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలంతా చైతన్యవంతం కావాలని, పేదలంతా ఐక్యంగా మనవాద సిద్ధాంతాన్ని తిప్పికొడుతూ భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకొని హక్కులను సాధించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి పొట్టపింజర స్టాలిన్, కూరపాటి ప్రసాద్, పెదపాక భాస్కరరావు, భవాని, ఎల్లమ్మ, నిర్మల, తిరుపమ్మ, రేణుక, సావిత్రి పాల్గొన్నారు.

## కందాళకే మా మద్దతు

- గిరిజన సంఘం నాయకుల తీర్మానం



కూసుమంచి, అక్టోబర్ 19, (మనం న్యూస్): పాలేరు బిఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డికే తమ మద్దతు ఉంటుందని పలువురు గిరిజన సంఘం నాయకులు పేర్కొన్నారు. కూసుమంచిలో గురువారం జరిగిన గిరిజన సంఘం మీటింగ్‌లో వారు మాట్లాడుతూ, గిరిజనులుపై తప్పుగా మాట్లాడిన పొంగులేటి గిరిజన జాతికి క్షమాపణలు చెప్పాలన్నారు. గిరిజనుల మధ్య చిచ్చు పెడితే రాజకీయంగా భూస్థాపితం చేసేదాకా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. గతంలో చాలామందిని ఎమ్మెల్యేలుగా ఓటేసి గెలిపించామని, మా సేవాలాల్ గుడి నిర్మాణం కోసం కందాళ సొంత డబ్బులతో భూమిని కొనిచ్చారని తెలిపారు. తండాలను గ్రామపంచాయతీ చేసింది కేసీఆర్ అని గుర్తు చేశారు. పార్టీలకతీతంగా గిరిజనులు ఐక్యంగా ఉండి ఉపేందర్ రెడ్డి గెలుపుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కూసుమంచి ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్, మాజీ జెడ్పి టిసి వడ్త్యా రామచంద్రన్ నాయక్, రైతు కన్వీనర్ బానోత్ రామ్ కుమార్ నాయక్, సర్పంచ్‌లు బానోత్ కిషన్ నాయక్, బా నోత్ నాగేశ్వరావు, మూడు కోటు, మంగాపురం తండ సర్పం చ్ భూక్యా సుధాకర్, ఎంపీటీసీ మంగ్యా నాయక్, గ్రామ శాఖ అధ్యక్షులు, గిరిజన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో పోలీసుల తనిఖీలు



చర్ల, అక్టోబర్ 19, (మనం న్యూస్): ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున చర్ల మండలంలో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ టివిఆర్. సూరి ఆధ్వర్యంలో పోలీస్ బలగాలు మండల కేంద్రంతో పాటు మారుమూల గ్రామాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టాయి. ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా డబ్బు, మద్యం, బంగారం లాంటి వాటితో ప్రలోభ పెట్టకుండా ఉండేందుకు పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తున్నారు. వాహనదారులు సరైన పత్రాలు చూపించకుండా 50 వేలకు మించిన నగదు, బంగారం, వెండి లాంటి వాటి రవాణాకు ఎక్కడికక్కడ చెక్ పెడు తున్నారు. వాహనదారులనుక్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత విడిచిపెట్టారు. తనిఖీల్లో ఎన్నికల ఫ్లయింగ్ స్కాడ్ అధికారి కే. నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రౌడీలు, గుండాలు, అవినీతిపరులను గెలిపిస్తే..

- రామగుండం రౌడీ రాజ్యమవుతుంది
- మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ





గోదావరిఖని, అక్టోబర్ 19, (మనం న్యూస్): రౌడీలు, గుండాలు, అవినీతిపరులను ఎమ్మెల్యేగా గెలిపిస్తే రామగుండం రౌడీ రాజ్యంగా తయారవుతుందని మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నారు. గురువారం గోదావరిఖని విఠల్ నగర్ ఏరియా నుండి ప్రజా అంకిత బస్తి బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మున్సిపల్ చైర్మన్ గా,ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వందల కోట్ల నిధులతో రామగుండం ప్రాంతంలో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఎలాంటి అవినీతి జరగకుండా పరిపాలన సాగించానని, రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపించానన్నారు. కానీ ఇప్పుడున్న ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలు, భూ మాఫియా, ఇసుక మాఫియా,బూడిద మా టఫియాలతో పాటు ఉద్యోగాల పేరుతో అక్రమ వసూలు చేశారని ఆరోపించారు. కోరుకంటి చందర్ ని డిపాజిట్ రాకుండా ఓడించాలని ప్రజలను కోరారు. ఈ ఎన్నికల్లో ఎవరు మంచివారు,ఎవరు చెడ్డవారు, ఎవరు గెలిస్తే పని చేస్తారో చూసి ఓటేసి గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ జాలి రాజమణి, రాపోలు కుసుమ కుమారి, మాజీ కార్పొరేటర్లు పిడుగు కృష్ణ,వడ్డూరి రవి,కోదాటి ప్రవీణ్,మంచికట్ల బిక్షపతి, సోమరుపు లావణ్య, అరుణ కుమార్, కర్రవుల డేవిడ్ రాజ్, జనగామ రాయలింగు, ములుగురి వీరన్న, సాగి కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- చల్మెడను గెలిపించాలని బిఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం



వేములవాడ, అక్టోబర్ 19, (మనం న్యూస్): రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి చలిమెడ లక్ష్మీనరసింహారావును ఆశీర్వదించి గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు గురువారం పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. స్థానిక 16,18 వార్డుల్లో బిఆర్ఎస్ పార్టీ వార్డు కౌన్సిలర్లు కొండ కనకయ్య, శ్రీలత, కొండ పావని నర్సయ్య ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డ్ కౌన్సిలర్లు కొండ శ్రీలత, కొండ పావని మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో అభివృద్ధి పథకాలు ఇంటింటికి అందుతున్నాయని, వేములవాడ మున్సిపల్ వార్డులలో ప్రతి అభివృద్ధి కార్యక్రమం బిఆర్ఎస్ పార్టీ ద్వారానే జరిగిందని, అభివృద్ధి అనేది ఇలానే కొనసాగాలంటే బిఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావును ప్రజలు ఆశీర్వదించి, గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పుల్కం రాజు, రామతీర్థపు రాజు, కౌన్సిలర్లు నిమ్మచెట్టి విజయ్, సిరిగిరి చందు,మారం కుమార్ కో ఆప్షన్ మెంబర్ బాబున్, నాయకులు గూడూరి మధు, గన్నమనేని రామారావు, గోపు బాల్ రాజు, సుంకపాక రాజు తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్పీ నుంచి జర్నలిస్టుకు అవకాశమివ్వాలి



మంచిర్యాల, అక్టోబర్ 19, (మనం న్యూస్): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని వర్గాల వారికి బహుజన సమాజ్ పార్టీ న్యాయం చేస్తామనడం గొప్ప విషయమని, అదేవిధంగా బెల్లంపల్లి నియోజకవర్గం నుండి జర్నలిస్ట్‌కు కూడా ఒక టికెట్ కేటాయించాలని జర్నలిస్టులు శ్రీనివాస్ నాయకత్వంలో పలువురు జర్నలిస్టులు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు గురువారం కాగజ్ నగర్ పార్టీ కార్యాలయంలో ప్రవీణ్ కుమార్ ను కలసి వినతి పత్రం సమర్పించారు. సమాజంలో జర్నలిస్ట్ ల పాత్రను గుర్తించి టికెట్ కేటాయించాలని కోరారు. ఈ విషయంపై పరిశీలించి ప్రజల్లో ఉన్నవారికి తప్పకుండా అవకాశమిస్తామని ప్రవీణ్ కుమార్ హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు

## ఎంపి అర్వింద్ స్థాయిని దిగజార్చుకుంటున్నారు

- ఆయన మరణిస్తే రూ.20 లక్షల సహాయాన్ని అందిస్తాం
- ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు సమ్మయ్య ముదిరాజ్



హుజురాబాద్ టౌన్, అక్టోబర్ 19, (మనం న్యూస్): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పట్ల అనుచిత వ్యాఖ్యలకు పాల్పడ్డ నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్ తన స్థాయిని దిగజార్చుకుంటున్నార ని ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు కొలిపాక సమ్మయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక మహిళ అని కూడా చూడకుండా కళ్ళు నెత్తికెక్కి తీవ్ర పదజాలంతో దూషించడం సమంజసం కాదని తెలిపారు. కవిత పట్ల ఆయన చేసిన వ్యాఖ్యలకు తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అర్వింద్ మరణిస్తే తాను బిచ్చమెత్తుకుని అయినా సరే ఆయన కుటుంబ సభ్యులకు 20 లక్షల రూపాయలను అందిస్తానని పేర్కొన్నారు.

## మంద కృష్ణ మాదిగ రథయాత్రను విజయవంతం చేయాలి

- ఎమార్పీఎస్ జిల్లా ఇంచార్జి వేంకటేశ్వర్లు



హుజురాబాద్ టౌన్, అక్టోబర్ 19, (మనం న్యూస్): ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోరుతూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ తలపెట్టిన రథయాత్ర విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి బచ్చలకూర వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం హుజురాబాద్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 29 సంవత్సరాలుగా ఎన్ని పోరాటాలు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో ప్రతి పార్టీ ఎన్నికల ముందు ఓట్లు దండుకొని ఎన్నికల అనంతరం గెలిచిన పార్టీలన్నీ తమను మోసం చేస్తూ వస్తున్నాయన్నారు. రాబోయే పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతను చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల ముందు తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలతో పాటు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ కార్యాచరణ ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నవంబర్ 7న హైదరాబాద్లో తలపెట్టిన బహిరంగ సభకు జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో మాదిగ దాని ఉప కులాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఎంఎస్పి హుజురాబాద్ నియోజకవర్గం కోఆర్డినేటర్ తునికి వసంత్, ఎమ్మెస్ పి కరీంనగర్ జిల్లా కన్వీనర్ రుద్రారపు రామచంద్రం, కొకన్వీనర్ మారేపల్లి శ్రీనివాస్, నాయకులు ఇంజన్ వెంకట్ స్వామి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్,, దేవునూరి రవీందర్, ఎంఈ ఎఫ్ నాయకులు ఇల్లందుల సమ్మయ్య, కాల్వల మల్లయ్య, మట్టెడ ప్రకాష్, ముక్కెర ముఖేష్, అంతడ్పుల సంపత్, నక్క లక్ష్మయ్య, రొంటాల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలి

- ప్రజాసంఘాల జెఏసి చైర్మన్ గజ్జల కాంతం



జమ్మికుంట, అక్టోబర్ 19, (మనం న్యూస్): వచ్చే నెల 4వ తేదీన కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్న తెలంగాణ ప్రజా గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజా సంఘాల జెఏసి చైర్మన్ గజ్జల కాంతం పిలుపునిచ్చారు. గురువారం జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి బిజెపి శనిలా దాపురించిందని, హిందూ మతం అనే ముసుగులో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తుందని అభివృద్ధిని పక్కనపెట్టి రాష్ట్రాలను ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ను స్వాగతిస్తున్నామని కానీ 33 శాతంలో బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఎంత వాటో చెప్పకుండా మోసం చేస్తున్నారన్నారు. వెంటనే ఎవరి వాటా ఎంతో చట్టసభలో తెలుపాలని ఆయన డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీని చంపిన గాడ్సే ఆర్ఎస్ఎస్ వారసుడని అలాంటి బిజెపిని ప్రోత్సహించడం సరైంది కాదన్నారు. 60 శాతం ఉన్న బీసీలను కుల గణన చేపట్టకుండా అన్యాయం చేస్తున్నారని కాంతం మండిపడ్డారు. ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కుల మతాలకు అతీతంగా నవంబర్ 4 న నిర్వహించే తెలంగాణ ప్రజాగర్జన బహిరంగ సభకు లక్ష మంది హాజరై విజయవంతం చేయాలని ఈ దెబ్బతో కేంద్రం దిమ్మతిరగాలని ఆయన అన్నారు. బిజెపి ఆర్ఎస్ఎస్‌లు మరోసారి అధికారంలోకి వస్తే హిందువులకు దళితులకు గిరిజనులకు ఆదివాసులకు అణగారిన వర్గాల ప్రజలకు రైతులకు రక్షణ లేకుండా పోతుందని, దేశం నుండి వారిని తరిమికొట్టాలన్నారు.

## దళితుల సంక్షేమంపై చర్చకు సిద్ధమా..?

- ఆరెపల్లి ఆరోపణలు అక్షరాల నిజమే
- మండల బిజెపి అధ్యక్షులు రాపాక ప్రవీణ్



కరీంనగర్ అక్టోబర్ 19, (మనం న్యూస్): మానకొండూర్ నియోజకవర్గ దళితుల సంక్షేమం పై పట్టింపులేని ఎమ్మెల్యే రసమయి నిజమైన దళిత ద్రోహి అని మండల బిజెపి అధ్యక్షులు రాపాక ప్రవీణ్ అన్నారు. గురువారం స్థానిక బిజెపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రసమయిపై బిజెపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ చేసిన ఆరోపణలు అక్షర సత్యమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎంతమందికి దళిత బందు వచ్చింది? ఎంతమందికి మూడెకరాల భూమి వచ్చింది? డబుల్ బెడ్రూమ్ ల పథకంలో ఎంతమంది దళితులు లబ్ది పొందారు? అనే విషయాలను చెప్పకుండా ఎంతోమందికి ఆశలు చూపిస్తూ దళితులను మోసం చేస్తున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. రసమయి పేరుతో ఆత్మహత్యకు పాల్పడ్డ బెజ్జంకి మండలం గూడెం కుచెందిన మహంకాళి శ్రీనివాస్ కుటుంబానికి ఏం న్యాయం చేసారని అడిగారు. తిమ్మాపూర్ మండలం రాజీవ్ రహదారి పక్కన ఏర్పాటు చేసిన అంబేడ్కర్, జగ్జీవన్ రాం విగ్రహాలను ఆవిష్కరణ చేయకుండా ముసుగులు వేసి దాదాపు రెండేళ్లయినా ఇంకా అనుమతి రాకున్నా కూడా దాటవేత ధోరణి అవలంభిస్తున్నారని ప్రవీణ్ మండిపడ్డారు. విగ్రహాలను ఈ నెలాఖరుకు ఆవిష్కరణ చేస్తామని చెబుతున్న రసమయి వెంటనే అనుమతి పత్రాలను బహిర్గతం చేయాలన్నారు. దళితుల సంక్షేమం పై ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే మానకొండూర్ చెరువు కట్టపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ సమావేశం లో గన్నేరువరం మండల బిజెపి అధ్యక్షులు నగునూరి శంకర్, సీనియర్ నాయకులు సిరిసిల్ల చంద్రయ్య,కొండ్ర వరప్రసాద్, ఆరెపల్లి క్రాంతి,సునంద్, శనిగరపు ఐలయ్య, జాగిరి రమేష్, ఎల్కపల్లి స్వామి, ప్రశాంత్, మోదుంపల్లి సాయి వినయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## గెలుపోటములను పక్కనబెట్టి ఆటలో నైపుణ్యాన్ని ప్రదర్శించాలి



నస్పూర్, అక్టోబర్ 19, (మనం న్యూస్): క్రీడాకారులు గెలుపు ఓటములపై కాకుండా ఆటలో నైపుణ్యాన్ని ప్రదర్శించాలని శ్రీరాంపూర్ జిఎం సంజీవ రెడ్డి తెలిపారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రగతి స్టేడియంలో కంపెనీ లెవెల్ హాకీ పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల హాకీ క్రీడాకారులు కంపెనీ స్థాయి పోటీల్లో పాల్గొనడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. క్రీడాకారులందరూ పోటీల్లో ప్రతిభను చాటాలని, కోలిండియా స్థాయిలో సింగరేణికి మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం వలన మానసిక, శారీరక దృఢత్వం ఏర్పడుతుందని తెలిపారు. క్రీడాకారులందరూ గెలుపు ఓటముల పై ఆలోచించకుండా ఆటలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని కోరారు. ఈ పోటీల్లో సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల నుండి ఆరు జట్లు పోటీలో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జీఎం రఘు కుమార్, డిజీఎం (పి) అరవింద రావు, స్పోర్ట్స్ హానరరి సెక్రటరి పాలకుర్తి రాజు, స్పోర్ట్స్ సూపర్వైజర్ అశోక్, ఇంచార్జ్ స్పోర్ట్స్ మేనేజర్ జాన్వెస్లీ, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ సురేష్, హాకీ శ్రీరాంపూర్ ఏరియా కెప్టెన్ తిరుపతి, అన్ని ఏరియాల స్పోర్ట్స్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో అసమ్మతి సెగలు

వెల్గటూర్, అక్టోబర్ 19, (మనం న్యూస్): ఎండపల్లి మం డల బిఆర్ఎస్‌లో నాయకుల మధ్య అసమ్మతి రాగం వినిపిస్తుం ది. అసలే క్లిష్టమైన ఎన్నికల సమయంలో నాయకుల మధ్య స మన్వయం కొరవడడంతో పార్టీ కార్యకర్తల్లో నిస్తేజం కనిపిస్తోం ది. మాకు మేమే మీకు మీరే అన్నట్లు తయారైంది నాయకుల వైఖరి. గురువారం గుల్లకోట గ్రామంలో బూత్ స్థాయి సమావే శంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పాల్గొని ప్రసంగిస్తుండగా, కార్యకర్తలు నాయకుల మధ్య మాటల యుద్ధం మొదలైంది. మాటా మాటా పెరగడం, దుర్భాషలు మొదలవడంతో నాయకు లు అక్కడ నుండి వెనుదిరిగారు. అసలే ఎన్నికల సమయం ఈ సమయంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచే యాలి కానీ మాటల యుద్ధం చేసుకోవడం ఏమిటని పార్టీలో చ ర్చించుకుంటున్నారు.

## దుర్గాదేవి మండపం వద్ద 'మహా అన్నదానం'



జమ్మికుంట, అక్టోబర్ 19, (మనం న్యూస్): పట్టణంలోని గణేష్ నగర్‌లోని దుర్గా దేవి మండపం వద్ద ఠాగూర్ రాజేష్, ఠాగూర్ రాకేష్‌ల ఆధ్వర్యంలో గురువారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మొదట దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, దుర్గాదేవి మాల ధారణ స్వాములు ఆకుల రాజేందర్, మాగంటి భాస్కర్, నాయకులు పల్లెపు రవి, మోతి స్వామి, శ్యాంజి, కైలాస కోటి గణేష్, లక్ష్మి, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజెపి నాయకులు చేసిన ఆరోపణలు నిరూపించాలి

- బిఆర్ఎస్ నాయకులు కుమారస్వామి



జమ్మికుంట, అక్టోబర్ 19, (మనం న్యూస్): బిజెపి నాయకులు తమపై చేసిన ఆరోపణలు నిరూపించాలని బిఆర్ఎస్ నాయకులు జువ్వాజి కుమారస్వామి సవాల్ విసిరారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి నాయకులు తమపై చేస్తున్న చిల్లర ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు. ఆత్మగౌరవంతో ఈటల రాజేందర్‌తో కలిసి ఇన్ని సంవత్సరాలు పనిచేశామని, తమ కుటుంబాలు రోడ్డు మీద పడుతున్నాయని గోడును వెల్లబోసుకున్నా ఆయన కనికరించలేదన్నారు. బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు చూసి ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరితే, తమపై కొందరు బిజెపి నాయకులు మీడియా సమావేశాలు పెట్టి అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆరోపణలు చేసిన నాయకులు జమ్మికుంట అమరవీరుల స్తూపం వద్ద నిరూపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ మైనార్టీ నాయకులు మహమ్మద్ జానీ, యూత్ నాయకులు రాపర్తి అఖిల్ గౌడ్,మార్క అరవింద్ గౌడ్, పొన్నాల అనిల్, నల్లగోని శ్రీనివాస్, పిట్టల అనిల్, ఎర్రబాటి రమేష్, వంశీ, చందు, శ్రీను, మధు, కృష్ణ, యుగంధర్ పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో మంత్రి గంగుల కుటుంబ సభ్యుల ప్రచారం



కొత్తపల్లి, డిసెంబర్ 19, (మనం న్యూస్): రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఓటు వేసి గంగుల కమలాకర్‌ను మరోసారి గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి సతీమణి రజిత, సోదరుడు గంగుల సుధాకర్, వదిన శారదలు కొత్తపల్లి పట్టణంలో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రతి మహిళకు బొట్టు పెట్టి బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గంగుల కమలాకర్ ను గెలిపించాల్సిందిగా ఓటర్లను అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహించారు. వీరికి తోడుగా కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు ప్రచార సరళిలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికి తిరుగుతూ కరీంనగర్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వాసాల రమేష్, మాజీ జెడ్పి కో-ఆప్షన్ సభ్యులు జమీరుద్దీన్, మున్సిపల్ కౌన్సిలర్లు గుండు రాంబాబు, ఎస్‌కె.నాజీయా బాబ, వేముల కవిత చంద్రశేఖర్, చింతల సత్యనారాయణ రెడ్డి, వేణుగోపాల్, కో-ఆప్షన్ మెంబర్లు కట్ల మమత సుధాకర్, షహనాజ్ మున్వర్ ఖాన్, ఎండి. ఫక్రుద్దీన్, చెట్టుపల్లి ప్రభాకర్, రైతు సంఘం నాయకులు కొత్త రాజయ్య హనుమాండ్లు. బిఆర్ఎస్ నాయకులు రుద్రరాధ, జేరిపోతుల శ్రీకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



మంథని, అక్టోబర్ 19, మనం న్యూస్ : ఆకుల భవాని శంకర్ ఇటీవల మృతి చెందగా ఆయన స్మారకార్థం టోర్నమెంట్‌కు గురువారం పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు భవాని శంకర్‌ల స్మారకార్థం క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడల్లో రాణిస్తూ జిల్లా,రాష్ట్రస్థాయికి ఎదుగాలని ఆకాంక్షించారు.

# నిస్సిగ్గు మాటలకు కేరాఫ్ అడ్రస్ కేటీఆర్

- తెలంగాణకు అసమర్థుల పాలన ఇక అవసరం లేదు
- ఐటీఐఆర్ ప్రాజెక్టును పాతాళానికి తొక్కిన బీఆర్ఎస్
- కేటీఆర్ వ్యాఖ్యలకు రేవంత్‌రెడ్డి కౌంటర్
- సింగరేణి ఎన్నికలు జరగాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలి



హైదరాబాద్, అక్టోబర్ 19, (మనం న్యూస్): కాంగ్రెస్ పై కేటీఆర్ వ్యాఖ్యలకు.. రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. నిస్సిగ్గు మాటలకు కేరాఫ్ అడ్రస్ కేటీఆర్ అని ఆరోపించారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయించలేని అసమర్థులని విమర్శించారు. తెలంగాణకు అసమర్థుల పాలన ఇక అవసరం లేదని రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. 10 ఏళ్ల అధికారంలో ఉండి అంట కాగింది బీజేపీ, బీఆర్ఎస్ అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన గిరిజన వర్సిటీ, బయ్యారం ఉక్కుకు పాతరేసింది మీరేనని ఆయన ఆక్షేపించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును పాతాళానికి తొక్కింది బీఆర్ ఎస్ ప్రభుత్వమేనని రేవంత్ రెడ్డి విమర్శించారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయించలేని అసమర్థులని.. తెలంగాణకు అసమర్థుల పాలన ఇక అవసరం లేదని ఆయన ట్వీట్ చేశారు. అసలేం జరిగిదంటే : తెలంగాణకు నంబర్ వన్ విలన్ కాంగ్రెస్ అని కేటీఆర్ ధ్వజమెత్తారు. ల్యాండ్ మాఫియాకు కేరాఫ్ రేవంత్ రెడ్డి అని విమర్శించారు. ఆయన.. ముక్కు నేలకు రాసినా రాష్ట్ర ప్రజలు హస్తం పార్టీని నమ్మరని తెలిపారు. సంక్షేమంలో స్వర్ణయుగానికి కేరాఫ్ తెలంగాణ.. చీకటి పాలనకు చిరునామా కర్ణాటకని దుయ్యబట్టారు. గత పదేళ్ల కాలంలో ట్రైబల్ యూనివర్సిటీపై రాహుల్ గాంధీ ఎందుకు నోరు మెదపలేదని కేటీఆర్ ప్రశ్నించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీపై.. రాహుల్ గాంధీ ఒక్కసారైనా ఎందుకు బీజేపీని నిలదీయలేదని కేటీఆర్ ప్రశ్నించారు . విభజన హామీలపై ఏనాడూ ఎన్డీఏను ప్రశ్నించని రాహుల్ కు.. రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదని విమర్శించారు. కర్ణాటకలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ వంద రోజుల్లోనే బొందపెట్టిన హస్తం పార్టీ అని మండిపడ్డారు. కానీ తెలంగాణలో మేనిఫెస్టోలో ఇవ్వని హామీలనూ నెరవేర్చిన ప్రభుత్వం తమదని కేటీఆర్ అన్నారు. నమ్మి ఓటేసిన కర్ణాటక ప్రజలను నట్టేట ముంచి.. తెలంగాణలో నాటకాలకు తెర తీస్తే నమ్మేవారు ఎవరూ లేరని కేటీఆర్ పేర్కొన్నారు. కరప్షన్ కు కేరాఫ్ కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. కర్ణాటకలో కమీషన్ల కోసం కాంట్రాక్టర్లను నిత్యం వేధింపులకు గురి చేసి.. ఇక్కడికొచ్చి నీతి వాక్యాలు చెబుతున్నారా అంటూ నిలదీశారు. పోడు భూముల సమస్యను దశాబ్దాలుగా కోల్డ్ స్టోరేజీలో పెట్టింది మీరైతే.. ఏకంగా 4.50 లక్షల ఎకరాల భూములు పంచి అడవి బిడ్డలకు పట్టాభిషేకం చేసిన ప్రభుత్వం తమదని కేటీఆర్ గుర్తుచేశారు. శ్రీకాంతాచారిని బలి తీసుకున్న కాంగ్రెస్ పార్టీకి.. ఆ అమరుడి పేరెత్తే హక్కు లేదని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ ఏర్పాటులో పదేళ్ల జాప్యమే.. వందల మంది బలిదానాలకు కారణమైందని మండిపడ్డారు. నిన్న అయినా.. నేడు అయినా.. రేపు అయినా తెలంగాణకు నంబర్ వన్ విలన్ కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. గాంధీభవన్ ను గాడ్సేకు అప్పగించిన నాడే.. తెలంగాణ హస్తం పార్టీకి కౌంట్ డౌన్ మొదలైందని కేటీఆర్ ఎక్స్ ట్విటర్ లో ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ జోష్‌గా ప్రారంభించిన బస్సు యాత్ర ప్రస్తుతం భూపాలపల్లిలో కొనసాగుతుంది. ఈ క్రమంలో అక్కడి సింగరేణి కార్మికులతో పీసీసీ ఛీఫ్ రేవంత్‌రెడ్డి సమావేశం అయ్యారు. తాము అధికారంలోకి రాగానే సింగరేణి సమస్యలు పరిష్కరించి.. ఎన్నికలు జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. మొదటి విడతగా మొదలైన ఈ బస్సు యాత్ర నిజామాబాద్‌లో ముగియనుంది. కాంగ్రెస్ నాయకులు ఈ యాత్రను పార్టీ అగ్రనేతలతో ప్లాన్ చేశారు. కాంగ్రెస్ డిక్లేర్ చేసిన 6 గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తతంగా తీసుకెళ్లడానికి ఈ యాత్ర ఉపయోగపడుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. భూపాలపల్లిలో కొనసాగుతున్న బస్సు యాత్రలో భాగంగా పీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి సింగరేణి కార్మికులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కార్మికులకు తీవ్రస్థాయిలో అన్యాయం చేస్తుందని ఆరోపించారు. ఒక్క అధికారిని సీఎండీగా ఇంతకాలం ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సింగరేణి మంచి లాభాల్లో ఉండాలి అంటే మంచి యాజమాన్యం చేతిలో ఉండాలని చెప్పారు. ఈసారి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే సింగరేణి సమస్యలన్నీ పరిష్కరిస్తాని రేవంత్ హామీ ఇచ్చారు. గండ్ర సత్యనారాయణ ఎన్నిసార్లు ఓడిపోయినా ప్రజలోతోనే ఉన్నారంటూ తెలిపారు. డిసెంబరు 27న సింగరేణి ఎన్నికలు జరగాలంటే రాష్ట్రంలో డిసెంబరు 3న తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన బీఆర్ఎస్ నేతలకు కేసీఆర్ పదవులు ఇస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించండి అంటూ ప్రజలను కోరారు. రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికులు ప్రత్యక్ష భాగస్వాములు అన్న రేవంత్ రెడ్డి.. వారు చేసిన త్యాగాలను సీఎం కేసీఆర్ మరిచిపోయారని మండిపడ్డారు. కార్మికుల వైపు ఉన్నామన్న ప్రభుత్వం.. ఇప్పుడు వారి సమస్యలను పట్టించుకోకుండా.. గాలికి వదిలేసిందని విమర్శించారు. సింగరేణిని ప్రైవేటు పరం చేయడానికి కేసీఆర్ ప్రభుత్వం ఒప్పుకుందని పీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. అరబిందోకు మైన్ అప్పగించింది నిజం కాదా అంటూ ప్రశ్నించారు. తాడిచర్ల గనులను కేసీఆర్ అనుచరులకు ఇచ్చింది నిజం కాదా అంటూ నిలదీశారు. నైనికోల్ మైన్‌ను అదానీకి కట్టబెట్టాలని కేసీఆర్ ప్రభుత్వం చూసిందని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే సింగరేణి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సింగరేణి ఎన్నికలు ఎందుకు జరపడం లేదని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## జనచైతన్య ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం



హుజూర్‌నగర్, అక్టోబర్ 19, (మనంన్యూస్): పట్టణంలోని ఓ ఆసుపత్రిలో మహిళకు ఏ పాజిటీవ్ రక్తం అత్యవసరం కాగా గురువారం జనచైతన్య ట్రస్ట్ నిర్వహకులు వంశీ, పారా సాయి, శివశంకర్‌లకు తెలుపగా తక్షణమే స్పందిచి బ్లడ్‌డోనర్ కటారి లిఖిత్ తో మాట్లాడి హస్పిటల్ వద్దకు వెళ్ళి ఏ పాజిటివ్ రక్తదానం చేయడం జరిగింది. జనచైతన్య ట్రస్ట్ తరుపున రక్తదానం చేయడం పట్ల ట్రస్ట్ సభ్యులు లిఖిత్‌ను అభినందించారు. ఈ సందర్భంగా జనచైతన్య ట్రస్ట్ నిర్వహకులు పినపారాళ్ళ వంశీ, సాయి, శివశంకర్‌లు వమాట్లాడుతూ. రక్తదానం ప్రాణదానంతో సమానామని, ప్రతివ్యక్తి సంవత్సరానికి 3సార్లు రక్తదానం చేయవచ్చు అన్నారు. రక్తం అవసరం ఉన్న వారికి జనచైతన్య బ్లడ్ డోనేషన్ టీం అన్ని వేళల అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రతిఒక్కరూ రక్తందానం చేయాలని కోరారు.

## గర్భిణీలకు న్యూట్రేషన్ కిట్ అందజేత



తిరుమలగిరి, అక్టోబర్ 19, (మనం న్యూస్): స్థానిక ప్రాధమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ కిట్లను 50 మందికి గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం మాట్లాడుతూ గర్భిణీలు విధిగా ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని ప్రభుత్వం ఇచ్చే న్యూట్రిషన్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళ వ్యాయామం చేయడం వల్ల సహజ కాన్పు అవుతారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సహజ కాన్పు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మల్లెల వందన, సీహెచ్‌వో మాలోతు బిచ్చునాయక్, సూపర్‌వైజర్ రామచంద్రు, స్వరూపకుమారి, పల్లె దవాకానా డాక్టర్లు ఆరోగ్య సిబ్బంది, ఆశకార్యకర్తలు, గర్భిణీలు పాల్గొన్నారు. ఆనంతరం ఆరోగ్య సిబ్బంది ప్రాధమిక కేంద్రంలో బతుకమ్మ పండుగ సంబరాలు నిర్వహించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



తిరుమలగిరి, అక్టోబర్ 19, (మనం న్యూస్): వానకాలం సీజన్ ధాన్యం కొనుగోలుచేయడానికి సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసిల్దార్ రమణారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని శుభ్రం చేసుకొని కేంద్రాలకు తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలకు ఏ గ్రేడ్ రూ. 2203లు బి గ్రేడ్ రూ. 2183లు పొందాలని కోరారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని చెప్పారు. కేంద్రం నిర్వహకులు ఎన్నికల కోడ్ నిబంధనలు అనుసరించి పనిచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏపీఎం సైదయ్య, సీసీలు యాదయ్య, విజయలక్ష్మి, ఎఈవో వెంకట్‌రెడ్డి, వివోఏ సంధ్య, రైతులు పాల్గొన్నారు.

## 29న తిరుమలగిరిలో జరిగే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

జాజిరెడ్డిగూడెం, అక్టోబర్ 19, (మనం న్యూస్): ఈనెల 29న తిరుమలగిరిలో జరిగే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మినర్సయ్యయాదవ్ అన్నారు. గురువారం రామన్నగూడెం ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలగిరిలో జరిగే కేసీఆర్ సభకు కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు మొరిశెట్టి ఉపేందర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల విశ్వరూప మహాసభ కరపత్రాల ఆవిష్కరణ



జాజిరెడ్డిగూడెం, అక్టోబర్ 19, (మనం న్యూస్): మాదిగల విశ్వరూప మహాసభ కరత్రాలను గురువారం అర్వపల్లిలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఇటికాల చిరంజీవి మాట్లాడుతూ నవంబర్ 7న జరిగే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దామెర్ల లాలయ్య, జిల్లా కోశాధికారి ఉబ్బపెల్లి బాలయ్య, వీరు, యేదాసు కృష్ణ, అల్లేయ్య, పవన్, ఉమేష్, సాయికిరణ్, ప్రవీణ్, అశోక్, అంజి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# హుజూర్‌నగర్‌లో భారీ మెజార్టీతో గెలుస్తా

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి
- ప్రజా ఆశీర్వాధసభ ను విజయవంతం చేయాలి
- సీఎం సభాస్థలం, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సైదిరెడ్డి



హుజూర్‌నగర్, అక్టోబర్ 19, (మనంన్యూస్): ఈనెల 31న హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో రామస్వామి గట్టు రోడ్డులో ఏర్పాటు చేయనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాధసభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. గురువారం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ముఖ్యానాయకులతో కలిసి ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సభస్థలి, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. వచ్చే ఎన్నికల్లో మళ్ళీ బీఆర్ఎస్ పార్టీ గెలిచి హ్యాట్రిక్ విజయం సాధిస్తుందన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలుస్తానన్నారు. ఈ నెల 31న జరిగే సీఎం ఆశీర్వాధ సభకు బీఆర్ ఎస్ ప్రజాప్రతినిధులు, శ్రేణులు అధిక సంఖ్యలో హజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ తిప్పన విజయసింహారెడ్డి, సీఐ రామలింగారెడ్డి, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కడియాల వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ముఖ్యానాయకులు పాల్గొన్నారు.

# ఢిల్లీకి కిషన్ రెడ్డితో సహా కీలక నేతలు పయనం

- అభ్యర్థుల ఎంపికపై బీజేపీ కసరత్తు

హైదరాబాద్, అక్టోబర్ 19, (మనం న్యూస్): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై బీజేపీ కసరత్తు కొనసాగుతుంది. ఈనేపథ్యంలో ఇవాళ ఢిల్లీలో తెలంగాణ బీజేపీ నేతల కీలక భేటీ అయ్యారు. ఇప్పటికే ఢిల్లీకి తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి, లక్ష్మణ్, బండి సంజయ్, ఈటల రాజేందర్ చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, జేపీ నడ్డాతో రాష్ట్ర నేతల ప్రత్యేక భేటీ అయ్యారు. తెలంగాణలో రూట్ మ్యాప్, అభ్యర్థుల ఖరారుపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అన్ని కుదిరితే ఇవాళ రాత్రికే తెలంగాణ బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేసే అవకాశం ఉందని సమాచారం. తొలిజాబితాలో కనీసం 35 మంది పేర్లు ఉన్నాయనే ప్రచారం మొదటి పార్టీ వర్గాల్లో జరుగుతోంది. అయితే ఈరోజు జాబితా ప్రకటిస్తే 60 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించాలని పార్టీ భావిస్తోంది. ఇతర పార్టీల అసంతప్తి నేతలు కూడా బీజేపీలో చేరే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో పార్టీ అభ్యర్థుల జాబితా ప్రకటన ఆలస్యం కానుంది. అయితే తెలంగాణ బీజేపీ అభ్యర్థుల లిస్ట్ పై నిన్న రాత్రి కిషన్ రెడ్డి నివాసంలో సుదీర్ఘంగా సమావేశం జరిగిన విషయం తెలిసిందే. అయితే తొలి జాబితాలో ఎలాంటి వివాదాలు, ఇతర పార్టీల వలసలు లేకుండా అసెంబ్లీ స్థానాల జాబితాను ప్రకటించాలని పార్టీ అధిష్టానం భావిస్తోంది. తెలంగాణ బీజేపీ ముఖ్య నేతలు ఇవాళ న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర రెమంత్రి అమిత్ షాతో భేటీ కానున్నారు. కాశీ పార్టీ అగ్రనేతలు పార్టీ నేతలకు రోడ్ మ్యాప్ ఇవ్వనున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి బీజేపీ నాయకత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. రాష్ట్రవ్యాప్తంగా ఆరు వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి గరిష్టంగా 66 దరఖాస్తులు వచ్చాయి.తెలంగాణలో ఈ దఫా అధికారాన్ని చేజిక్కించుకోవాలని కమలదళం పట్టుదలతో ఉంది. దీంతో రాష్ట్రంలో బీజేపీ జాతీయ నాయకత్వం కూడా దష్టి సారించింది. గతంలో జరిగిన హుజూరాబాద్, దుబ్బాక అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 48 కార్పొరేట్ సీట్లను గెలుచుకుంది. దీంతో బీజేపీ అధిష్టానం గత కొంత కాలంగా తెలంగాణపై ఫోకస్ పెంచింది. గతంలో యూపీలో పనిచేసిన సునీల్ భన్సాల్ నేతత్వంలోని బందం రాష్ట్రంలో పనిచేస్తోంది. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే కార్యక్రమాలపై బీజేపీ నాయకత్వం దృష్టి సారించింది. దక్షిణాదిలో కర్ణాటకలో బీజేపీ అధికారాన్ని కోల్పోయింది. దీంతో తెలంగాణలో అధికారాన్ని కైవసం చేసుకునేందుకు ఆ పార్టీ వ్యూహరచన చేస్తుంది. ఈ నెల మొదటి వారంలో ప్రధాని నరేంద్ర మోదీ రెండుసార్లు రాష్ట్రానికి వచ్చారు. తెలంగాణ ప్రజలపై వరాలు కురిపించారు. నిజామాబాద్‌లో జరిగిన సభలో బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఈ నెల 6న జరిగిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు.

# డబ్బు, మద్యం ప్రవాహాన్ని అరికట్టండి

- ఐదేళ్లలో అభ్యర్థుల ఆదాయం విపరీతంగా పెరిగింది
- రాష్ట్రంలో ఎన్నికలను ప్రహసంగా మారుస్తున్నారు
- అభ్యర్థులు ఎన్నికల నియమావళి సరిగ్గా పాటించడంలేదు
- ఎన్నికల నిర్వహణపై ఈసీ నిక్కచ్చిగా వ్యవహరించాలి
- కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం న్యాయవాదుల ఫిర్యాదు

హైదరాబాద్, అక్టోబర్ 19, (మనం న్యూస్): తెలంగాణ ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు న్యాయవాదులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయవాది జగన్ మాట్లాడుతూ.. తెలంగాణ ఎన్నికలకు సర్వం సిద్ధం అవుతున్న వేళ, కొన్ని విషయాల్లో కేంద్ర ఎన్నికల సంఘం నిక్కచ్చిగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది అని ఆయన తెలిపారు. ముఖ్యంగా 2018లో పోటీ చేసిన అభ్యర్థుల ఆధాయాలు, ఈ ఐదేళ్లలో విపరీతంగా పెరిగి పోయాయని పేర్కొన్నారు. గత అఫిడవిట్, తాజాగా సమర్పించే అఫిడవిట్లను పోల్చి చూడాలి అని చెప్పామని ఆయన వెల్లడించారు. ఈ ఐదేళ్లలో ఆదాయం ఏ విధంగా పెరిగింది.. అక్రమ పద్ధతిలోనే, సరైన మార్గంలోనా అనే విషయాన్ని ముందే పరిశీలించాలి అని సుప్రీంకోర్టు లాయర్ జగన్ అన్నారు. చాలా మంది అభ్యర్థులు ఎన్నికల నియమావళి సరిగ్గా ఫాలో కావడం లేదు.. పైగా డబ్బులు, మద్యం పంచడం తెలంగాణలో నార్మల్ అయింది.. ఎన్నికలను ప్రహసంగా మారుస్తున్నారు అని ఆయన ఆరోపించారు. దయచేసి డబ్బు, మద్యం ప్రవాహాన్ని అరికట్టి ఓటర్లను ప్రభావితం చేయకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్ దే.. ప్రస్తుత సమయంలో ఎన్నికల అధికారుల నిఘా చాలా కీలకం.. కేంద్ర ఎన్నికల సంఘానికి ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలు.. ఓట్ల కోసం ప్రకటనలు చేసే పత్రికలు, టీవీల్లోనే క్రిమినల్ కేసులపై కూడా ప్రకటనలు ఇవ్వాలి అని సుప్రీంకోర్టు న్యాయవాది జగన్ డిమాండ్ చేశారు.

## నేడు హెచ్‌సీఏ ఎన్నికలు

హైదరాబాద్, అక్టోబర్ 19, (మనం న్యూస్): నేడు హెచ్‌సీఏ ఎన్నికలు జరగనున్నాయి. అయితే, అసెంబ్లీ ఎన్నికలను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎన్నికలు తలపిస్తున్నాయి. పోటా పోటీగా ప్రెస్ మీట్ లు, ఒకరిపై ఒకరు ఆరోపణల పర్వం చేసుకుంటున్నారు. బీఆర్ఎస్-బీజేపీ మద్దతుదా రుల మధ్య పోటీ కొనసాగుతుంది. యూనైటెడ్ మెంబెర్స్ ఆఫ్ హెచ్‌సీఏ ప్యానెల్ పేరుతో జగన్మోహన్ రావు బరిలోకి దిగుతున్నారు. తమకు ప్రభుత్వ మద్దతు ఉందని ఆయన తెలిపారు. ఇక, అధ్యక్షునిగా పోటీ చేస్తున్న జగన్ మోహన్ రావు వైస్ ప్రసిడెంట్‌గా శ్రీధర్, సెక్రటరీగా హరి నారాయణ రావు, ట్రెజరర్‌గా శ్రీనివాస్ రావు, జాయింట్ సెక్రటరీగానో యెల్ డే విడ్, కౌన్సిలర్‌గా వినోద్ అన్సార్, హమ్మద్ ఖాన్ పోటీలోకి దిగు తున్నా రు. అయితే, గుడ్ గవర్నెన్స్ ప్యానెల్ పేరుతో పోటీలోకి అనిల్ కు మార్ ప్యానల్ దిగుతుంది. బీజేపీ నేతలు, హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు వి వేక్ వెంకటస్వామి, వినోద్ వెంకటస్వామి మద్దతుతో అనిల్ కుమార్ అ ధ్యక్షునిగా పోటీ చేస్తున్నారు. హెచ్‌సీఏ వైస్ ప్రసిడెంట్‌గా దళ్‌జీత్ సింగ్ సెక్రటరీగా ఆగం రావు, ట్రెజరర్‌గా మహేంద్ర, జాయింట్ సెక్రటరీగా బసవ రాజు, కౌన్సిలర్‌గా వినోద్ ఇంగ్లే బరిలోకి దిగుతున్నారు. క్రికెట్ ఫస్ట్ ప్యానెల్ పేరుతో హెచ్‌సీఏ ఎన్నికల బరిలోకి శివలాల్ యాదవ్, అర్షద్ ఆయూబ్ ప్యానల్ అధ్యక్షునిగా అమర్నాథ్ పోటీ చేస్తున్నారు. వైస్ ప్రసిడెంట్‌గా జీ.శ్రీనివాస్, ట్రెజరర్‌గా సంజీవి రెడ్డి, జాయింట్ సెక్రటరీగా చిట్టి శ్రీధర్, కౌన్సిలర్‌గా సునీల్ అగర్వాల్ ఉన్నారు.

## రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి



జాజిరెడ్డిగూడెం, అక్టోబర్ 19, (మనం న్యూస్): రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని తహసిల్దార్ జక్కిడి శ్రీనివాస్‌లు అన్నారు. గురువారం జాజిరెడ్డిగూడెం, అర్వపల్లి, పర్సాయపల్లితో పాటు పలు గ్రామాలల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని శుభ్రం చేసుకొని కేంద్రాలకు తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలకు ఏ గ్రేడ్ రూ. 2203లు బి గ్రేడ్ రూ. 2183లు పొందాలని కోరారు. కేంద్రం నిర్వహకులు ఎన్నికల కోడ్ నిబంధనలు అనుసరించి పనిచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శశిధర్‌రెడ్డి, ఏపీఎం మల్లేష్, సీసీలు నగేష్, చందు, పద్మా, రైతులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డిపై ఈడికి ఫిర్యాదు చేస్తాం

హైదరాబాద్, అక్టోబర్ 19, (మనం న్యూస్): టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ టికెట్లను కోట్ల రూపాయలకు అమ్ముకున్నారని గద్వాల్ కాంగ్రెస్ నేత కురువ విజయ్ కుమార్ ఈడికి ఫిర్యాదు చేశారు. టికెట్లు అమ్ముకున్న డబ్బులతో మనీ ల్యాండరింగ్ జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు విజయ్ కుమార్. రేవంత్ రెడ్డిపై సమగ్ర విచారణ జరపాలని ఈడీకి విజ్ఞప్తి చేశారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారితో రాత్రికి రాత్రి బేరం కుదుర్చుకొని కాంగ్రెస్ పార్టీ టికెట్ల కేటాయింపులో రేవంత్ రెడ్డి కోట్లాది రూపాయలు తీసుకున్నాడని విజయ్ కుమార్ ఆరోపించారు. ఈ సందర్భంగా వెంటనే విచారణ జరిపించాలంటూ హైదరాబాద్‌లోని ఈడీ జాయింట్ డైరెక్టర్‌కు సాక్షాలతో సహా ఫిర్యాదు చేశారు. గద్వాల చెందిన కురువ విజయ్ కుమార్, బహుదూర్ పురా నియోజకవర్గానికి చెందిన ఖాలిమ్ బాబాలతో పాటు కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నేతలు కూడా రేవంత్ రెడ్డిపై ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

## వేములవాడలో విస్తృతంగా వాహనాలు తనిఖీలు



వేములవాడ, అక్టోబర్ 19, (మనం న్యూస్): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వేములవాడ పట్టణంలోని బ్రిడ్జి వద్ద గురువారం ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి మద్యం, నగదు, మాదకద్రవ్యాలు, ప్రలోభపరిచే వస్తువులు సరఫరా కాకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తప్పనిసరిగా ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. తనిఖీల్లో సరైన ఆధారాలు లేకుండా 50 వేల కంటే ఎక్కువ అమౌంట్ తీసుకువెళ్లినట్లయితే సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు.



# ఉమెన్స్ ప్రీమియర్ లీగ్..

### 29 మందిని వదిలేసిన ఫ్రాంచైజీలు.. లిస్టును విడుదల చేసిన బీసీసీఐ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ తరహాలో బీసీసీఐ వుమెన్స్ ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తున్న విష యం తెలిసిందే. ఈ ఏడాది నిర్వహించగా.. విజయవంతమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రెండో సీజన్ –2024 రెండో సీజన్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి రంగం సిద్ధం చేస్తున్నది. ఇందులో భాగంగా రెండోసీజన్కు సంబంధించి రిటైన్ చేసిన ఆటగాళ్ల జాబితాను గురువారం విడుదల చేసింది. ఐదు ఫ్రాంచైజీలు కలిపి 60 మంది ఆటగాళ్లను అట్టిపెట్టుకోగా.. 29 మంది ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించాయి. అత్యధిక మందిని విడుదల చేసిన జట్టుగా గుజరాత్ జెయింట్స్ నిలిచింది. ఒకే జట్టు 11 మందిని వదులుకున్నది. త్వరలో నిర్వహించనున్న వేలంలో కొత్తవారిని కొనుగోలు చేయనున్నది. తొలి ఎడిషన్లో చాంపియన్గా నిలిచిన ముంబయి ఇండియన్స్ నలుగురిని తొలగించగా.. రన్నరప్గా నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ముగ్గురి ఆటగాళ్లను విడుదల చేసింది. తొలగించిన 60 మంది ఆటగాళ్లలో 21 మంది విదేశీ ప్లేయర్లు ఉండగా.. 39 మంది భారత ప్లేయర్లు ఉన్నారు. ఆర్సీబీ దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ డేన్ వాన్ నీకెర్క్ను తొలగించింది. సబ్బినేని మేఘన, సోఫియా డంక్లీ, సుష్మా వర్మతో మరికొందరిని గుజరాత్ రిలీవ్ చేసింది. కీలక ప్లేయర్లు అయిన స్మృతి మంధాన, హర్మన్ప్రీత్ కౌర్లను ఆర్సీబీ, ముంబయి ఇండియన్స్ రిటైన్ చేసుకున్నారు.

### ఢిల్లీ క్యాపిటల్స్ రిటైన్, రిలీవ్ చేసిన ప్లేయర్లు..

ఎలిస్ క్యాప్సే, అరుంధతీ రెడ్డి, జెమిమా రోడ్రిగ్జ్, జెస్ జోనాస్సెన్, అల్ హారిస్, మారిజన్ కాప్, మెగ్ లానింగ్, మిన్ను మణి, పూనమ్ యాదవ్, రాధా యాదవ్, షెఫాలీ వర్మ, శిఖా పాండే, స్నేహ దీప్తి, తాన్యా భాటియా, టిటాస్ సాధును ఢిల్లీ జట్టు రిటైన్ చేసుకున్నది. అపర్ణ మండల్, జసియా అక్తర్, తారా నోరిస్ను తప్పించింది. గుజరాత్ జెయింట్స్ ఆష్లే గార్డనర్, బెత్ మూనీ, డేలాన్ హేమ్లత, హర్లీన్ డియోల్, లారా వోల్వర్త్, షబ్నమ్ షకీల్, స్నేహ రాణా, తనూజా కన్వర్ను గుజరాత్ రిటైన్ చేసుకున్నది. అన్నాబెల్ సదర్లాండ్, అశ్వనీ కుమారి, జార్జియా వేర్హామ్, హర్లీ గాలా, కిమ్ గార్త్, మాన్సీ జోషి, మోనికా పటేల్, పరునికా సిసోడియా, సబ్బినేని మేఘన, సోఫియా డంక్లీ, సుష్మా వర్మను వదులుకున్నది. ముంబయి ఇండియన్స్ అమంజోత్ కౌర్, అమేలియా కెర్, క్లో ట్రయాన్, హర్మన్ప్రీత్ కౌర్, హేలీ మాథ్యూస్, హుమైరా కాజీ, ఇసాబెల్ వాంగ్, జింటిమణి కలితా, నటాలీ స్కీవర్, పూజా వస్త్రాకర్, ప్రియాంక బాలా, సైకా ఇషాక్, యస్తికా భాటియా రిటైన్ చేసుకుంది. ధారా గుజ్జర్, హీథర్ గ్రాహం, నీలం బిష్త్, సోనమ్ యాదవ్ను రిలీవ్ చేసింది.

### రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు

ఆశా శోభన, దిశా కస్సట్, ఎల్లీస్ పెర్రీ, హీథర్ నైట్, ఇంద్రాణి రాయ్, కనికా అహూజా, రేణుకా సింగ్, రిచా ఘోష్, శ్రేయాంక పాటిల్, స్మృతి మంధాన, సోఫీ డివైన్ అట్టిపెట్టుకోగా.. డేన్ వాన్ నీకెర్క్, ఎరిన్ బర్న్స్, కోమల్ జంజాద్, మేగాన్ షట్, పూనమ్ ఖేమ్నార్, ప్రీతి బోస్, సహానా పవార్ వదులుకున్నది.

### యూపీ వారియర్స్

అలిస్సా హీలీ, అంజలి సర్వాని, దీప్తి శర్మ, గ్రేస్ హారిస్, కిరణ్ నవ్గిరే, లారెన్ బెల్, లక్ష్మీ యాదవ్, పార్శ్వి చోప్రా, రాజేశ్వరి గైక్వాడ్, ఎస్ యశశ్రీ, శ్వేతా సెహ్రావత్, సోఫీ ఎక్లెస్టోన్, తహ్లియా మెక్గ్రాత్ను రిటైన్ చేసుకోగా.. దేవికా వైద్య, షబ్నం ఇస్మాయిల్, శివలీ షిండే, సిమ్రాన్ షేక్ను రిలీవ్ చేసింది.

# తోకముడిచిన బంగ్లా పులులు.. టీమిండియా ఈజీ విక్టరీ.. కోహ్లి శతకం

అఫ్ఘానిస్తాన్, నెదర్లాండ్స్ అగ్రశ్రేణి జట్లకు షాకులివ్వడంతో భారత్ – బంగ్లాదేశ్ మ్యాచ్లో కూడా అలాంటి ఫలితమేమైనా పునరావతమవుతుందేమోనని భావించిన క్రికెట్ విశ్లేషకుల అంచనాలు తలకిందులయ్యాయి. సంచలనాలను పక్కనబెడితే బంగ్లా పులులు రోహిత్ సేనకు కనీస పోటీని కూడా ఇవ్వలేకపోయారు. వన్డే వరల్ కప్లో భాగంగా పూణే వేదికగా ఇరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్లో తొలుత బంగ్లాను 257 పరుగుల టార్గెట్ ను భారత్.. లక్ష్యాన్ని 41.3 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది.



ఛేదనలో మొనగాడు విరాట్ కోహ్లి (97 బంతుల్లో 103 నాటౌట్, 6 ఫోర్లు, 4 సిక్సర్లు)కి శతకానికి తోడు శుభ్మన్ గిల్ (55 బంతుల్లో 53, 5 ఫోర్లు, 2 సిక్సర్లు), రోహిత్ శర్మ (40 బంతుల్లో 48, 7 ఫోర్లు, 2 సిక్సర్లు), ఆఖర్లో కెఎల్ రాహుల్ (34 బంతుల్లో 34 నాటౌట్, 3 ఫోర్లు, 1సిక్సర్) రాణించడంతో భారత్ ఈజీ విక్టరీ కొట్టింది. వన్డే ప్రపంచకప్ లో భారత్కు నాలుగో విజయం కాగా బంగ్లాదేశ్కు ఆడిన నాలుగు మ్యాచ్లలో మూడో ఓటమి. లక్ష్య ఛేదనను భారత్ ధాటిగా ఆరంభించింది. ఓపెనర్లు రోహిత్ శర్మ, శుభ్మన్ గిల్ లు తొలి వికెట్ కు 12.4 ఓవర్లలో 88 పరుగులు జోడించారు. ఈ ఇరువురూ కలిసి తొలి పవర్ ప్లేలోనే భారత్ను విజయం దిశగా నడిపించారు. రోహిత్ తటిలో అర్ధ సెంచరీ కోల్పోయినా 52 బంతుల్లో గిల్ హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. వన్డే ప్రపంచకప్లో గిల్కు ఇదే తొలి అర్ధ సెంచరీ కావడం విశేషం. రోహిత్ నిష్క్రమణ తర్వాత క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లి కూడా అదే దూకుడును కొనసాగించాడు. ఆడిన తొలి మూడు బంతుల్లోనే 4, 6 బాది తన ఉద్దేశాన్ని చాటిన కోహ్లి.. 48 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. నాలుగో స్థానంలో వచ్చిన శ్రేయాస్ అయ్యర్ (25 బంతుల్లో 19, 2 ఫోర్లు)ఆశించిన స్థాయిలో రాణించలేదు. శ్రేయాస్ను మెహిది హసన్ మిరాజ్ ఔట్ చేశాడు.

అయ్యర్ నిష్క్రమించినా కెఎల్ రాహుల్తో కలిసి కోహ్లి భారత్ను విజయం దిశగా నడిపించాడు. చివర్లో భారత్ విజయం కంటే కూడా కోహ్లి శతకం చేస్తాడా..? లేదా..? అన్న ఆందోళన భారత అభిమానులను వేధించింది. ఒక వైపు కెఎల్ రాహుల్ మ్యాచ్ను ముగించేందుకు ధాటిగా ఆడటంతో ఆ ఆందోళన మరింత ఎక్కువైంది. కానీ ఒక్కో పరుగు కూడబెడుతూ 90లలోకి వచ్చిన కోహ్లి.. నసుమ్ వేసిన 42వ ఓవర్ మూడో బంతికి సిక్సర్బాది సెంచరీ చేయడమే గాక భారత విజయాన్ని ఖాయం చేశాడు. అంతకుముందు బంగ్లాదేశ్ ఈ మ్యాచ్లో తొలుత టాస్ గెలిచి నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది.

# తడబడినా నిలబడ్డ బంగ్లా.. భారత్ లక్ష్యం ఎంతంటే!



భారత్ – బంగ్లాదేశ్ మధ్య పూణే వేదికగా జరుగుతున్న వన్డే వరల్డ్కప్ 17వ లీగ్ మ్యాచ్లో బంగ్లా జట్టు ఎప్పటిలాగే తడబడినా నిలబడింది. మిడిల్ ఓవర్లలో తడబడ్డా ఆఖర్లో పుంజుకంది. ఓపెనర్లు శివాలెత్తినా ఆ తర్వాత భారత బౌలర్లు జోరు పెంచి ఆ జట్టు దూకుడుకు అడ్డుకట్ట వేయగలిగినా ఆఖర్లో మళ్లీ చేతులెత్తేయడంతో నిర్ణీత 50 ఓవర్లలో ఆ జట్టు 8 వికెట్లు కోల్పోయి 256 పరుగులు చేసింది. లిటన్ దాస్ (82 బంతుల్లో 66 , 7 ఫోర్లు), తాంజిద్ హసన్ (43 బంతుల్లో 51, 5 ఫోర్లు, 3 సిక్సర్లు) మాత్రమే మెరవగా.. వికెట్ కీపర్ ముష్ఫికర్ రహీమ్ (46 బంతుల్లో 38, 1 ఫోర్, 1 సిక్సర్) ఫర్వాలేదనిపించాడు. ఆఖర్లో మహ్మదుల్లా (36 బంతుల్లో 46, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) ధాటిగా ఆడి బంగ్లా స్కోరును 250 మార్కును దాటించాడు. పూణేలోని మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ వేదికగా జరుగుతున్న మ్యాచ్లో టాస్ గెలిచిన బంగ్లా తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. షకిబ్ అల్ హసన్ గైర్హాజరీలో బంగ్లాదేశుకు నజ్ముల్ హోసెన్ శాంతో సారథిగా వ్యవహరించాడు. తొలుత ఐదు ఓవర్లలో పరుగులు చేయడానికి తంటాలు పడ్డ ఓపెనర్లు తాంజిద్, లిటన్ దాస్ లు తర్వాత జూలు విదిల్చారు. సిరాజ్, శార్దూల్ లక్ష్యంగా ఓపెనింగ్ జోడీ వీరవిహారం చేసింది. 41 బంతుల్లో అర్ధ సెంచరీ చేసుకున్న తాంజిద్.. కుల్దీప్ వేసిన 14.4వ ఓవర్లో ఎల్బీగా నిష్క్రమించాడు. దీంతో 93 పరుగుల తొలి వికెట్ భాగస్వామానికి తెరపడింది. కెప్టెన్ శాంతో (8)ను జడేజా పెవిలియన్కు పంపగా క్రీజులో కుదురుకుంటే ప్రమాదకరంగా మారే మెహిది హసన్ మిరాజ్ను సిరాజ్ తన సెకండ్ స్పెల్లో తొలి బంతికే ఔట్ చేశాడు. బ్యాట్ లోపల తాకి లెగ్ స్టంప్ దిశగా వెళ్తున్న బంతిని రాహుల్ పక్కకు డైవ్ చేస్తూ అద్భుత క్యాచ్ అందుకున్నాడు. లిటన్ దాస్ను కూడా జడ్డూ పెవిలియన్కు పంపడంతో బంగ్లా ఆత్మరక్షణలో పడింది. తౌహిద్ హృదయ్ (16)తో కలిసి ఐదో వికెట్కు 42 పరుగులు జోడించిన ముష్ఫికర్ బంగ్లా ఇన్నింగ్స్ను చక్కదిద్దే యత్నం చేశాడు. కానీ శార్దూల్ ఠాకూర్ వేసిన 37వ ఓవర్ రెండో బంతికి తౌహిద్.. గిల్ చేతికి చిక్కాడు. ముష్ఫి కర్ కూడా బుమ్రా బౌలింగ్లో జడ్డూకు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు. ఆఖర్లో మహ్మదుల్లా ధాటిగా ఆడి బంగ్లాకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. మిడిల్ ఓవర్లో లైన్ అండ్ లెంగ్తో బౌలింగ్ వేసిన భారత బౌలర్లు.. చివర్లో మళ్లీ చేతులెత్తేయడంతో బంగ్లా పోరాడగలిగే స్కోరును భారత్ ముందు నిలిపింది. టీమిండియా బౌలర్లలో బుమ్రా, సిరాజ్ జడేజా రెండు వికెట్లు పడగొట్టారు. కుల్దీప్ యాదవ్, శార్దూల్ ఠాకూర్లు తలా వికెట్ తీశారు. ఈ మ్యాచ్లో గెలవాలంటే భారత్.. 50 ఓవర్లలో 257 పరుగులు చేయాల్సి ఉంది.




మనం సినిమా manamcinema

# ఆమె నాపై ఒత్తిడి తీసుకువచ్చింది



'కుమారి శ్రీమతి'తో విజయాన్ని అందుకున్నారు నటి నిత్యామేనన్. ఫ్యామిలీ ఎంటర్టైనర్ తెరకెక్కిన ఈ సిరీస్లో 30 ఏళ్లు వయసు వచ్చినా పెళ్లి చేసుకోవడానికి ఆసక్తి కనబర్చని యువతి పాత్రలో ఆమె నటించారు. ఈ సిరీస్ సక్సెస్లో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిత్యామేనన్ తన పెళ్లి గురించి మాట్లాడారు. కుటుంబసభ్యుల నుంచి ప్రస్తుతానికి ఎలాంటి ఒత్తిడి లేదన్నారు. ''మా మామ్మ బతికి ఉన్నప్పుడు పెళ్లి విషయంలో నాపై ఒత్తిడి తీసుకువచ్చింది. నటిగా నేను ఉన్నానన్న విషయాన్ని కూడా ఆమె లెక్కచేసేది కాదు. 'నువ్వు ఏం చేస్తున్నావు? జీవితంలో ఏదైనా సాధించావా? పెళ్లి చేసుకోవచ్చు కదా' అని తరచూ అడుగుతుండేది. ఆమె కాకుండా వేరే ఎవరూ ఈ విషయంలో నన్ను ఒత్తిడికి గురి చేయలేదు. ముఖ్యంగా నా తల్లిదండ్రులు నాకు స్వేచ్ఛనిచ్చారు. వాళ్లు నా ఇష్టాన్ని గౌరవి స్తారు. అందువల్లే నేను ఈ స్థాయికి రాగలి గాను'' అని నిత్యామేనన్ చెప్పారు. 'కుమారి శ్రీమతి' విషయానికి వస్తే.. రాజమహేంద్రవరం నేపథ్యంలో ఫీల్గుడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్గా ఇది తెరకెక్కింది. గోమతేష్ ఉపాధ్యాయ్ దర్శ కుడు. స్వప్న సినిమాస్ బ్యానర్పై నిర్మితమైన ఈ సిరీస్.. ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ అందుకుంది.

## ఆస్కార్ అకాడమీ కొత్త మెంబర్గా జూ.ఎన్టీఆర్



మన టాలీవుడ్ నుంచి వచ్చిన ఒక బిగ్గెస్ట్ గ్లోబల్ సెన్సేషన్ చిత్రం రౌద్రం రణం రుధిరం చిత్రంతో అయితే ఈ సినిమా స్టార్స్ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి అలాగే హీరోలు మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ మరియు యంగ్ టైగర్ ఎన్టీఆర్లకి గ్లోబల్ వైడ్ గా ఎలాంటి రీచ్ వచ్చిందో అందరికీ తెలిసిందే. మరి ఈ చిత్రం అయితే తన నాటు నాటు సాంగ్కి గాను రెండు ఆస్కార్ అవార్డ్స్ కూడా గెలిచి చరిత్ర సృష్టించింది. మరి లేటెస్ట్ గా అయితే ఈ సినిమా హీరో యంగ్ టైగర్ ఎన్టీఆర్ విషయంలో ఆస్కార్ అకాడమీ వారి నుంచి ఓ ఊహించని అప్డేట్ రాగా తమ అకాడమీ కొత్త మెంబర్స్ లిస్ట్ ని యాక్టర్స్ బ్రాంచ్లో వారు అధికారికంగా అనౌన్స్ చేశారు. మరి వీరిలో టాలెంటెడ్ హీరో యంగ్ టైగర్ ఎన్టీఆర్కి కూడా ఆహ్వానం అందిస్తున్నాము అని కన్ఫర్మ్ చేశారు. దీనితో ఈ అంశం మన టాలీవుడ్ హీరోస్ విషయంలో ఒక ప్రైడ్ మూమెంట్గా నిలిచింది అని చెప్పాలి. దీనితో ఈ న్యూస్ విన్న తారక్ అభిమానులు కాలర్ ఎగరేస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## 'భగవంత్ కేసరి'లో రతిక..?

నందమూరి బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి దసరా సందర్భంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో కాజల్ అగర్వాల్, శ్రీ లీల కీలక పాత్రల్లో నటించాడు. షైన్ స్క్రీన్స్ బ్యానర్ మీద హరీష్ పెద్ది, సాహు గారపాటి నిర్మించిన ఈ సినిమాకి మొదటి ఆట నుంచే పాజిటివ్ టాక్ వస్తోంది. ఇక ఈ సినిమాలో తెలుగు అమ్మాయి, బిగ్బాస్ బ్యూటీ రతికా రోజ్ ఒక చిన్న పాత్రలో మెరిసింది. నిజానికి ఇది చిన్న పాత్రే అయినా రతికకు ఈ టైంలో మంచి ఛాన్స్ అనే చెప్పాలి. నిజానికి ఆమె కనుక బిగ్ బాస్లోకి వెళ్లకపోయి ఉంటే ఆమె ఈ పాత్ర చేసిందని కూడా ఎవరూ గుర్తించేవారు కాదు కానీ బిగ్ బాస్ గుర్తింపుతో ఆమెను ఇట్టే గుర్తుపెట్టేస్తున్నారు జనాలు. ఇక ఈ సినిమా విషయంలో రతికా ఫ్యాన్స్ తెగ ఖుషీగా ఉన్నారు. ఊహించని విధంగా సినిమాలో రతికాను చూసిన తెలుగు ప్రేక్షకులు కూడా షాక్ అవుతున్నారు. ఇక రతికా రోజ్ ఈ సినిమాలో ఒక మహిళా మంత్రి పాత్రలో కనిపించింది. ఎక్కువ సేపు లేకపోయినా ఒకటి రెండు డైలాగులు కూడా ఆమెకు దక్కాయి. ఇక బిగ్ బాస్ 7 హౌస్లోకి ఎంట్రీ ఇచ్చిన రతికా రోజ్ నాలుగో వారంలోనే ఎలిమినేట్ అయింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana and Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. E-mail Id: editor@manamnews.com.